

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50


కోఠిలో ఫ్రీ లెఫ్ట్‌కి అడ్డుగా..

ఫ్రీ లెఫ్ట్

జంక్షన్ల వద్ద నామ్ కే వాస్తేగా మారిపోయిన ఫ్రీ లెఫ్ట్ టర్న్

ఈ మార్గంలో ఆగిపోతున్న వాహనాలు

జంక్షన్లు ఇరుకుకావడమే అసలు కారణం


ఉల్లంఘనలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా నగరవాసిలో కనిపించని మార్పు

మహానగరంలోని అనేక కీలక జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అవలంబిస్తున్నారు. దీని అమలు కోసం ప్రత్యేకంగా బోర్డులు, బొల్లార్డ్స్‌గా పిలిచే ప్లాస్టిక్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ విభాగంలో నెలకొన్న మానవ వనరుల లేమి, వాహనచోదకుల్లో కొరవడిన స్పృహ, అవసరమైనంత విస్తరణలో లేని జంక్షన్లు... వెరసి ఈ ఫ్రీ లెఫ్ట్ అనేది నగరంలో నామ్ కే వాస్తేగా మారిపోయింది.

→ రాజధానిలో ఫ్రీ లెఫ్ట్ విధానం 2011లో సీవీ ఆనంద్ నగర ట్రాఫిక్ విభాగానికి అదనపు సీపీగా ఉండగా ప్రారంభమైంది. అయితే నగరంలో ఉన్న ప్రతి చౌరస్తాలోనూ ఫ్రీ లెఫ్ట్‌కు అవకాశం ఉండట్లేదు. ఈ నేపథ్యంలోనే అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని 61 జంక్షన్లతో ఈ విధానం ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో మార్కింగ్స్ సైతం చేయించారు. తొలి నాళ్లలో కానిస్టేబుల్ లేదా హోంగార్డును ఈ ఫ్రీ లెఫ్ట్ వద్ద నియమించారు. క్రమంగా నగరంలోని జంక్షన్లతోపాటు ఫ్రీ లెఫ్ట్ అమలు చేస్తున్న ప్రాంతాలూ పెరిగాయి. అయితే ఈ స్థాయిలో సిబ్బంది పెరగలేదు. దీంతో బొల్లార్డ్స్ ఏర్పాటు చేసి వాటికి తాడు కట్టి సరిపెడుతున్నారు. ఈ విధానం హైదరాబాద్ కమిషనరేట్ నుంచి మిగిలిన రెండు కమిషనరేట్లకూ విస్తరించినా అనివార్య కారణాలతో అధిక జంక్షన్లలో పక్కాగా అమలు కావట్లేదు. ఈ ఉల్లంఘనకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా నగరవాసిలో మార్పు కనిపించట్లేదు. - సాక్షి, హైదరాబాద్

ఏదైనా చౌరస్తాలో రెడ్ సిగ్నల్ పడినప్పుడు చివరలో వచ్చిన వాహనచోదకుడు గ్రీన్‌లైన్ పడిన వెంటనే ముందుగా వెళ్లాలని ఆశిస్తున్నాడు. ఫలితంగానే అప్పటివరకు ఆగిఉన్న వాహనాలను ఓవర్‌టేక్ చేసుకుని వచ్చి ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేస్తున్నాడు. ఫలితంగా ఆ జంక్షన్‌లో ఆగాల్సిన పని లేకుండా ఎడమ వైపునకు వెళ్లాల్సిన ట్రాఫిక్ సైతం ఆగిపోయి జామ్స్ ఏర్పడుతున్నాయి. ఓ జంక్షన్‌లో ఫ్రీ లెఫ్ట్‌కు అనుమతి ఇవ్వాలంటే కొన్ని ప్రమాణాలు పాటించాల్సిందే. నేరు గా, కుడివైపునకు వెళ్లాల్సిన వాహనాల స్థలం మినహాయించాలి. ఆపై లెఫ్ట్‌కు వెళ్లే వాహనాల కోసం కనీసం 11 అడుగుల రోడ్డు కేటాయించాలి. అయితే అనేక జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్‌కు గరిష్ఠంగా 8 అడుగులు కూడా వదల్లేని పరిస్థితి. ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని 125 జంక్షన్లను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేసి, ఫ్రీ లెఫ్ట్‌లు అమల్లోకి తేవాలని నిర్ణయించారు.

ఇరుకైన జంక్షన్లే అధికం..



హైదరాబాద్‌లో ఉన్న అత్యంత కీలకమైన చౌరస్తాల్లో పంజగుట్ట ఒకటి. ఈ జంక్షన్ విషయాన్నే తీసుకుంటే ఖైరతాబాద్ నుంచి వచ్చే వాహనాలు నాగార్జున చౌరస్తా వైపు, నాగార్జున చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలు అమీర్‌పేట వైపు, అమీర్‌పేట వైపు నుంచి వచ్చే వాహనాలు బేగంపేట వైపు, బేగంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ వైపు... ఫ్రీ లెఫ్ట్ తీసుకునే అవకాశం ఉంది. అయితే వీటిలో కొన్ని మార్గాలు ఇరుకుగా, మరికొన్నింటిలో అక్రమ పార్కింగ్ కారణంగా ఈ 'వీఐపీ చౌరస్తా'లోనూ ఫ్రీ లెఫ్ట్ పూర్తి స్థాయిలో అమలు కావట్లేదు. కొన్ని జంక్షన్లు అవసరమైనంత విశాలంగా ఉంటున్నా.. వీటికి సమీపంలోని వ్యాపార సముదాయాలు, ఆటోల అక్రమ పార్కింగ్‌తో ఫ్రీ లెఫ్ట్‌ల్లోకి వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోతున్నాయి. అదీగాక అనేక జంక్షన్లకు సమీపంలోనే ఆర్టీసీ సిటీ బస్‌స్టాపులున్నాయి. ఇవి ఫ్రీ లెఫ్ట్‌కు సమీపంలోనే ఉండటంతో అటు వైపు వెళ్లాల్సిన వాహనాలు ఆగడం అనివార్యంగా మారుతోంది.

అక్రమ పార్కింగ్‌తో మరో కష్టం


అవీ ఇవీ..

గ్రేటర్‌లోని రహదారులు	వాహనాల సంఖ్య	ప్రధాన కూడళ్లు
9,103 కి.మీ.	80,00,000	404
ఫ్రీ లెఫ్ట్ అమల్లో ఉన్న కూడళ్లు..	అత్యంత సమస్యాత్మక జంక్షన్లు	గత ఏడాది ఫ్రీ లెఫ్ట్ ఉల్లంఘన కేసులు..
దాదాపు 150	దాదాపు 50	92,216

ఫ్రీ లెఫ్ట్ ఉంటే రోడ్డు ఎలా దాటాలి?

→ మౌలిక వసతులలేమి, కొరవడిన అవగాహన, ర్యాష్ డ్రైవింగ్... ఇలా అనేక కారణాల వల్ల నగరం పాదచారులకు అంత సురక్షితంగా లేదని అంటున్నారు. రోడ్డు ప్రమాద మృతుల్లో దాదాపు 40 శాతం పాదచారులే ఉంటున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్స్, అండర్ పాస్‌లు అవసరమైన స్థాయిలో లేవు. దీంతో కీలక జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్ అమలైతే పాదచారులు రోడ్డు దాటడం మరింత ఇబ్బందికరం అవుతుందని నిపుణులు వాదిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఓ వ్యక్తి రోడ్డు దాటాలంటే చౌరస్తాలనే ఆశ్రయిస్తున్నాడు. అక్కడ సిగ్నల్‌లో రెడ్ లైట్ పడి వాహనాలు ఆగినప్పుడు జీబ్రా క్రాసింగ్స్ మీదుగా రోడ్డు దాటుతున్నాడు. ఫ్రీ లెఫ్ట్ ఉన్న చోట రెడ్ లైట్ పడినా... ఎడమ వైపునకు వెళ్లే వాహనాలు వెళ్తూనే ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో అక్కడ ట్రాఫిక్ పోలీసులు ఉండి, వాటిని ఆపడమో, పెలికాన్ సిగ్నల్ ఏర్పాటు చేయడమో లేకపోతే ఆ మాత్రం రోడ్డు దాటే అవకాశమూ పాదచారికి ఉండదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వినియోగించుకుంటాం



→ నగరంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములు కానున్నారు. తొలి విడతలో 600 మందికి శిక్షణ ఇస్తున్నాం. వీరి సేవల్ని జంక్షన్ల వద్ద వినియోగించుకుంటాం. ప్రధానంగా ఫ్రీ లెఫ్ట్, జీబ్రా క్రాసింగ్, హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, లైన్ డిసిప్లిన్ తదితరాల అమలుకు వీరి సేవలు వినియోగించుకుంటాం. ప్రపంచంలో ఉన్న వాహనాల్లో 1 శాతం, రోడ్లలో 2 శాతం మాత్రమే భారత్‌లో ఉన్నాయి. అయితే ప్రపంచంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 11 శాతం ఇక్కడే చోటు చేసుకుంటున్నాయి. రహదారి నిబంధనలు, చట్టాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రతిరోజూ 15 వేల మంది ఉల్లంఘనులకు చలాన్లు విధిస్తున్నాం. అయితే దీనికంటే నిబంధనలపై అవగాహన కల్పిస్తూ చైతన్యపరచడమే కీలకం. ఈ దిశలోనే ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వినియోగించుకుంటాం.

- ఎన్.విశ్వప్రసాద్, ట్రాఫిక్ అదనపు సీపీ

నేచర్‌లో వర్క్..

ఐటీ జాబ్ అంటే వరుస మీటింగ్‌లు, టార్గెట్లతో బిజీబిజీ.. వీకెండ్ వస్తే తప్ప వ్యక్తిగత జీవితానికీ, కుటుంబానికీ టైం ఇవ్వలేని పరిస్థితి. అలా కాకుండా ఉద్యోగమే పచ్చని చెట్ల కింద, చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం, జీవ వైవిధ్యం మధ్యలో ఉంటే.. ఎంత బాగుంటుందో కదూ! అవును.. అచ్చం అలాంటి వాతావరణాన్నే కోరుకుంటున్నారు నేటి యువ ఐటీ ఉద్యోగులు, ఆంట్రప్రెన్యూర్లు. వీరి అభిరుచికి తగ్గట్టుగానే పలు నిర్మాణ సంస్థలు 'కలెక్టివ్ ఫామింగ్ గేటెడ్ కమ్యూనిటీ'లకు శ్రీకారం చుట్టాయి. ఈ నయా ట్రెండ్ గురించే ఈ కథనం..

'కలెక్టివ్ ఫామింగ్ గేటెడ్ కమ్యూనిటీ'లతో కొత్త ట్రెండ్

కాలుష్యానికి దూరంగా.. ఆరోగ్యానికి దగ్గరగా

పచ్చని చెట్ల కిందే ఐటీ ఉద్యోగుల జాబ్

చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం

హైస్పీడ్ ఇంటర్నెట్, మీటింగ్ హాల్స్ సదుపాయం.. వారాంతంలో కుటుంబంతో కలిసి అక్కడే ఎంజాయ్

11లో





పెట్.. లాస్ట్ సెట్

అందుబాటులోకి పెట్ క్రిమటోరియంలు

సంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు

రూ. 2500 ఫీజు చెల్లిస్తే చాలు

డయల్ చేస్తే ఇంటికే అంతిమయాత్ర వాహనం

- వివరాలు 11లో



గోల్కొండ కోట ఎలా ఉంది?

విదేశీ పర్యాటకులకు మంత్రి సురేఖ పలకరింపు

గోల్కొండ: గోల్కొండ కోట ఎలా ఉంది?.. కోట సందర్శన మీకెలాంటి అనుభూతులు మిగిల్చాయని.. మంత్రి కొండా సురేఖ విదేశీ పర్యాటకులను ప్రశ్నించారు. గోల్కొండ కోటకు బుధవారం వచ్చిన ఆమె.. అక్కడ పర్యటిస్తున్న విదేశీ పర్యాట కులతో కాసేపు ముచ్చటించారు. గోల్కొండ కోటకు ఎన్నో ప్రత్యేకతలున్నాయని.. ఈ చారిత్రక కట్టడం నేటికీ చెక్కుచెదర లేదని వారికి వివరించారు. గోల్కొండ కోట గురించి ఎంతోకాలంగా వింటున్న తాము.. ఈ కట్టడాన్ని చూసేందుకు భారత్ వచ్చామని విదేశీ పర్యాటకులు సమా ధానమిచ్చారు. భారత్‌లోని చూడదగ్గ ప్రదే శాల్లో తాజ్‌మహల్ తరువాత గోల్కొండ కోట ఒక్కటేనని వారు చెప్పడం విశేషం. బోనాల ఏర్పాట్లపై అధికారులతో బుధవారం గోల్కొండ కోటలో కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ విదేశీయులతో మాట్లాడారు.

- సిటీ, శివారు జిల్లాల్లో తగ్గిపోతున్న పాడి పశువులు
- పాల డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం
- దీంతో అడ్డదారులు తొక్కుతున్న వ్యాపారులు
- నీళ్లు కలపడం నుంచి యూరియా, రసాయనాలతో కల్తీ
- వివిధ డెయిరీల పేరిట నకిలీ ప్యాకింగ్‌లలో విక్రయాలు
- ఫుడ్ ఇన్స్‌పెక్టర్ల తనిఖీల్లో బయట పడిన నాణ్యత లోపాలు
- కల్తీ పాలతో ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న వైద్య నిపుణులు



తెల్లనివన్నీ పాలు కాదు.. పాలు అనుకుని మనం తాగుతున్నవన్నీ అచ్చమైన పాలు కానే కాదు.. కుళాయి నీళ్ల నుంచి యూరియా, ఇతర రసాయనాల దాకా ఏవేవో కలిపిన కల్తీ పాలు.. నకిలీ పాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పెరిగిపోయి.. పాడి పశువుల పెంపకం తగ్గిపోయి.. పాల ఉత్పత్తి పడిపోతోంది. నగరంలో డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీగా వ్యత్యాసం ఏర్పడుతోంది. దీనితో కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కి.. కల్తీ, నకిలీ పాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

తెల్లనివన్నీ పాలు కాదు!

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా కల్తీ పాల విక్రయాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా

→ గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాలకు కలిపి రోజుకు సగటున 28 లక్షల లీటర్ల పాలు అవసరమని అంచనా. ఇందులో 22 లక్షల లీటర్లు పాల ప్యాకెట్ల రూపంలో సరఫరా అవుతున్నాయి. డెయిరీ రైతులు, డబ్బావాలాలు, ఇతర వ్యాపారులు నేరుగా మరో ఆరు లక్షల లీటర్లు విక్రయిస్తున్నారు. ఇందులో పెద్ద సంఖ్యలో రెండు, మూడు లక్షల లీటర్ల మేర కల్తీ చేసినవో, కృత్రిమంగా తయారు చేసినవో ఉంటున్నాయని అంచనా. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు ఇటీవల చేవెళ్ల, నందిగామ, ఆల్మాస్‌గూడ, నాదర్‌గుల్, ముచ్చింతల్, పసుమాములలోని పలు ప్రైవేటు డెయిరీల నుంచి నమూనాలు సేకరించి.. పరిశీలించగా అక్రమాలు వెలుగుచూశాయి. నిర్దేశించిన ప్రమాణాల మేరకు పాలు లేకపోవడంతో ఆయా డెయిరీల యజమాన్యాలకు నోటీసులు కూడా జారీ చేసినట్టు అధికారులు చెప్తున్నారు.

ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు.. బీర్ దాణా

→ పాలకు డిమాండ్ నేపథ్యంలో కొందరు డెయిరీల నిర్వాహకులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు అడ్డగోలు మార్గం పడుతున్నారు. అధిక పాల దిగుబడి కోసం గేదెలు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ప్రమాదకరమైన 'బీర్ దాణా' తాగిస్తున్నారు. దీనికితోడు పాలలో పాలపొడి, కుళాయి నీళ్ల, రసాయనాలు కలుపుతూ కల్తీ చేస్తున్నారు. ఆ పాలు నాసిరకంగా, రుచి లేకుండా ఉంటున్నాయి. పెరుగు తోడుకోకపోవడం, తోడుకున్న పెరుగు కూడా సాయంత్రానికే దుర్వాసన వెదజల్లుతుండటం వంటివి జరుగుతున్నాయి.



ఇదీ పాడి లెక్క



→ ఒకప్పుడు సిటీలో వాడే పాలలో చాలా వరకు శివారు జిల్లాల్లోని వ్యక్తిగత డెయిరీల నుంచే సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆవులు, గేదెల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలో 27,068 గోజాతి, 59,895 గేదె జాతి పశువులు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 1,88,182 గోజాతి, 1,22,587 గేదె జాతి పశువులు ఉన్నాయి. వీటిలో 1,25,246 ఆవులు, గేదెలు మాత్రమే పాలు ఇస్తున్నట్టు గుర్తించారు. వాటి నుంచి రోజుకు సగటున 5,56,055 లీటర్ల పాల దిగుబడి వస్తుండగా.. అందులో 43,688 లీటర్లు రైతులు సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. 97,998 లీటర్లు ప్రభుత్వ డెయిరీలకు విక్రయిస్తున్నారు. మరో 1,80,382 లీటర్ల పాలను స్వయంగా ఔట్‌లెట్లు తెరిచి విక్రయిస్తున్నారు. ఇంటింటా తిరిగి పాలు పోసే డబ్బావాలాలు మరో 1,27,965 లీటర్ల మేర అమ్ముతున్నారు. ప్రైవేటు డెయిరీలు 1,60,556 లీటర్లు విక్రయిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ సరిహద్దు జిల్లాల నుంచి కూడా నగరానికి పాలు దిగుమతి అవుతున్నాయి.

కృత్రిమంగా పాలు తయారు చేస్తూ..

→ ఇటీవల రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్తి మేడిపల్లికి చెందిన ఓ పాడి రైతు ఇంటిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. కృత్రిమంగా తయారు చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 120 లీటర్ల కృత్రిమ పాలు, పది పాల పౌడర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు కూడా నమోదు చేశారు.

→ పాశమైలారానికి చెందిన ఓ వ్యాపారి.. స్థానికంగా మూతపడ్డ ఓ పరిశ్రమను అద్దెకు తీసుకుని, గుట్టుగా కల్తీ పాలు తయారు చేయడం మొదలుపెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఓ ప్రముఖ డెయిరీ లేబుళ్లతో కల్తీ పాలు, పెరుగు, ఇతర పాల పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి అరెస్ట్ చేశారు.

పాల స్వచ్ఛతను గుర్తించొచ్చు ఇలా..

→ స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద గడ్డకడతాయి. ఒకవేళ అంతకన్నా తక్కువ ఉష్ణోగ్రత వద్ద గడ్డకడితే అందులో నీళ్లు కలిశాయని అర్థం.

→ లాక్టోమీటర్ సాయంతో పాలలోని కొవ్వు, ఇతర ఘనపదార్థాలు ఎంత శాతం ఉన్నాయో గుర్తించవచ్చు.

→ పాలను వేడి చేసినప్పుడు వచ్చే ఆవిరి.. మూతపై నీటిలా ఏర్పడితే సరే. అలాకాకుండా స్ఫటికాల్లా ఏర్పడితే యూరియా కలిసి ఉండే చాన్స్ ఎక్కువ.

→ స్వచ్ఛమైన పాలను నున్నటి తలంపై వేస్తే.. అది పారినంత మేర తెల్లటి చార ఏర్పడుతుంది. అలా చార ఏర్పడకుంటే.. నీళ్లు ఎక్కువగా కలిసినట్టే.

→ వేడి చేసినప్పుడు పాలపై పసుపు రంగులో మీగడ ఏర్పడటం, పెరుగు సరిగా తోడుకోకపోవడం జరిగితే.. అందులో వనస్పతి కలిసి ఉన్నట్టే.

→ పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతుంటారు. అలాంటి పాలను మరిగించి, తోడు వేస్తే పెరుగు సరిగా ఏర్పడదు. అంతా నీళ్లలా కనిపిస్తుంది.

పాలలో ఎన్నో రసాయనాలు కలుపుతున్నారు..

→ పాడి పశువుల సంఖ్య తగ్గి, పాలలో కల్తీ పెరిగింది. నీళ్లు కలిపితే పెద్దగా నష్టం లేదు. కానీ పాలు చిక్కగా కనిపించేందుకు కార్న్‌ఫ్లోర్.. వెన్నశాతం కోసం యూరియా, వనస్పతి వంటివి కలుపుతున్నారు. పాలు విరిగిపోకుండా ఉండేందుకు డిటర్జెంట్స్, తినే సోడా, అమ్మోనియం సల్ఫేట్, హైడ్రోజన్ పెరాక్సైడ్, రుచి మారకుండా ఉండేందుకు బోరిక్ యాసిడ్ కలుపుతున్నారు. అలాంటి పాలు తాగడం ప్రమాదకరం. అయోడిన్ సొల్యూషన్‌తో పాలను పరీక్షించడం ద్వారా పిండి పదార్థాలు కలిపారా? రెడ్ లిట్మస్ పేపర్ ద్వారా యూరియా కలిపారా గుర్తించొచ్చు.

– ఎస్.రాజు, రసాయన శాస్త్రవేత్త

ఆ పాలు తాగితే అనారోగ్యమే..

→ కొందరు పాల విక్రేతలు, చిన్న డెయిరీల నిర్వాహకులు పాల కల్తీకి పాల్పడుతున్నారు. ప్యాకెట్ పాలను నమ్మకుండా.. బయట కొనేవారి బలహీనతను ఆసరాగా చేసుకుని అక్రమ మార్గం పడుతున్నారు. అపరిశుభ్ర పరిస్థితులతో.. వాటిలో ఈ-కొలి వంటి ప్రమాదకర బ్యాక్టీరియా చేరుతోంది. సరిగా మరిగించకుండా తాగితే రోగాల బారినపడటం ఖాయం. రసాయనాలు కలిపిన పాలు వాడితే అనారోగ్యమే.

– డాక్టర్ అమరవాది ప్రభాకరాచారి, సీనియర్ సర్జన్ (రిటైర్డ్)

సబ్ స్టాండర్డ్ కేసులే..

→ ప్రైవేటు డెయిరీల నిర్వాహకులు సరఫరా చేసే పాలు, ప్యాకెట్ పాల నాణ్యతా ప్రమాణాలను తరచూ పరిశీలిస్తున్నాం. చాలా వరకు సబ్ స్టాండర్డ్ (వెన్నశాతం, నాణ్యతలో తేడాలు)గా గుర్తించారు. ప్రమాదకర స్థాయిలో ఏమీ దొరకలేదు. ఇక కృత్రిమ పాల తయారీ కేంద్రాలపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు.

– ఉదయ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రంగారెడ్డి జిల్లా

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 96
గురువారం 27-6-2024


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



'ఫైనల్' అడుగు ఎవరిదో!
నేడు దక్షిణాఫ్రికా–అఫ్గాన్.. భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య సెమీఫైనల్స్ -14లో



ముగిసిన స్పెక్ట్రం వేలం
141.4 మెగాహెర్ట్జ్ విక్రయం.. అత్యధికంగా కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్ -15లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు
ప్రస్తుతం తీహార్ సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ బుధవారం అదుపులోకి తీసుకుంది.
వివరాలు 6లో ▸



తుమ్మితే పేగులు బయటికొచ్చాయి
63 ఏళ్ల రోగి.. గట్టిగా తుమ్మి, దగ్గడంతో పేగులు బయటికొచ్చాయి. సర్జన్లు జాగ్రత్తగా వాటిని యథాస్థానంలోకి వెనక్కి నెట్టారు.
వివరాలు 6లో ▸



ఆస్పత్రిలో అడ్వాణీ
మాజీ ఉప ప్రధాని అడ్వాణీ బుధవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు సమీక్షిస్తున్నారు.
వివరాలు 6లో ▸



అసాంజ్‌కు విముక్తి
వికీలీక్స్ వ్యవస్థాపకుడు అసాంజ్‌కు విముక్తి దొరికింది. తన నేరాలను అంగీకరించడంతో ఫెడరల్ కోర్టు అసాంజ్‌ను విడుదల చేసింది.
వివరాలు 6లో ▸

వారంలో విస్తరణ!

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో ముమ్మర కసరత్తు

- ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీపై కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి
- మూడ్రోజులుగా హస్తినలోనే ముఖ్యమంత్రి రేవంత్
- ఖర్గే, రాహుల్ గాంధీ, వేణుగోపాల్‌తో వరుస భేటీలు
- భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబుతో పాటు ఆశావహులు కూడా ఇక్కడే
- రేసులో రాజగోపాల్‌రెడ్డి, వివేక్, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, బల్మూరి, వాకాటి
- జూలై 1 లేదా 2న విస్తరణ ఉండొచ్చంటున్న ఏఐసీసీ వర్గాలు
- బలరాం నాయక్, మహేశ్‌గౌడ్, షెట్కార్‌లలో ఒకరికి పీసీసీ పగ్గాలు!
- రైతు కమిషన్ చైర్మన్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి!


గడ్కరీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వంశీ, భట్టి, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్

సాక్షి, న్యూఢిల్లీ

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఢిల్లీలో ముమ్మర కసరత్తు జరుగుతోంది. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు స్థానాలను భర్తీ చేయడంపై నేతలు దృష్టి సారించారు. గడిచిన మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి ఈ అంశంతో పాటు, పీసీసీ అధ్యక్షుడి నియామకంపై అధిష్టానం పెద్దలతో వరుస భేటీలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బుధవారం కూడా ఏఐసీసీ పెద్దలతో సమావేశమయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలతో జరిపిన భేటీల్లో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించడంతో పాటు, కొన్ని పేర్లపై సానుకూలత వ్యక్తమైనట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆయా పేర్లపై రాష్ట్ర సీనియర్ మంత్రుల అభిప్రాయాలను నేతలు
మిగతా 2వ పేజీలో ▶

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించండి

- హైదరాబాద్–విజయవాడ ఎన్‌హెచ్‌ను ఆరు వరుసలుగా విస్తరించండి
- జాతీయ రహదారుల పనులు వెంటనే ప్రారంభించండి
- కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి.. భేటీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, దుద్దిళ్ల -2లో

విలువలే కాదు..
తప్పులూ సవరణ..!

- గతంలో వ్యవసాయ భూముల విలువలు తప్పుగా నమోదు
- ఎకరాలను చదరపు గజాల్లో నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ తిప్పలు
- ఇప్పుడు ఆ తప్పులను సవరించే పనిలో క్షేత్రస్థాయి కమిటీలు
- ప్రస్తుతానికి షెడ్యూల్ యథాతథం!



సాక్షి, హైదరాబాద్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ సర్వే నంబర్‌లో 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో రిజిస్ట్రేషన్ విలువను సవరించినప్పుడు ఈ సర్వే నంబర్‌లోని ఎకరం వ్యవసాయ భూమిని ఎకరాల్లో కాకుండా పొరపాటున గజాల్లో నమోదు చేశారు. దీంతో ఈ సర్వే నంబర్‌లోని మొత్తం వ్యవసాయ భూమి విలువ గజాల్లోనే కనిపిస్తోంది. వ్యవసాయ భూమి కాబట్టి ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ జరుగుతుంది కానీ రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రం గజాల లెక్కన చెల్లించాల్సి వస్తోంది. ఇది ఒక్క కరీంనగర్ జిల్లాలోనే కాదు.. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 వరకు దరఖాస్తులు వచ్చాయని సమాచారం. తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన భూములు, ఆస్తుల విలువల సవరణ ప్రక్రియలో భాగంగా ఈ సమస్యకు చెక్ పడనుంది. ఇలాంటి పొరపాట్లను సవరించే పనిలో ఇప్పుడు విలువల సవరణ కమిటీలు బిజీగా ఉన్నాయి.

29 నాటికి ప్రతిపాదనలకు ఆమోదం
రిజిస్ట్రేషన్ విలువల సవరణ షెడ్యూల్ ప్రస్తుతానికి యథావిధిగా సాగుతోందని తెలుస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని రాష్ట్ర ప్రభుత్వం మార్చడంతో మంగళవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడినప్పటికీ మిగిలిన షెడ్యూల్ అంతా యథాతథంగా కొనసాగుతోందని, ఈనెల 29 నాటికి అర్బన్, రూరల్ కమిటీలు కూర్చుని విలువల సవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతాయని ఆ శాఖ వర్గాలంటున్నాయి. ఒకవేళ షెడ్యూల్‌లో మార్పులు తేవాల్సి వస్తే 28వ తేదీ తర్వాత స్పష్టత వస్తుందని చెపుతున్నాయి.

నాలుగింటిలో మూడు క్లియర్
రాష్ట్రంలో భూములు, ఆస్తుల విలువల సవరణ జరిగినప్పుడు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నాలుగు రూపాల్లో
మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

తేలని 'కన్వీనర్' లెక్కలు..

ఇంజనీరింగ్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లు ఎన్నో ఇంకా లెక్క తేలలేదు. ప్రైవేటు కాలేజీలు మాత్రం యాజమాన్య కోటా సీట్లను ఇప్పటికే దాదాపు అమ్మేసుకున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు తామేమీ చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.
- వివరాలు 16లో▶

ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించండి


బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచి పార్టీ ఫిరాయించిన పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం చట్టవ్యతిరేకమన్నారు.
- వివరాలు 2లో▶

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

ఉన్నత విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5% రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే కాకుండా ఎయిడెడ్ సంస్థల్లోనూ ఈ మేరకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని స్పష్టం చేసింది
- వివరాలు 3లో▶

జూడాల సమ్మె విరమణ

జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరు కానున్నారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) నేతలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ఆ విషయాన్ని ప్రకటించారు.
- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి




స్పీకర్‌గా ఓం బిర్లా

- విపక్ష అభ్యర్థి సురేశ్‌పై విజయం
- మూజువాణి ఓటుతో ఎన్నిక
- మోదీ, రాహుల్ అభినందన
- సీటు దాకా తోడ్కొని వెళ్లిన వైనం
- విలువలకు పట్టం కడతా: బిర్లా
- సభలో తొలి రోజే వాయిదా పర్వం.. ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా తీర్మానం
- తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు
- పార్లమెంటు ఆవరణలో బీజేపీ నిరసన

- వివరాలు 6లో▶

వ్యవసాయానికి రూ. 64 వేల కోట్లు



బడ్జెట్ కేటాయింపులపై ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు

- రుణమాఫీకి రూ.31 వేల కోట్లు.. పంటల బీమాకు రూ.3 వేల కోట్లు
- రైతుభరోసా రెండు సీజన్లకు కలిపి రూ.23 వేల కోట్లు
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు
- ఇతర అవసరాలకూ భారీగానే నిధుల కోసం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: త్వరలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని వ్యవసాయశాఖ ప్రభుత్వాన్ని కోరింది. రుణమాఫీ, రైతు భరోసా, ఇతర పథకాల అమలు కోసం పెద్ద ఎత్తున కేటాయింపులు చేయాలంటూ ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందజేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.64 వేల కోట్ల మేర అవసరమని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆగస్టులో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం శాఖల వారీగా ప్రతిపాదనలను స్వీకరిస్తోంది.

పథకాల వారీగా అవసరాలతో..: బుధవారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా అధికారులు పథకాల వారీగా నిధుల మిగతా 12వ పేజీలో ▶



కౌలు రైతులకూ 'భరోసా'! 5లో

- ఈ సీజన్ నుంచే ఇచ్చేందుకు కసరత్తు
- కౌలు రైతులను ఎలా గుర్తించాలన్న దానిపై తర్జనభర్జన
- త్వరలో రైతు సంఘాలతో సమావేశం



అలక వీడిన జీవన్‌రెడ్డి

- సముచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీ
- ఫలించిన వేణుగోపాల్, దీపాదాస్ మున్షీ, శ్రీధర్‌బాబు చర్చలు
- ఉత్కంఠకు తెర

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన హామీతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యవహారంలో కొద్దిరోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. తనకు సమాచారం లేకుండా జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన జీవన్‌రెడ్డి అధిష్టానం హామీతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు
మిగతా 12వ పేజీలో ▶


బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలసిన పార్టీ నేతలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మల్లారెడ్డి, బి. లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఒత్తిళ్లకు లొంగొద్దు

తొందరపాటు నిర్ణయాలతో చెడ్డపేరు తెచ్చుకోవద్దు
బీఆర్‌ఎస్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది
ప్రభుత్వ పాలనా వైఫల్యాలు ఎత్తిచూపేలా కార్యాచరణ
పార్టీ ఎమ్మెల్యేలతో అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: పార్టీలో చేరాలంటూ ఒత్తిళ్లు వచ్చినా లొంగిపోకుండా పార్టీ కోసం పనిచేయాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు బుధవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. వీరిలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు కాలేరు వెంకటేశ్ (అంబర్‌పేట), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), లక్ష్మారెడ్డి (ఉప్పల్)తో పాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు. సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై అధినేత చర్చించారు. అధికార పార్టీ పెట్టే
మిగతా 12వ పేజీలో ▶

క్లుప్తంగా...

సోనియాతో ఉత్తమ్ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లోని సోనియా నివాసంలో బుధవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి ఎంపికతోపాటు.. మంత్రి వర్గ విస్తరణపై కూడా సోనియా గాంధీతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చించినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించిన కేటీఆర్



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఓదారుస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

అల్వాల్: సతీమణి మరణంతో విషాదంలో ఉన్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పరామర్శించారు. అల్వాల్‌లోని సత్యం నివాసానికి చేరుకొని రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. కేటీఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులున్నారు.

బొగ్గు గనుల వేలంపై పోరాటానికి బీఆర్‌ఎస్ సిద్ధం

నేడు తెలంగాణ భవన్‌లో కీలక భేటీ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమవుతోంది. బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ విధానాలపై ఉద్యమించాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణి ప్రాంత బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులతో గురువారం తెలంగాణ భవన్‌లో కీలక భేటీ ఏర్పాటు చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అధ్యక్షతన జరిగే ఈ భేటీకి సింగరేణి ప్రాంత బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలను ఆహ్వానించారు. వీరితో పాటు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డితో పాటు సంఘం కేంద్ర కమిటీ, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సహా 30 మంది ఈ భేటీలో పాల్గొంటారు.

రాజకీయాలే పరమావధిగా రేవంత్ ప్రభుత్వం

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ గురుకుల అభ్యర్థులు చేస్తున్న నిరసనకు మద్దతు ప్రకటించారు. మంత్రులు, అధికారులకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి వినతి పత్రాలిచ్చినా వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగులకు నష్టం జరగకుండా ఉండాలని, ఉన్నత హోదా పోస్టుల నుంచి ప్రారంభించి కింది స్థాయి పోస్టుల వరకు ఫలితాలు వెల్లడించి భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

ఫామ్‌హౌస్‌లో వీడ్కోలు పార్టీలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు ప్రగతిభవన్ గేట్లు తెరవని కేసీఆర్ ఇప్పుడు ఫామ్‌హౌస్‌కు పిలిచి మరీ బంతి భోజనాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌లో జరుగుతుంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశాలు కాదని, ఎమ్మెల్యేలకు ఫామ్‌హౌస్‌లో వీడ్కోలు పార్టీలిస్తున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్‌తో కలిసి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని

జాతీయ రహదారిగా ప్రకటించండి

హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్‌ను ఆరు వరుసలుగా విస్తరించండి | జాతీయ రహదారుల పనులు వెంటనే ప్రారంభించండి

కేంద్రమంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- భేటీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, దుద్దిళ్ల
- ఒకట్రెండు నెలల్లో ఆరు లేన్ల రోడ్డు పనులు ప్రారంభిస్తాం: కోమటిరెడ్డి



ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్)ని ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వార్షిక ప్రణాళికలో ట్రిపుల్ ఆర్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. బుధవారం ఢిల్లీలో గడ్కరీతో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, పలు ఎన్‌హెచ్‌ల పనుల ప్రారంభం తదితర అంశాలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - జగదేవ్‌పూర్ - భువనగిరి - చౌటుప్పల్ (158.645 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించారని, దాని భూసేకరణకయ్యే వ్యయంలో సగ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని రేవంత్ చెప్పారు. ఈ భాగంలో తమ వంతు పనులు వేగవంతం చేశామన్నారు. చౌటుప్పల్ నుంచి అమన్‌గల్ - షాద్‌నగర్ - సంగారెడ్డి వరకు (181.87 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని రేవంత్ కోరారు. హైదరాబాద్ (ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్) నుంచి వలిగొండ - తొర్రూర్ - నెల్లికుదురు - మహబూబాబాద్ - ఇల్లెందు - కొత్తగూడెం వరకు రహదారిని (ఎన్‌హెచ్-930పీ) జాతీయ రహదారిగా ప్రకటించారని, ఇందులో కేవలం ఒక ప్యాకేజీ కింద 69 కి.మీ.కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని గడ్కరీకి వివరించారు. హైదరాబాద్ వాసులు భద్రాచలం వెళ్లేందుకు 40 కి.మీ. దూరం తగ్గించే ఈ రహదారిని జైశ్రీరామ్ రోడ్‌గా వరంగల్ సభలో గడ్కరీ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ మార్గంలో మిగిలిన మూడు ప్యాకేజీలకు (165 కి.మీ) టెండర్లు పిలిచినందున వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. గంటన్నరకుపైగా జరిగిన ఈ సమావేశంలో రేవంత్‌రెడ్డి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య..

హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్ 65) జాతీయ రహదారిని గత ఏప్రిల్‌లోగా ఆరు లేన్లుగా విస్తరించాల్సి ఉందని గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలకమైన ఈ రహదారిలో వాహనాల రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. విపరీతమైన రద్దీ ఉన్నప్పటికీ రాష్ట్ర విభజనతో వాహన రద్దీ తగ్గిందని, తమకు సరైన ఆదాయం రావడం లేదంటూ కాంట్రాక్ట్ సంస్థ ఆరు వరుసల పనులు చేపట్టడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ, కాంట్రాక్ట్ సంస్థ మధ్య వివాదాన్ని పరిష్కరించి త్వరగా ఆరు లేన్లుగా విస్తరించాలని కోరారు.

ఐకానిక్ బ్రిడ్జి.. ఎలివేటెడ్ కారిడార్

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ - సోమశిల - కరివెన - నంద్యాల (ఎన్‌హెచ్-167కే) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి 142 కి.మీ. పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని గడ్కరీకి రేవంత్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 32 కి.మీ.పనులకు, ఐకానిక్ బ్రిడ్జికి టెండర్లు పిలిచారని, ఆ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ నుంచి తిరుపతికి 70 కి.మీ. దూరం తగ్గుతుందని వివరించారు. కల్వకుర్తి-నంద్యాల రహదారి (ఎన్‌హెచ్-167కే) హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ఉన్న రహదారిలో (ఎన్‌హెచ్ 765కే) 67 కిలోమీటర్ వద్ద (కల్వకుర్తి) ప్రారంభమవుతుందని, ఎన్‌హెచ్ 167కే జాతీయ రహదారి పనులు చేపట్టినందున, హైదరాబాద్ - కల్వకుర్తి వరకు ఉన్న (ఎన్‌హెచ్ 765కే) రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి-కరివెన వరకు జాతీయ రహదారి పూర్తయ్యేలోపు హైదరాబాద్ - కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ - శ్రీశైలం (ఎన్‌హెచ్ 765) మార్గంలో 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని, అటవీ అనుమతులు లేక అక్కడ పనులు చేపట్టలేదని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ మార్గంలో నిత్యం ఏడువేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, ఈ నేపథ్యంలో ఆమ్రాబాద్ ప్రాంతంలో 4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని రేవంత్ కోరారు.

మంథనికి చోటివ్వండి

మంథని నుంచి సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, మాజీ సభాపతి శ్రీపాదరావు గతంలో ప్రాతినిధ్యం వహించారని గడ్కరీకి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఇప్పటివరకు జాతీయ రహదారుల చిత్రంలో మంథనికి చోటు దక్కలేదన్నారు. జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి పూర్తయితే ఎన్‌హెచ్-565, ఎన్‌హెచ్-353సీ అనుసంధానమవుతాయని, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు అనువుగా ఉంటుందని, దక్షిణ కాశీగా గుర్తింపుపొందిన కాళేశ్వరం క్షేత్రానికి అనుసంధానత పెరుగుతుందని సీఎం వివరించారు.

గడ్కరీ దృష్టికి తీసుకెళ్లిన ఇతర అంశాలు

తెలంగాణను కర్ణాటక, మహారాష్ట్రను అనుసంధానించే హైదరాబాద్-మన్నెగూడ నాలుగు వరుసల జాతీయ రహదారిగా (ఎన్‌హెచ్-163) ప్రకటించడంతో భూ సేకరణ పూర్తి చేశాం. టెండర్లు పిలవడం పూర్తయిన ఎన్జీటీలో కేసు వలన పనులు ప్రారంభం కాలేదు. సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేసి ఈ మార్గం పనులు వెంటనే ప్రారంభించాలి. సేతు బంధన్ స్కీం కింద 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 12 ఆర్వోబీలు/ఆర్‌యూబీలను వెంటనే మంజూరు చేయాలి. జగిత్యాల-కాటారం (130 కి.మీ.), దిండి - నల్లగొండ (100 కి.మీ.), భువనగిరి - చిట్యాల (44 కి.మీ), చౌటుప్పల్ - సంగారెడ్డి (182 కి.మీ), మరికల్-రామసముద్రం (63 కి.మీ.), వనపర్తి - మంత్రాలయం (110 కి.మీ.), మన్నెగూడ - బీదర్ (134 కి.మీ.), కరీంనగర్-పిట్లం (165 కి.మీ.), ఎర్రవెల్లి క్రాస్ రోడ్ - రాయచూర్ (67 కి.మీ.), కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ.), సారపాక - ఏటూరు నాగారం (93 కి.మీ.), దుద్దెడ - రాయగిరి క్రాస్ రోడ్ (63 కి.మీ.), జగ్గయ్యపేట - కొత్తగూడెం (100 కి.మీ.), సిరిసిల్ల - కోరట్ల (65 కి.మీ.), భూత్పూర్ - సిరిగిరిపాడు (166 కి.మీ.), కరీంనగర్ - రాయపట్నం (60 కి.మీ.) మొత్తం 1617 కి.మీ. జాతీయ రహదారులను అప్‌గ్రేడ్ చేయాలి.

వారంలోపు అన్ని శాఖలతో సమావేశం: భట్టి

రాష్ట్ర రహదారులకు సంబంధించి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, అన్ని శాఖల నుంచి ఒకే సారి క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గడ్కరీతో రాష్ట్రానికి సబంధించిన రోడ్ల విస్తరణ గురించి మాట్లాడామన్నారు. ట్రిపుల్ఆర్, హైదరాబాద్ - అమరావతి ఆరు లేన్లుగా మార్చడం, హైదరాబాద్-కల్వకుర్తి రోడ్డు తదితర అంశాలపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించామని భట్టి చెప్పారు.

రూ. 4 వేల కోట్లతో ఆరు లేన్ల పనులు: కోమటిరెడ్డి

తెలుగు రాష్ట్రాల రాజధానులు హైదరాబాద్-అమరావతి మధ్య ఆరు లేన్ల పనులను ఒకట్రెండు నెలల్లో ప్రారంభిస్తామని, అలాగే ఎక్స్‌ప్రెస్ వే కూడా నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు లేన్ల మార్గాన్ని రూ.4వేల కోట్ల బడ్జెట్‌తో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ కూడా నిర్మిస్తామని వెల్లడించారు. తాము చేసిన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. 2016లో ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్డును నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరిచిపోయిందని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయంలో కదలిక వచ్చిందని తెలిపారు. యుటిలిటీ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని కేంద్రమంత్రికి వివరించగా.. అందుకు కేంద్ర మంత్రి స్పందిస్తూ.. తామే భరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు సాధించడమే తమ లక్ష్యమని, జవాబుదారీతనంగా పనిచేయడం తెలుసు కాబట్టే ఇంతమంది మంత్రులం ఢిల్లీకి వచ్చామని కోమటిరెడ్డి చెప్పారు.

ఐటీఐఆర్ ఇచ్చే వరకు మాట్లాడుతూనే ఉంటా

- మోదీ రద్దు చేయకపోయి ఉంటే పదేళ్లలో 15 లక్షల ఉద్యోగాలు వచ్చేవి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రానికి రావలసిన ఐటీఐఆర్ ప్రాజెక్టు ఆగిపోయిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టు గురించి ఐదు రోజుల క్రితం మాట్లాడానని అన్నారు. యువతకు ఉద్యోగాలు దొరికే అంశం కాబట్టి ఐటీఐఆర్ ప్రాజెక్టును మంజూరు చేసేంత వరకు తాను కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉంటానని, ఇలా ఐదు రోజులకు ఒకసారి దీనిమీద మాట్లాడతానని తేల్చిచెప్పారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఐటీఐఆర్‌కు అనుమతి ఇవ్వడమే కాక, 50 వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును పెట్టాలని నిర్ణయించిందని, తద్వారా 60 లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా వేసిందని వివరించారు. మోదీ ప్రధాని అయ్యాక దానిని రద్దు చేశారని అన్నారు. మోదీ ఆ ప్రాజెక్టును రద్దు చేయకపోయి ఉంటే పదేళ్లలో 15 లక్షల ఉద్యోగాలు వచ్చేవన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయి ఉంటే.. తామే ఐటీఐఆర్ తెచ్చే వాళ్లమని పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తరువాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లను కలిసి వినతిపత్రం సమర్పిస్తానని, రద్దు చేసిన ఐటీఐఆర్ మళ్లీ తెమ్మని అడుగుతానని అన్నారు. ఎంపీ రఘునందన్‌రావు తనకు ఐటీఐఆర్ గురించి అ ఆలు కూడా తెలియవని అన్నారని, విద్యాపరంగా తాను వీక్ అని ఒప్పుకుంటున్నట్లు చెప్పారు. అయితే, రఘునందన్‌కు ఆర్‌ఎస్‌ఎస్ శాఖల గురించి, జగ్గారెడ్డి గురించి తెలియదని, కిషన్‌రెడ్డి, దత్తాత్రేయలను అడిగితే చెపుతారని పేర్కొన్నారు.

ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించండి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ బీ ఫారంపై ఎమ్మెల్యేలుగా గెలిచి పార్టీ ఫిరాయించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఎం.సంజయ్‌లను అనర్హులుగా ప్రకటించాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడం చట్టవ్యతిరేకమన్నారు. ఫిరాయింపుల చట్టం నిబంధనల మేరకు ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసేందుకు రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ పార్టీ తరఫున స్పీడ్ పోస్టు ద్వారా విజ్ఞాపన పంపినట్లు చెప్పారు. వారిని అనర్హులుగా ప్రకటించకుంటే న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఓ వైపు 'పాంచ్ న్యాయ్'పేరిట ఫిరాయింపులపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్తూనే మరోవైపు ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విపక్ష పార్టీ ఎమ్మెల్యేలే వచ్చి తమ పార్టీలో చేరారని, కానీ రేవంత్ తరహాలో కేసీఆర్ ఎమ్మెల్యేల ఇళ్లకు తిరగలేదన్నారు.

కావాల్సిన సింబల్‌ను కోరలేరు

- 'చపాతి రోలర్'పై పిటిషన్‌లో ఈసీ వాదనలు
- వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్న పిటిషనర్



సాక్షి, హైదరాబాద్: ప్రజా ప్రాతినిధ్య చట్టం - 1951లో నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల్లో తమకు ఫలానా గుర్తే కావాలని ఎవరూ కోరలేరని హైకోర్టులో ఎన్నికల కమిషన్ వాదనలు వినిపించింది. దీంతో 'చపాతీ రోలర్'గుర్తును ఎంపిక జాబితాలో చేర్చాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను పిటిషనర్ ఉపసంహరించుకున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల ఉండటంతో ఎన్నికల గుర్తు జాబితాలో 'చపాతీ రోలర్'ను చేర్చాలని కోరుతూ హైకోర్టులో అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ...గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పిటిషనర్ పార్టీ అభ్యర్థులు 'చపాతీ రోలర్' గుర్తుపై పోటీ చేశారన్నారు. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం, పట్టణ స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో అదే గుర్తు కేటాయించేలా ఈసీకి ఆదేశాలివ్వాలని కోరారు. ఈసీ తరఫు న్యాయవాది జి. విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం అలాంటి వెసులుబాటు లేనందున ఉన్న జాబితా నుంచే ఏదో ఒక గుర్తు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో పిటిషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరడంతో ధర్మాసనం అంగీకరించింది.

రెండు నెలల్లో ప్రారంభం..

రెండేళ్లలో పూర్తి!

- ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సీఎం ఖరారు చేసిన వెంటనే పనులు ప్రారంభం
- రూ.400-500 కోట్లతో నిర్మాణం



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో నిర్మించబోయే తెలంగాణ భవన్ దేశానికి ఐకానిక్‌గా ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. రెండు నెలల్లోగా పనులు ప్రారంభించి రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. హంగూ, ఆర్భాటాలనేవి భవన్ నిర్మాణంలో కనిపించవని.. అయితే ఢిల్లీ వచ్చిన ప్రతి ఒక్కరూ ఆగి మరీ భవన్‌ను చూసేలా మోడ్రన్‌గా నిర్మిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిజైన్‌ను ఖరారు చేసిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఏపీ జితేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారం కార్యక్రమానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

అదిరిపోయేలా నిర్మాణం

పదేళ్లుగా తెలంగాణకు ఢిల్లీలో భవన్ లేకపోవడం బాధాకరమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. సుమారు రూ.400-500 కోట్ల బడ్జెట్‌తో తెలంగాణ భవన్ అదిరిపోయేలా నిర్మిస్తామని చెప్పారు. రెండు కంపెనీలు బిల్డింగ్ నిర్మాణం గురించి ప్రజెంటేషన్ ఇచ్చాయన్నారు. వాళ్లు గోపురం టైపులో నిర్మిద్దామనే డిజైన్ ఇవ్వడంతో..తాను కొన్ని మార్పులు చేసినట్లు చెప్పారు. సింపుల్ లుక్‌లో భవన్ అదిరిపోయేలా ఉండాలని సూచించినట్లు తెలిపారు. అందుకు తగ్గ డిజైన్లు వచ్చిన వెంటనే 2 నెలల్లోపే నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని వివరించారు. హైదరాబాద్ హౌజ్ పక్కన గవర్నర్, సీఎం బంగ్లాలు నిర్మించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు.

జగన్ వల్లే పరిష్కారమైంది

రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్‌కు సంబంధించిన 19 ఎకరాల ఆస్తుల్లో 42% వాటా తెలంగాణకు రావాల్సి ఉందని కోమటిరెడ్డి తెలిపారు. ఈ ఆస్తులను సాధించుకోవడంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పటౌడీ హౌజ్, హైదరాబాద్ హౌజ్‌ల పక్కన స్థలాలు తెలంగాణకు కేటాయించాలంటూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను తాను కోరడంతో ఆయన వెంటనే ఓకే చేసినట్లు చెప్పారు. ఆ వెంటనే అప్పటి సీఎస్ జవహర్ రెడ్డితో కూడా మాట్లాడి ఏపీ, తెలంగాణకు కేటాయించాల్సిన ఆస్తులపై చర్చించి కేంద్రానికి తెలిపామన్నారు. కేంద్రం కూడా స్థలాల్ని రెండు రాష్ట్రాలకు విభజన చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. కేంద్రంతో మంచిగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన వాటిపై పోరాడి సాధించుకుంటామన్నారు. హైదరాబాద్ - విజయవాడ బుల్లెట్ ట్రైన్, కృష్ణా- గోదావరి ట్రిబ్యునల్ వ్యవహారం వంటి సమస్యలకు కేంద్రం నుంచి పరిష్కారాన్ని సాధిస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

పొన్నం నా సవాళ్లను స్వీకరించాలి

- ఫ్లైయాష్ రవాణాలో ఆయనది రూ.100 కోట్ల స్కాం
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణ



జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్ (హైదరాబాద్): నా సవాళ్లను స్వీకరించి.. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ జూబ్లీహిల్స్ టీటీడీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వచ్చి తాను ఫ్లైయాష్ రవాణా విషయంలో అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేస్తారని భావించానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పొన్నంకు సవాల్ విసిరిన కౌశిక్ రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్ దేవాలయంలో ఆయన కోసం వేచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ తాను నీతిమంతుడని చెప్పుకుంటున్నారని, ఫ్లైయాష్ విషయంలో ఆయన రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని తాను ఆరోపిస్తే ఇప్పటివరకు మంత్రి పెదవి విప్పలేదని చెప్పారు. ఇది వేంకటేశ్వరస్వామి ఆలయం అని, తనకు దేవుడిపై నమ్మకముందని, అవినీతికి పాల్పడలేదని పొన్నం ప్రమాణం చేస్తే తాను క్షమాపణ చెప్తానని ప్రకటించానన్నారు. పొన్నం ప్రభాకర్ నిజాయితీపరుడయితే తన సవాల్ స్వీకరించి ఆలయానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

ఆధారాలు ఉన్నాయి...

పొన్నం ప్రభాకర్ అవినీతికి ఆధారాలు ఉన్నాయా అని అడుగుతున్నాడు..తాను గతంలో ఆధారాలు చూపించానని కౌశిక్‌రెడ్డి చెప్పారు. ఫ్లైయాష్‌కు సంబంధించిన పర్మిట్ బిల్లును చూపించారు. ఇందులో ఎన్ని టన్నుల యాష్ తీసుకువెళ్తున్నారో రాయడం లేదని, ఫ్లైయాష్ లారీలను తాము పట్టపగలు హుజూరాబాద్‌లో పట్టుకున్నామని, దానిని వేబ్రిడ్జిపై చూస్తే ఒక్కో లారీ 76 టన్నులకు పైగా ఉందని, నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నుల యాష్ మాత్రమే తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.

బ్లాక్‌బుక్‌లో నమోదు..

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారి వివరాలు బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నానని కౌశిక్ రెడ్డి తెలిపారు. మళ్లీ సీఎంగా కేసీఆర్ వస్తారని, అవినీతికి పాల్పడుతున్న అధికారులకు, మంత్రులకు మళ్లీ బ్లాక్ డేస్ రాక తప్పదన్నారు. బ్లాక్ బుక్‌లో తొలిపేరు పొన్నందేనన్నారు.

వారంలో విస్తరణ!

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్నట్లు తెలిసింది. అన్నీ కుదిరితే వారంలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

మూడు కోణాల్లో పరిశీలన: రాష్ట్ర కేబినెట్‌లో ప్రస్తుతం 12 మంది మంత్రులు ఉండగా, మరో 6 స్థానాలు భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. ఈ ఆరు స్థానాలకు ప్రస్తుతం 10 నుంచి 12 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోటీ పడుతున్నట్లు సమాచారం. ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి లాంటి వారు రేసులో ఉన్నారు. అయితే ఇప్పటివరకు అసలు ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తున్నా, ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరు సైతం తాజాగా తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆయనకు రైతు కమిషన్ చైర్మన్ పోస్టు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

సీఎంతో రాష్ట్ర నేతల సమావేశాలు: సుదర్శన్‌రెడ్డికి సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, భట్టి విక్రమార్కలు మద్దతిస్తున్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ఇద్దరూ గడిచిన మూడ్రోజులుగా ఢిల్లీలోనే ఉండి బలంగా లాబీయింగ్ చేస్తున్నారు. బుధవారం ఈ ఇద్దరు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. బీసీ సామాజిక వర్గం నుంచి మహేశ్‌గౌడ్, వాకాటి శ్రీహరి పేర్లు పరిశీలనలో ఉండగా, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీహరికి మంత్రి పదవి దాదాపు ఖరారైందని అంటున్నారు. వీరిద్దరు కూడా మూడ్రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. శ్రీహరి సైతం బుధవారం ముఖ్యమంత్రిని కలిసి తన పేరు పరిశీలనకు విన్నవించినట్లు తెలిసింది. వెలమ సామాజిక వర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, మదన్‌మోహన్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ల మధ్య పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఈ సామాజిక వర్గం నుంచి జూపల్లి కృష్ణారావు ఉన్నందున మరొకరికి అవకాశం ఇస్తారా? లేదా? అన్న దానిపై చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రేమ్‌సాగర్‌రావుకు అవకాశం ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించినట్లు తెలిసింది. ఇక ఎస్సీ కోటా లో జి.వివేక్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

నేతలు బిజీబిజీ: మంత్రివర్గ విస్తరణపై రెండ్రోజుల కిందటే మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపిన సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మరోమారు వారితో సమావేశమయ్యారు. విస్తరణ విషయంలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కాగా.. డిప్యూటీ సీఎం భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబులు ముందు దీపాదాస్ మున్షీతో భేటీ అయ్యారు. కేబినెట్ విస్తరణపై హైకమాండ్ రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, జూలై 1 లేదా 2న విస్తరణ జరగవచ్చని తెలిసింది.

పీసీసీ రేసులో ముగ్గురు

పీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రధానంగా మూడు పేర్లపై హైకమాండ్ పెద్దల వద్ద చర్చలు జరిగినట్లు తెలిసింది. ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఈ పదవికి పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు పీసీసీ పదవిని ఎస్టీకి ఇవ్వనందున బలరాం పేరును సీఎం ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఆయన పేరును కొందరు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. దీంతో మహేశ్‌గౌడ్‌కు రేవంత్, ఇతర సీనియర్లు మద్దతు పలికినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా...

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

త్రిసభ్య కమిటీకి విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.దామోదర్‌రెడ్డి, సి.చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదు రహిత వైద్యం, పెండింగ్‌లో ఉన్న 4 డీఏ బకాయిలు, ఈ-కుబేర్‌లో దీర్ఘకాలికంగా మంజూరు కానీ బిల్లుల చెల్లింపులు, 2023 వేతన సవరణ (పీఆర్సీ), రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు, 398 టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలను త్రిసభ్య కమిటీకి వివరంగా తెలియజేశామని వెల్లడించారు. సమస్యలన్నీ పరిష్కరం అయ్యేలా త్వరలో ప్రభుత్వానికి నివేదికను అందించాలని కోరారు. త్రిసభ్య కమిటీని కలిసిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారంలోనే పాఠ్యపుస్తకాల పంపిణీ చరిత్రాత్మకం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న 22 లక్షల మంది పేద విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు వారం రోజుల్లోనే పంపిణీ చేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ సచివాలయంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంను జాజుల నేతృత్వంలోని బీసీ నేతల బృందం కలిసింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యుత్తు పంపిణీ అమలుకు చర్యలు తీసుకోవడం, ప్రభుత్వం విద్య అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యను నిర్వీర్యం చేసి ప్రైవేటు విద్యను ప్రోత్సహించారని దీంతో వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసివేసిన పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, విద్యాభివృద్ధి కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కె. శ్రీనివాస్ ముదిరాజ్ , బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జూనియర్ అసిస్టెంట్ల నియామకం

హనుమకొండ: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలో జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ల నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆ సంస్థ జాయింట్ సెక్రటరీ కె.రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 4నరాతపరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆరుగురు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా 6 పోస్టుల భర్తీ నిలిపివేయాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. దీంతో నియామక ప్రక్రియకు అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు అభ్యర్థులకు సంబంధించిన సర్కిల్‌లో వారి కేటగిరీ వారీగా వదిలేస్తూ, సొంత సర్కిల్‌లో పోస్టులు ఖాళీ లేకపోతే పక్క సర్కిల్‌లో పోస్టును రిజర్వు చేస్తూ మిగతా 94 పోస్టుల భర్తీని పూర్తి చేయాలని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని వివరించారు. త్వరలో ఈ నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు.



'యునెస్కో' రూట్‌లో

మంజీరా అభయారణ్యం!

- ప్రపంచ జీవ వైవిధ్య ప్రాంతంగా గుర్తింపు కోసం అటవీశాఖ యత్నాలు
- ఈపీటీఆర్ఐతో కలసి అధ్యయనం
- నేషనల్ వెట్‌ల్యాండ్ అథారిటీకి ప్రాథమిక నివేదిక
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు
- ఇటీవల ఈ అభయారణ్యాన్ని సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలోని మంజీరా అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు దక్కించుకునేందుకు రాష్ట్ర అటవీశాఖ ప్రయత్నాలు చేస్తోంది. హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న మంజీరా డ్యామ్‌కు, సింగూరు ప్రాజెక్టుకు మధ్య ఉన్న జలాశయం, తొమ్మిది చిన్న ద్వీపాలతో కూడి ఉన్న ప్రాంతంలో ఈ అభయారణ్యం విస్తరించి ఉంది. మొసళ్లు సహా ఎన్నో రకాల జలచరాలు, వన్యప్రాణులు, వివిధ జాతుల పక్షులున్న ఈ ప్రాంతాన్ని జీవ వైవిధ్యమున్న చిత్తడి నేలగా గుర్తించారు. ఈ క్రమంలో అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు దక్కించుకునే అర్హతలు ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ములుగు జిల్లాలో ఉన్న రామప్ప దేవాలయం యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. మంజీరా అభయారణ్యాన్ని జీవ వైవిధ్య ప్రాంతంగా గుర్తించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

సమాచార క్రోడీకరణతో..

మంజీరా అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు సాధించేందుకు అవసరమైన అర్హతలు, ప్రతిపాదనలను శాస్త్రీయంగా సిద్ధం చేసేందుకు అటవీశాఖ ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)తో కలసి అధ్యయనం చేస్తోంది. ఈ అభయారణ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు, సాంకేతిక అంశాలతో కూడిన ప్రాథమిక నివేదికను నేషనల్ వెట్‌ల్యాండ్ బోర్డుకు పంపారు. దాన్ని పరిశీలించిన బోర్డు మరికొన్ని వివరాలు పంపాలని కోరింది. ఈ మేరకు ఈపీటీఆర్ఐ, అటవీశాఖ సమాచారాన్ని క్రోడీకరిస్తున్నాయి. అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ.వాణిప్రసాద్ సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలసి అభయారణ్యాన్ని సందర్శించారు. మరో రెండు రోజుల్లో ఈపీటీఆర్ఐ ఈ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.



ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి

మంజీరా అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు పొందేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ గుర్తింపు కోసం అవసరమైన ప్రతిపాదనలు తయారు చేస్తు న్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనికి అవసరమైన సమాచారాన్ని సేకరించి పంపుతున్నాం. ఎంతో జీవ వైవిధ్యం కలిగిన ఈ అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాం

- సి.శ్రీధర్‌రావు, డీఎఫ్ఓ, సంగారెడ్డి

అభయారణ్యం ప్రత్యేకతలివీ..

- సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో సదాశివ, పుల్కల్, చౌటకూర్ మండలాల పరిధిలో సుమారు 20 చదరపు కిలోమీటర్లలో ఈ అభయారణ్యం విస్తరించి ఉంది. హైదరాబాద్ నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
- ఈ అభయారణ్యంలో 303 రకాల పక్షులు నివాసం ఉంటున్నట్టు అటవీశాఖ గుర్తించింది. అందులో సుమారు 140 రకాల పక్షులు హిమాలయాలను దాటి ఇక్కడికి వలస వస్తాయి. వేసవి, వర్షాకాలం రెండు సీజన్లలోనూ విదేశీ పక్షులు వలస వచ్చి వెళుతుంటాయి. అందులో పెంటెడ్ స్టార్క్, ఫ్లెమింగో, బార్‌హెడెడ్ గూస్ వంటి పక్షులూ ఉన్నాయి.
- మొసళ్లు, ఇతర 14 రకాల ఉభయచరాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. 57 జాతులకు చెందిన చేపలు, 32 రకాల సీతాకోకచిలుకలకు ఈ ప్రాంతం ఆవాసం. ఈ జలాశయంలో తొమ్మిది చిన్న దీవులు ఉన్నాయి.

యునెస్కో గుర్తింపుతో ప్రయోజనాలివీ..

- ఈ అభయారణ్యానికి యునెస్కో గుర్తింపు లభిస్తే.. స్థానికంగా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. అంతర్జాతీయ పర్యాటకులు, పక్షి ప్రేమికులు ఈ ప్రాంతానికి వస్తారు.
- నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు ఇక్కడ స్టడీ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తుందని అటవీశాఖ వర్గాలు చెప్తున్నాయి.
- ఈ ప్రాంతంలో జీవవైవిధ్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. అలాగే యునెస్కో నుంచి నిధులు వస్తాయి.
- వెట్‌ల్యాండ్ అథారిటీ కూడా ఈ ప్రాంత సంరక్షణ కోసం నిధులు కేటాయించనుంది.

ఎంబీబీఎస్ ఫీజు నాలుగున్నరేళ్లకే తీసుకోవాలి

- ఐదేళ్లకు వసూలు చేస్తే కఠినచర్యలు...
- ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఫీజు రెగ్యులేటరీ కమిటీ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ ఫీజును ఐదేళ్లకు కాకుండా నాలుగున్నరేళ్లకే తీసుకోవాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ప్రైవేట్ కాలేజీలను ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీచేసింది. ఎంబీబీఎస్ కోర్సు నాలుగున్నర ఏళ్లు మాత్రమేనని, అందుకు తగ్గట్టుగానే ఫీజు తీసుకోవాలని సూచించింది. కొన్ని కాలేజీలు ఐదేళ్లకు ఫీజు వసూలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి స్పష్టతను ఇస్తున్నామని తెలిపింది. ఉదాహరణకు కోర్సు ఫీజు ఏడాదికి రూ. 14.5 లక్షలు అనుకుంటే, మొత్తం నాలుగున్నర ఏళ్లకు కలిపి రూ. 65.25 లక్షలు మాత్రమే తీసుకోవాలని సూచించింది. ఈ మొత్తాన్ని ఐదు ఇన్‌స్టాల్‌మెంట్లలో విద్యార్థుల నుంచి తీసుకోవాలని, ఒక్కో ఇన్‌స్టాల్‌మెంట్‌కు రూ. 13.05 లక్షలు మాత్రమే తీసుకోవాలని సూచించింది. దీనివల్ల ఆరు నెలలు అదనంగా వసూలు చేస్తున్న ఫీజుల భారం విద్యార్థులపై పడదని తెలిపింది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో ఫీజును ఐదు సమాన వాయిదాలలో వసూలు చేయాలని, మేనేజ్‌మెంట్లు ముందుగా ఫీజును వసూలు చేయరాదని కమిటీ సిఫార్సు చేసింది. అంటే ఎంబీబీఎస్ విద్యార్థుల వద్ద కోర్సు మొత్తానికి ఒకేసారి ఫీజు వసూలు చేస్తే చర్యలు తప్పవని ప్రైవేటు మెడికల్ కాలేజీలను ఫీజు రెగ్యులేటరీ కమిటీ హెచ్చరించింది. ఏ యేడాది ఫీజును ఆ ఏడాది మాత్రమే వసూలు చేయాలని ఆదేశించింది. కాగా, ప్రతీ ఏడాది టీఏఎఫ్ఆర్సీ ఇలా ఆదేశాలు ఇస్తున్నా ప్రైవేట్ మెడికల్ కాలేజీలు లెక్కచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

- ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో వయోపరిమితి ఐదేళ్లు సడలింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా సంస్థల్లో దివ్యాంగులకు కనీసం 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే కాకుండా ఎయిడెడ్ సంస్థల్లో కూడా ఈ మేరకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'పర్సన్ విత్ డిజేబిలిటీస్-2016'చట్టానికి అనుగుణంగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పింది. సీట్ల కేటాయింపులో కనీసం 5 శాతం రిజర్వేషన్ల అమలుతోపాటు కోర్సు ప్రవేశాల్లో వయోపరిమితిని ఐదేళ్లు సడలించాలని ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశాలు జారీ చేశారు.

హర్షణీయం: ముత్తినేని వీరయ్య

ఉన్నత విద్యా కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. వయోపరిమితిని కూడా 5 సంవత్సరాలు పెంచడం గొప్ప విషయమన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం గత ప్రభుత్వంపై పదేళ్లపాటు పోరాటం చేసినప్పటికీ ఫలితం దక్కలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతోందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని వెంకటేశ్‌గౌడ్ కోరారు. 'మనందరి మాట బడిబాట-ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం'అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేనతో కలిసి బుధవారం ఇక్కడ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని దేవసేన తెలిపారు. ఐఎస్‌యూ నేత నాగరాజు మాట్లాడుతూ ప్రజలు, ఉపాధ్యాయులు, పాలకులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతా

- తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ
- హాజరైన మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి జానారెడ్డి



జితేందర్‌రెడ్డిని అభినందిస్తున్న కోమటిరెడ్డి, జానారెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్‌రెడ్డి బుధవారం మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి జానారెడ్డిల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డికి వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తనకు కేంద్ర మంత్రులతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, క్రీడల విషయంలో తెలంగాణ అగ్రభాగాన నిలిచేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, ఒలింపిక్స్ ఇండియాలో జరిగితే వాటి ఈవెంట్స్ తెలంగాణలో జరిగేలా సహకరిస్తామని తెలిపారు. గ్రామీణ, జిల్లా స్థాయిలో క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని చెప్పారు. క్రీడల విషయంలో పదేళ్లుగా రాష్ట్రం వెనకడుగులో ఉందని, ఇకపై రాష్ట్రానికి ఆ పరిస్థితి రానివ్వకుండా తాను పనిచేస్తానని జితేందర్‌రెడ్డి తెలిపారు.

ఏబీవీపీ బంద్ ప్రశాంతం: ఝాన్సీ

సాక్షి, హైదరాబాద్: విద్యార్థి సమస్యలపై అఖిల ఏబీవీపీ తెలంగాణ శాఖ బుధవారం చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతమైనట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలు సొంతంగా బంద్ పాటించాయన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు సమస్యల గురించి వివరించామని, వారు బంద్‌కు సహకరించారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఝాన్సీ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో బుక్స్, యూనిఫాం అమ్మకాలను అరికట్టాలని కోరారు.

జూడాల సమ్మె విరమణ

నేటి నుంచి యథావిధిగా విధులకు హాజరు

- మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ప్రకటన
- జూడాల సమస్యల పరిష్కారానికి రూ. 610 కోట్లు విడుదల



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరుకానున్నారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) నేతలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ఆ విషయాన్ని ప్రకటించారు. దీంతో గత రెండురోజులుగా జూడాలు చేస్తున్న నిరవధిక సమ్మెకు తెరపడింది. తెలంగాణ జూనియర్ డాక్టర్ల ఇబ్బందులను వెంటనే పరిష్కరించామని మంత్రి దామోదర వెల్లడించారు. జూడాలతో కలసి బుధవారం మంత్రి తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జూడాలు గతంలో రెండుసార్లు స్టైపెండ్ గురించి తమ దృష్టికి తెచ్చారని అన్నారు. ప్రతీసారి స్టైపెండ్ సమస్య ఎదురవుతున్నట్లు చెప్పారని, గ్రీన్ చానెల్ ద్వారా తమకు స్టైపెండ్ చెల్లించాలని, అలాగే మెడికల్ కాలేజీల్లో వసతి భవనాలు ఏర్పాటు చేయాలని వారు కోరారన్నారు. అలాగే వైద్యులకు రక్షణ కావాలని కోరారని మంత్రి తెలిపారు. దీనిపై జరిగిన చర్చలు ఫలించాయన్నారు.

స్టైపెండ్ కోసం రూ.406 కోట్లు విడుదల

పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను జూనియర్ డాక్టర్లు ఈ నెల 15న తన దృష్టికి తీసుకొచ్చారని మంత్రి దామోదర తెలిపారు. ఈ నేపథ్యంలో పది రోజుల్లో వారి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించామన్నారు. జూడాల స్టైపెండ్ కోసం రూ. 406 కోట్ల నిధులను విడుదల చేశామని చెప్పారు. దీనివల్ల వారికి ఎక్కడా పెండింగ్‌లో ఉంచే సమస్య తలెత్తదన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టల్, రోడ్డు నిర్మాణం, మరమ్మతుకు రూ.121 కోట్లు కేటాయించామని వెల్లడించారు. అలాగే గాంధీ మెడికల్ కాలేజీకి రూ.79 కోట్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో రహదారుల పునరుద్ధరణకు రూ.3.5 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కేవలం రెండు రోజుల్లోనే జూడాల సమస్యలకు సంబంధించి రూ. 610 కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడగానే వారు వెంటనే స్పందించారని తెలిపారు. వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. అక్కడ కొత్త భవన నిర్మాణానికి సానుకూలంగా ఉన్నామని చెప్పారు. సరైన సమయంలో ప్రభుత్వం ఉస్మానియా కొత్త భవనంపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. త్వరలోనే మొబైల్ ఫుడ్ ల్యాబ్స్ సంఖ్యను పెంచుతామన్నారు. అలాగే ఫుడ్, డ్రగ్ ల్యాబ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రులు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూడాల ప్రతినిధులు తాము సమ్మె విరమిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణి, జూడాల అధ్యక్షుడు హర్ష పాల్గొన్నారు. కాగా, గాంధీలో హాస్టళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలకు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సానుకూల శక్తితో కూడిన రిజర్వాయర్‌నే ఆత్మ అనొచ్చు. అది ఇసుమంత ఉండి కంటికి కనబడదు. ఆత్మ ఆధ్యాత్మిక శక్తితో మిణుకుమంటుంది. ఆత్మ సహజంగానే ప్రేమతో కూడినది. శాంతియుతమైనది. అదే జ్ఞాపకాలను ఉంచుకుంటుంది. అది అద్వితీయం.
– బ్రహ్మకుమారీలు

ఫోకస్

సాక్షి
గురువారం, 27 జూన్ 2024

ఎన్నాళ్లీ తీస్తా వివాదం!

నదీజలాల విషయంలో ఆచితూచి అడుగేయకపోతే ఆ నీళ్లల్లోనే నిప్పులు పుట్టుకొస్తాయి. అంతర్గతంగా ప్రాంతాల మధ్యనే తరచు చిచ్చు రేపే నదీజలాలు... పొరుగునున్న దేశంతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు సమస్యగా మారటంలో వింతేమీ లేదు. ఈమధ్యే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మన దేశాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో రెండు దేశాలమధ్యా పలు ద్వైపాక్షిక ఒప్పందాలు కుదరటంతోపాటు తీస్తా నదీజలాల పంపకంపై చర్చలు జరపాలనీ, ఫరక్కా జలాలపై తాజా ఒప్పందం కుదుర్చుకోవాలనీ ఇరు దేశాధినేతలూ నిర్ణయించారు. సరిగ్గా ఇదే ఇప్పుడు వివాదాన్ని రగిల్చింది. నదీజలాల విషయంలో ఉభయులకూ అంగీకారయోగ్యమైన పరిష్కారం కోసం కృషిచేయాలని భారత్, బంగ్లాదేశ్‌లు నిర్ణయించుకున్నాయని మంగళవారం ఢాకాలో హసీనా ప్రకటించిన వెంటనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చురుగ్గా స్పందించారు. ఈ అంశంలో తమను ఎందుకు సంప్రదించలేదంటూ కేంద్రంపై భగ్గుమన్నారు. ఇది సరికాదని అభ్యంతరం చెబుతూ ఆమె మోదీకి లేఖ రాశారు. మమత ఇలా స్పందించటం ఇది మొదటిసారేమీ కాదు. ప్రజానీకానికి గుక్కెడు నీళ్లందించాలన్నా, పచ్చటి పైర్లతో పొలాలు కళకళలాడాలన్నా బంగ్లాదేశ్‌కు ఈ నదీజలాలపై భారత్‌తో ఒప్పందం కుదరటం, ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావటం ఎంతో అవసరం. 2011లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు తీస్తాపై ఒప్పందం దాదాపు ఖరారైంది. కానీ ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తృణమూల్ అధినేత మమత అలకబూనటంతో అది ఆఖరు నిమిషంలో ఆగిపోయింది. రాజకీయంగా యూపీఏకు ఉన్న పరిమితులేమిటో, మమత స్వభావమేమిటో తెలిసిన హసీనా దానిపై పట్టుబట్టకుండా ఉండిపోయారు. ఈ నేపథ్యం తెలిసినందువల్లే ప్రధాని నరేంద్ర మోదీ 2015లో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లినప్పుడు తన ప్రతినిధి బృందంలో ఆమెను కూడా చేర్చారు. ఒప్పందం కుదరకపోవటం వల్ల తమ దేశానికి ఎదురవుతున్న సమస్యలను హసీనా ఆమెకు వివరించగా, రాష్ట్రంలో తనకెదురయ్యే ప్రతిబంధకాలను మమత తెలిపారని కథనాలు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో తీస్తా ప్రాజెక్టు గురించి బంగ్లాదేశ్ ప్రస్తావించకపోలేదు. కానీ బెంగాల్ అభ్యంతరాలు ఎప్పటిలాగే ఉండటం ఈ సమస్యకు శాపంగా మారింది.

నిజానికి చారిత్రకంగా, సాంస్కృతికంగా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ ఎంతో సన్నిహితమైనవి. దేశంలో జాతీయవాదం అంతకంతకు విస్తరించటానికి ఈ ప్రాంతమే కారణమని భావించిన బ్రిటిష్ వలసపాలకులు 1905లో బెంగాల్ విభజన చట్టం తీసుకొచ్చినప్పుడు నిరసనలు పెల్లుబికాయి. చివరకు 1911లో దాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఆ ప్రయత్నం హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను పెంచింది. స్వాతంత్ర్యానంతరం దేశ విభజన జరిగినప్పుడు అది పాకిస్తాన్‌లో భాగంగా మారింది. పాకిస్తాన్ చెరలో తమ అస్తిత్వాన్ని కోల్పోతున్న తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించటానికి 1971లో మన దేశం అందించిన తోడ్పాటును బంగ్లా ప్రజలు ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. కానీ బంగ్లాదేశ్ తన సమస్యలను వాయిదా వేస్తూ పోలేదు. తమ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా బంగ్లా చిరకాల ఆకాంక్ష నెరవేర్చటం ఎలాగో మమతా బెనర్జీ ఆలోచించాలి. అవసరమైతే ఒక మెట్టు దిగేందుకు కూడా సిద్ధపడాలి. గంగానదిపై బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బరాజ్ నుంచి బంగ్లాకు నదీజలాలు అందించటంపై 1996లో 30 ఏళ్లకు ఒప్పందం కుదిరింది.అది మరో రెండేళ్లలో పూర్తికావాల్సి వుంది. కనుక దానిపై కొత్తగా ఒప్పందం అవసరం. 1996లో తమకిచ్చిన హామీలను నెరవేర్చని కేంద్రం ఇప్పుడు మరోసారి తీస్తా, గంగా జలాలపై బంగ్లాతో చర్చించిందని మమత ఆరోపణ. అయితే అప్పుడూ ఇప్పుడూ కూడా బెంగాల్‌తో చర్చిస్తూనే ఉన్నామన్నది కేంద్రం జవాబు. 1996లో ఆ రాష్ట్ర ప్రతినిధిగా ఉన్న నీటిపారుదల శాఖ ప్రతినిధితో మాట్లాడారనీ, నిరుడు జూలై 24న కూడా ఫరక్కా జలాల అంశంపై ఏర్పడిన కమిటీలో బెంగాల్ నీటిపారుదల రంగం నిపుణుడు పాల్గొన్నారనీ కేంద్రం చెబుతోంది. మొన్న 14న ఆ కమిటీ నివేదిక కూడా సమర్పించిందని వివరించింది. అయితే ఇదంతా కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చేసిందే తప్ప విధానపరమైన చర్చలు కాదని మమత సర్కారు జవాబు. తమ అధికారులు కేవలం కేంద్రం అడిగిన సాంకేతిక వివరాలు మాత్రమే అందించారని తెలిపింది.

దక్షిణాసియాపైనా, మరీ ముఖ్యంగా ఈ ప్రాంత దేశాలతో భారత్‌కున్న సంబంధాలపైనా చైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇలాంటి సమయంలో పట్టుదలకు పోయి నదీజలాలపై వివాదం రాజేయటం మంచిది కాదు. తీస్తా ప్రాజెక్టుపై అటు చైనా, ఇటు భారత్ ప్రతిపాదనలిచ్చాయనీ, ఎవరి ప్రతిపాదన బాగుందో చూసి నిర్ణయిస్తామనీ మంగళవారం హసీనా తెలిపారు. ఇది ఒక రకంగా భారత్ ముందుకు రాకపోతే చైనావైపు చూస్తామని చెప్పటమే. ఎగుమతుల ద్వారా బంగ్లా సమకూర్చుకుంటున్న ఆదాయంలో 80 శాతం వాటావున్న దుస్తుల తయారీ ముడిసరుకంతా చైనాయే సరఫరా చేస్తోంది. పైగా బంగ్లా వాణిజ్యంలో చైనా అతి పెద్ద భాగస్వామి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బెంగాల్ వ్యవహరించాలి. విదేశాంగ విధాన నిర్ణయాలపై రాష్ట్రాల ప్రమేయం ఉండటం మంచిదికాదు. అదే సమయంలో బెంగాల్ ప్రయోజనాలు కాపాడటం కేంద్రం బాధ్యత. గత హామీలు నెరవేర్చలేకపోతే కారణాలేమిటో తెలుసుకుని వాటిని సరిదిద్దాలి. చిరకాల సమస్య అయిన తీస్తా వివాదంపై బెంగాల్‌ను ఒప్పించి బంగ్లా ఆకాంక్ష నెరవేర్చటం ఎలాగో కేంద్రం ఆలోచించాలి.

వాస్తవ చరిత్రతోనే మెరుగైన భవిత

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

దేశంలో కోట్లాది మంది విద్యార్థులు అభ్యసించే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మతవాద భావజాలాన్ని చొప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మతవాద భావాలు లౌకికవాద భావజాలానికి విఘాతం కలిగిస్తాయని అంబేడ్కర్ ఏనాడో అన్నారు. లౌకికవాద రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించే విధానం చరిత్రకు నష్టం కలిగిస్తుంది. విద్యార్థి సమూహానికి దేశంలోని భౌగోళిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, చరిత్ర... వాస్తవంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం కావలసి ఉంది. మతవాదాన్నే జాతీయ వాదంగా ప్రచారం చేసే ప్రయత్నాలు మంచివి కావు. భారతదేశంలో చదువుకుంటున్న విద్యార్థులు దేశ చరిత్రను శాస్త్రీయ భావాలతో, సరైన పద్ధతుల్లో అర్థం చేసుకోకపోతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరా?

ప్రస్తుతం భారతదేశ వ్యాప్తంగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను అభ్యసిస్తున్న విద్యార్థులు సుమారు నాలుగు కోట్ల మంది ఉన్నారు. మొదట సిలబస్ రూపకల్పనలో భారత దేశ రాజ్యాంగ స్ఫూర్తి కలిగిన, జాతీయ భావాలు కలిగిన, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో పరిశోధకులు అయిన మేధావులు ఉన్నారు. అయితే వాజ్‌పేయి కాలం నుంచి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను మార్చి మతవాద పూరితమైన భావజాలాన్ని చూపించాలనే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వాలు చేస్తూ వస్తున్నాయి. భారతదేశంలో చదువుకుంటున్న విద్యార్థులు దేశ చరిత్రను శాస్త్రీయ భావాలతో, సరైన పద్ధతుల్లో అర్థం చేసుకోకపోతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరా?

విద్యార్థి సమూహానికి దేశంలోని భౌగోళిక పరిస్థితులు, సామాజిక, లౌకికవాదాల పరిస్థితులు, చరిత్ర... వాస్తవంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం కావలసి ఉంది. అయితే బీజేపీ ప్రభుత్వం మతవాదాన్నే జాతీయవాదంగా ప్రచారం చేసే ప్రయత్నాలు చేస్తోంది. పాఠ్య గ్రంథాలు రూపొందించినవారి అనుమతి లేకుండా తమకు అనుకూలంగా పాఠ్య గ్రంథాలను మార్చేశారు. అందుకే తమ అనుమతి లేకుండా పాఠ్య గ్రంథాలను మార్చేసి, సలహాదారుల్లో తమ పేరు ఉంచి ప్రచురిస్తే కోర్టులో కేసులు దాఖలు చేస్తామని ప్రొఫెసర్లు యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్శీకర్ హెచ్చరించే దాకా పరిస్థితి వచ్చింది. ఈ మేరకు వారు ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీకి లేఖ రాశారు. చరిత్రలో వాస్తవ ఘట్టాలను తొలగించి, కల్పిత కథలను చేర్చి, వాస్తవ ఆధునిక రాజకీయ చరిత్రను విద్యార్థులకు అందకుండా చేసే నైతిక హక్కు మీకు లేదని వారు వాదించారు. ముఖ్యంగా భారతదేశ ఆధునిక చరిత్రలో అద్వానీ చేసిన రథయాత్రను, హిందూ మత వాదాన్ని రాజకీయాల్లో చొప్పించి భారతదేశంలో హిందువులు, హిందూయేతరులు అనే భావజాలాన్ని తీసుకొచ్చారు.

అద్వానీ రథ యాత్ర దేశ రాజకీయాల్లో హిందూ భావజాలాన్ని పెంపొందించింది. అంతకు మునుపే హిందూ, ముస్లిం రాజకీయ విభేదాలను పెంచే మతవాద చరిత్రలు కొందరి చేత రాయబడి ఈ వైషమ్యాలను బాగా పెంచాయి. స్వాతంత్రోద్యమానికి ముందు నుంచి కూడా ఈ వైషమ్యాలను పెంచే భావజాల చరిత్ర రాయబడుతూ వచ్చింది. 19వ శతాబ్దంలో భారతీయ రాజకీయాల్లో మత వాదం చోటు చేసుకొనే సరికి మతాన్ని అన్వయించి రాయడం మొదలయింది. మధ్యయుగ భారత చరిత్రను మతవాదులు సుదీర్ఘమయిన హిందూ, ముస్లిం సంఘర్షణగా చూస్తూ, అనివార్యంగా అదే దృష్టిని 19, 20 శతాబ్దాలకు అన్వయిస్తూ, జాతి వివక్ష సిద్ధాంతానికి, రాజకీయాలకు ఈ ఆధునిక యుగంలో 'న్యాయం' చేయగలిగామనుకొంటున్నారు. మత వివక్షతా చరిత్రకారులు మధ్యయుగాల్లోని ముస్లిం పాలకుల పాలనను విదేశీయుల పాలనగా చిత్రీకరిస్తూ, భారత సమాజానికి ముస్లింలు శాశ్వతంగా విదేశీయులని చెప్పగలుగుతున్నారు. ఈ దారుణమైన భావం హిందూ, ముస్లింల వైషమ్యాలను పెంచడానికి మరింతగా తోడ్పడింది. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడమనే ప్రక్రియ భారతదేశ చీలికకు దారితీసింది.



ఈ విషయంగా మొదటి నుండి బి.ఆర్.అంబేడ్కర్ ఆందోళన చెందారు. భారతదేశంలో మతవాద భావాలు లౌకికవాద భావజాలానికి విఘాతం కలిగిస్తాయనీ, రాజ్యాంగంలో పేర్కొన్న సౌభ్రాతృత్వం, సామాజిక సమతుల్యత భావాలు దెబ్బతింటాయనీ అన్నారు. ఇప్పుడు చరిత్రలో వీరు తొలగించిన పాఠ్యాంశాల్లో ఎంతో రాజకీయ చరిత్ర దాగి వుంది. 'బాబ్రి మసీదు' కూల్చివేత చిన్న విషయం కాదు. ఆ కూల్చివేత వెనుక 'హిందూ రాజ్య' నిర్మాణ భావన ఉంది. లౌకికవాద భావజాలానికి ఆ చర్య గొడ్డలి పెట్టు. బాబ్రీ మసీదు కూల్చివేత ముస్లింలకు అభద్రత తీసుకొచ్చింది. నిజానికి చరిత్ర అనేది వాస్తవ ఘటనల సముచ్ఛయంగా ఉండాలి. కొత్తగా సిద్ధం చేసిన పాఠ్యపుస్తకాలలో బాబ్రీ మసీదు విధ్వంసానికి ముందు జరిగిన అద్వానీ రథ యాత్ర, ఆ తరువాత జరిగిన పరిణామాలను తొలగించేశారు. వివాదాస్పద స్థలంలో రామ మందిరం నిర్మించడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి మాత్రం విస్తారంగా ప్రస్తావించారు. అయోధ్య గురించి మునుపటి పుస్తకాలలో నాలుగు పేజీలు ఉంటే ఇప్పుడు రెండు పేజీలకు కుదించారు. వాస్తవ ఘటనలను తొలగిస్తే, 'బాబ్రీ మసీదు' కూల్చివేతను గురించిన మూలాలు, 'రామ మందిరం' నిర్మాణం దృక్పథం తెలియకుండా పోతాయి.

పాఠ్యపుస్తకాలను కాషాయీకరించాలన్న ప్రస్తుత పాలకుల ధోరణికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేయడాన్ని లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, సామ్యవాదులు, చరిత్ర రచనా ప్రవీణులు నిరసిస్తున్నారు. దేశంలో అంబేడ్కర్ కృషి వలన లౌకికభావ స్ఫూర్తి బలంగా ఉంది. దేశ చరిత్ర ఎప్పుడూ కూడా మతవాదంతో సాగదు. అది ఉత్పత్తి శక్తుల వల్లే ముందుకు సాగుతుంది. ఈనాటి పాఠ్య ప్రణాళిక భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే ముందుకు నడవవలసి ఉంది. భారత దేశ సంస్కృతిలో, ప్రజల్లో మొదటి నుండి కూడా పోరాట పటిమ ఉంది. ఇంగ్లీషువాళ్ళు అనేక రూపాల్లో మన సంపదను దోచుకుని, సుఖాలు పొందుతున్న విషయాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, పేద ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో పన్నుల చేత వేధించబడ్డారు. అందుకే భారతదేశంలో అన్ని వర్గాల ప్రజల్లో పోరాట పటిమ పెరిగింది. 'రూపాయి సమస్య' అనే గ్రంథంలో బ్రిటిష్ వాళ్ళ ఆర్థిక దోపిడీని గురించి అంబేడ్కర్ స్పష్టంగా నివేదించారు.

ఇకపోతే రాబోయే చరిత్రలో మోదీ పాలనలోని ఎన్నో దాడులు, అణచివేతలు చరిత్రకు సాక్ష్యాలు. ఒకసారి మనం అవలోకిస్తే ఎన్నో దారుణమైన ఘట్టాలు మనముందు వచ్చి నిలబడతాయి. ప్రజల జీవనోపాధిపై దాడి, నోట్ల రద్దు వల్ల ఏర్పడిన సంక్షోభం, గో రక్షణ పేరుతో జరిగిన దాడులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో పాటు వాటి విక్రయాలు... ఇలా ఎన్నో. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సుదీర్ఘ కాలంగా ఉనికిలో ఉండటమేగాక, ఆయా సంఘాలు దశాబ్దాలుగా నయా ఉదారవాద విధానాలను ఎదుర్కోవడంలో ప్రధానపాత్ర పోషించాయి. వారి అనుభవం కూడా రైతు ఉద్యమానికి లాభించింది. 2018 మార్చిలో నాసిక్ నుండి ముంబై వరకు సుదీర్ఘంగా సాగిన కిసాన్ లాంగ్ మార్చ్ రైతుల డిమాండ్లను నొక్కిచెప్పింది. ఈ లాంగ్ మార్చ్ బీజేపీని ఓడించటం సాధ్యమేనని... బీజేపీ అజేయశక్తి అనే అభిప్రాయం కేవలం కార్పొరేట్ మీడియా ప్రచార సృష్టి మాత్రమేనని స్పష్టమైన సందేశాన్ని పంపింది. 2019 సంవత్సరంలో జరిగిన పుల్వామా ఘటన, ప్రతిగా జరిగిన బాలాకోట్ వైమానిక దాడి, ఆ తరువాత తీవ్ర జాతీయవాద ప్రచార నేపథ్యంలో బీజేపీ విజయం సాధించినప్పటికీ... 2024 కల్లా 240 సీట్లకు ఎందుకు పడిపోయిందో ప్రజలకు, విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉంది.

దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ స్ఫూర్తి పెరుగుతున్నాయి. ఈ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించే విధానం చరిత్రకు నష్టం కలిగిస్తుంది. రాబోయే తరాలు లౌకికవాదానికీ, మతవాదానికీ జరిగిన సమరాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు భారతీయులే అనేది ముందు గుర్తించాలి. భారతీయులందరికీ వాస్తవమైన చరిత్రను అందించినప్పుడే భారతదేశ పరిణామం త్వరితం అవుతుంది. డీడీ కోశాంబీ, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, అంబేడ్కర్ రచనలు భారతదేశ చరిత్ర నిర్మాణానికి దిశా నిర్దేశం చేస్తున్నాయి. ఆ వైపు నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు I 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భిన్నమైన సభ



లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా తిరిగి ఎన్నికయ్యారు. కానీ 17వ లోక్‌సభ కంటే 18వ లోక్‌సభ భిన్నమైనదని ఆయన గుర్తించాలి. 2024లో ప్రజలు బలమైన ప్రతిపక్షానికి ఓటు వేశారు. జనాల తీర్పును తప్పని సరిగా దృష్టిలో ఉంచుకోవాలి.

– సాగరికా ఘోష్, రాజ్యసభ ఎంపీ (తృణమూల్)

ఇప్పుడెందుకు?



ఎందుకు వాళ్లు ఉన్నట్టుండి బిగ్గరగా 49 ఏళ్ల నాటి ఎమర్జెన్సీ అంశాన్ని 'ఇప్పుడు' లేవనెత్తుతున్నారు? అదీ మధ్య కాలంలో ఉన్న అన్ని సంక్షోభాలను వదిలేసి? ఏంటి గేమ్‌ప్లాన్?

– సిమి గరేవాల్, నటి, టీవీ హోస్ట్

మద్దతు లేదా?



లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అంశంలో కాంగ్రెస్ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోయివుండొచ్చా? ఆ కారణం వల్లే రాహుల్ గాంధీ నంబర్ గేమ్ ఆడలేదా?

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

భూమికి నష్టం



మంచి వ్యవసాయ భూముల్లో భారీ సంఖ్యలో ఏర్పాటుచేసే సోలార్ ప్యానెల్స్ (సౌర ఫలకలు) చివరకు చెడ్డ వాతావరణం వల్ల పాడవడమో, విషపూరిత రసాయనాలను నేలలోకి వదలడమో, 25 ఏళ్ల తర్వాత భూమిలో గుట్టలుగా పోగుపడటమో జరుగుతుంది. ఇది పర్యావరణ వాదానికి వ్యతిరేకం. కార్పొరేట్లు భూమిని లాక్కోవడం వల్ల జరిగే నేల విధ్వంసం.

– జేమ్స్ మెల్‌విల్, వ్యాఖ్యాత

ఇక్కడొద్దా?



పాకిస్తానీల్లారా! మీరు ఎప్పుడూ యూరప్, యూఎస్ఏ, ఇండియా లాంటి చోట్ల లౌకికవాదాన్ని ప్రేమిస్తారు? కానీ ఎప్పుడూ ఎందుకు పాకిస్తాన్‌లో దాన్ని అసహ్యించుకుంటారు? దయచేసి దీన్ని అర్థం చేసుకోవడంలో సాయపడండి.

– మునీబ్ ఖాదిర్, పాక్ న్యాయవాది

ఇన్ బాక్స్

లోకం పచ్చగా ఉండాలంటే...

సమాజం ఎంత ఆధునికంగా మారితే ప్రకృతి అంత తీవ్రంగా ధ్వంసం మవుతున్నదనేది చరిత్ర చెబుతున్న పాఠం. అడవులను విచక్షణారహితంగా నరకడం, తిరిగి చెట్లను నాటాలనే బాధ్యతను విస్మరించడం, అవసరానికి మించి ప్లాస్టిక్‌ను వాడటం, కర్బన ఉద్గారాలను తగ్గించలేకపోవటం వంటి వివిధ కారణాల వల్ల పర్యావరణం కలుషితమయ్యి నేడు సమస్త మానవాళిపై కన్నెర్ర చేస్తోంది. దీంతో మానవ మనుగడే ప్రశ్నార్థకమయ్యింది.

నేడు త్రాగడానికి మంచినీరు, శ్వాసించడానికి ఆక్సిజన్ దొరకని ఆందోళనకర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుంది మనం గర్వంగా చెప్పుకునే 5జీ ప్రపంచం. మనమంతా ఈ అవనిపై అతిథులం అనే సత్యాన్ని చాలా మంది గ్రహించలేపోతున్నారు. భవిష్యత్ తరాలకు బతుకునీయాలంటే, బతుకు ఉండాలంటే ప్రపంచ దేశాలు సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రకృతితో స్నేహం చేయాలి. పచ్చదనాన్ని పరిమళించేలా చేయాలి. మనం నాటే చెట్ల ఎదుగుదలే మానవ నాగరికత ప్రగతిగా భావించాలి. చెట్లను నాటినట్లు నటించడం మానేయాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని బాగా తగ్గించాలి. జల వనరులను సంరక్షించాలి. అడవులను కాపాడుకోవాలి. సౌర విద్యుత్ వినియోగం పెంచాలి. వాయు కాలుష్యం తగ్గించాలి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలి. ఓజోన్ పొరను కాపాడాలి.

సాంకేతికంగా ఎదుగుతూనే పర్యావరణ పరిరక్షణపై ప్రపంచదేశాలు కలిసి పనిచేయాలి. భావి పౌరులైన విద్యార్థులకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి. ప్రకృతి ప్రాణంతో ఉంటేనే మనమంతా జీవంతో ఉంటాము. లేదంటే ప్రకృతి ప్రదర్శించే విధ్వంసాన్ని ఆపడం అసాధ్యం. 'ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది, మన అంతులేని కోరికలను కాద'ని ఏనాడో గాంధీజీ అన్నారు. కాబట్టి మనిషి ప్రకృతిని దురాశతో కొల్లగొట్టి ధ్వంసం చేయకుండా అవసరం మేరకే దానిపై ఆధారపడాలి. అప్పుడు లోకం పచ్చగా ఉంటుంది.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్, నాగర్ కర్నూల్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఓబీసీల కోసం రాజ్యాంగ సవరణ తప్పదు

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

బిహార్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. ఇది దేశంలోని బీసీ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. బిహార్ నమూనాగా ఇతర రాష్ట్రాలు కూడా కులగణన చేసి శాస్త్రీయంగా బీసీల జీవన స్థితిగతుల లెక్కలు తీసుకుని విద్యా–ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంపుదల చేసుకోవచ్చని ఆశగా ఎదురు చూసిన వారు విస్మయానికి గురైనారు. దీంతో రాజ్యాంగ సవరణ చేయకుండా ఓబీసీల విద్యా–ఉద్యోగ రిజర్వేషన్ల పెంపుదల జరుగదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రం 69 శాతానికి పెంచిన మొత్తం రిజర్వేషన్ శాతం ఇప్పటికీ కొనసాగుతున్న విషయం గమనార్హం. శాసన సభలో ఏకగ్రీవంగా ఆమోదించిన ఒక బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది రాష్ట్ర ప్రభుత్వం. పార్టీలకు అతీతంగా సీఎం జయలలిత ఆధ్వర్యంలో అన్ని పార్టీల ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్లి అప్పటి పీవీ నరసింహారావు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి... తమ శాసన సభ చేసిన చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చేశారు. దీంతో తమిళనాడులో అమలు జరుగుతున్న 69 శాతం రిజర్వేషన్లపై ఏ కోర్టులోనూ ఛాలెంజ్ చేసే అవకాశం లేకుండాపోయింది.

బిహార్ రాష్ట్రం కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ తరహాలో బీసీలకు అధిక రిజర్వేషన్లు అందేలా చూడాలి. బిహార్‌తో పాటుగా అన్ని రాష్ట్రాలూ ఇదే దారిలో ప్రయాణించవలసి ఉంది. ఇది జాతీయ ఉద్యమంగా రూపుదాల్చవలసి ఉన్నది. ఏ రాష్ట్రంలోనైనా బీసీల రిజర్వేషన్లు పెంచాలనే తలంపుతో ఏ విధాన నిర్ణయం తీసుకున్నప్పటికీ 1992లో 'ఇందిరా సహానీ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన 'మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాద'నే తీర్పును అడ్డుపెట్టుకుని ఆధిపత్య వర్గాలు కోర్టులకు వెళ్ళి అడ్డుపడుతున్నాయి. బిహార్‌లో మాదిరిగా మహారాష్ట్ర, రాజస్థాన్, హరియాణా ప్రభుత్వాలు 50 శాతం రిజర్వేషన్లు మించి ఇచ్చాయని సుప్రీంకోర్టులో పిల్స్ వేశారు. దీన్ని బట్టి చూస్తే విధిగా రాజ్యాంగసవరణ చేస్తే తప్ప బీసీలకు న్యాయం చేయడానికి వేరే మార్గం లేదని అర్థమవుతుంది.

బిహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 50 శాతానికి మించి ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలా అంగీకరించిందని బీసీలు ప్రశ్నిస్తున్నారు. ఈ డబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు జనాభా గణన చేయలేదు. వారి జీవన స్థితిగతులను అధ్యయనం చేయకుండా అగ్రవర్ణాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. దేశజనాభాలో అగ్రవర్ణాలు ఎంతమంది? వారిలో



పేదరికం ఎంత శాతం? ఈ లెక్కలు లేకుండా 10 శాతం రిజర్వేషన్లు ఎలా ఇచ్చారో కేంద్రమే చెప్పాలి. అయినా సుప్రీంకోర్టు ధర్మాసనం 10 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 85 శాతం మంది ఉంటే వీరిలో 56 శాతంగా ఉన్న బీసీలలో పేదలు ఎంతమందో ఎవరి దగ్గరా లెక్కలు లేవు. అందుకే ఓబీసీ రిజర్వేషన్లలో ఎలాంటి పరిమితి విధించకుండా అత్యవసరంగా రాజ్యాంగంలోని 15(4), 16(4) ఆర్టికల్స్‌ను సవరించాలి. అపుడే బీసీలకు విద్యా–ఉద్యోగ రంగాలలో న్యాయం జరుగుతుంది.

పట్నా హైకోర్టు తీర్పు తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇపుడు దేశంలోని ఓబీసీలంతా స్పష్టంగా మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలతో తమిళనాడులో రామస్వామి పెరియార్ కొనసాగించిన ఉద్యమ స్ఫూర్తితో ఓబీసీ ఉద్యమం కొనసాగించవలసి ఉంది. నితీష్ ప్రభుత్వం ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున తమిళనాడులాగా ఒక చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చుకుని బిహారు రాష్ట్రం వరకు రిజర్వేషన్ల పెంపును అమలు జరుపుకునే అవకాశముంది. ప్రస్తుతం ఎన్డీఏ మిత్రత్వం బిహారుకు కలిసివచ్చే విధంగా ఉంది.

దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఒక్క తాటిపైకి వచ్చి బడుగులందరి తరపున నిలిచి కేంద్రంపై బీసీ రిజర్వేషన్లు పెంచడానికై రాజ్యాంగ సవరణ చేయాలని ఒత్తిడి పెంచాలి. ఓబీసీల హక్కుల సాధన కోసం జాతీయోద్యమం రూపుదాల్చే సమయం ఆసన్నమయ్యింది.

దేశంలో రిజర్వేషన్ల రక్షణ కోసం పాటు పడిన బీఆర్ అంబేడ్కర్ తర్వాత అంతగా కృషి చేసినవారు తమిళనాడు సామాజిక, రాజకీయ రంగాల నాయకులనే చెప్పాలి. ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు విద్యా–ఉద్యోగాలలో రిజర్వేషన్ల పెంపుదల కోసం తమిళనాడులో మహోద్యమాలు జరిగాయి. పెరియార్ రామస్వామి చేసిన కృషి మరువలేనిది. రిజర్వేషన్లను న్యాయస్థానం అడ్డుకోకుండా చేయడంలో పెరియార్ రామస్వామి జరిపిన పోరాటం మరిచిపోలేనిది. అంబేడ్కర్ రిజర్వేషన్ల రక్షణ కోసం చేసిన పోరాటానికి కొనసాగింపుగా తమిళనాడులో పెరియార్, ఉత్తర భారతంలో రామ్ మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్‌లు చేసిన ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు దేశవ్యాపితంగా ఓబీసీ రిజర్వేషన్ల కోసం జాతీయ ఉద్యమం రూపుదాల్చవలసి ఉంది. నేటి ఓబీసీ యువతరం, విద్యావంతులు ఈ ఉద్యమంలో కీలకంగా పాల్గొనాలి. బడుగు వర్గాల నుంచి వచ్చిన యువతరం బీసీలకు జరిగిన అన్యాయాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. బీసీలను ఐకమత్యం చేసే పనిలో పాలుపంచుకోవాలి. ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాలలో బీసీలకు న్యాయం జరిగేదాకా ఉద్యమపథంలో ముందుకు సాగక తప్పదు. న్యాయస్థానాల్లో న్యాయపోరాటం విధిగా చేయాలి.

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్

భగవత్ప్రసాదం

ఈ విశ్వంలో ఆలోచనలు, భావనలను మనిషి మాత్రమే మాటల ద్వారా తెలుపగలడు. ఏ ఇతర జీవికీ మాట్లాడే శక్తి లేదు. మాట్లాడటం అనేది భగవంతుడు మానవునికి అనుగ్రహించిన వరప్రసాదం. మానవుడు తన జీవితాన్ని సంతోషమయం లేక దుఃఖమయం కావించుకోవడం అనేది దేవుడు ఇచ్చిన వరప్రసాదాన్ని ఉపయోగించుకొనే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మాటను సరిగా, విచక్షణతో ఉపయోగించుకొన్న మానవుడు... తాను ఆనందంగా ఉండడమే కాక ఇతరులను కూడా సంతోషపరచగలడు. దీనికి భిన్నంగా విచక్షణారహితమైన, అస్తవ్యస్తమైన మాటలు మాట్లాడుట వల్ల సమస్యలు వస్తాయి. ఫలితంగా మనిషి జీవితం దుఃఖమయం అవుతుంది. ఈ కారణం వల్లనే 'మాట్లాడడానికి ముందు ఆలోచించు' అని పెద్దలు చెప్పారు. మనం సర్వకాల, సర్వావస్థల యందు తియ్యగా, ఇంపుగా మాట్లాడటానికి ప్రయత్నించాలి. మనం మాట్లాడే పద్ధతి ఇతరులను కోపోద్రిక్తులను చేయకుండా జాగ్రత్త పడాలి. ఎల్లప్పుడూ సత్యాన్నే పలకాలి. నియమాలను ఉల్లంఘించకుండా ఉండడమే వినయం. ఈ పద్ధతి భగవద్గీతలో 'వాఙ్మయ తపస్సు'అని తెలుపబడినది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనం చేయు భౌతికపరమైన పనులన్నీ ఆలోచనల పైననే ఆధారపడి ఉంటాయి. ఆలోచించడం, మంచి–చెడులను తెలుసుకొనడం బుద్ధికి సంబంధించిన పని. బుద్ధిబలాన్ని ఉపయోగించి 'ఏది ఉచితం, ఏది ఉచితం కాదు' అని మనం తెలుసుకో గలుగుతున్నాం. మనం చేసే పనిని బట్టి మన ఆలోచన వ్యక్తమవుతుంది. ఉదాహరణకు ఒక వక్త ముందు మైక్ ఏర్పాటు చేసినా... ఆ వక్త ఆలోచన మాటల రూపంలో బయటికి రానంత వరకూ మైక్ మనకు వినిపింప చేయలేదు. అలాగే క్రియ అనేది దానంతట అది మంచి కాదు లేక చెడు కాదు. దీని (చర్య) మంచి, చెడులు దీనికి మూలాధారమైన ఆలోచనలోనే ఉంటాయి. అందువల్లనే మనం చేసే పని మంచిగానూ, గౌరవప్రదంగానూ ఉండాలి. మంచి ఆలోచనలకే తావునిచ్చి, వాటిని వృద్ధి చేసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.36 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** శతభిషం ప.2.05 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.8.03 నుండి 9.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.52 నుండి 10.44 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.23 నుండి 8.54 వరకు, తిరిగి తె.5.02 నుండి 6.29 వరకు(తెల్లవారితే శుక్రవారం) ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

కౌలు రైతులకూ 'భరోసా'!

- ఈ సీజన్ నుంచే ఇచ్చేందుకు కసరత్తు
- కౌలు రైతులను ఎలా గుర్తించాలన్న దానిపై తర్జనభర్జన
- త్వరలో రైతు సంఘాలతో సమావేశం



సాక్షి, హైదరాబాద్: కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఈ వానాకాలం నుంచే అమలు చేయాలని యోచిస్తోంది. రైతుభరోసాపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. ఎన్నికలకు ముందు రైతులతోపాటు కౌలు రైతులకు కూడా రైతుభరోసా సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా ఏడాదికి ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందించనుంది. అయితే కౌలు రైతులను గుర్తించడమే ప్రభుత్వానికి అసలు సవాల్‌గా మారింది. చాలామంది కూలీలు రైతుల వద్ద కొంత భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. కొందరు రైతులు కూడా తమ భూమితోపాటు ఇతర రైతుల వద్ద కౌలుకు తీసుకొని కూడా సాగు చేస్తుంటారు. ఇలా రెండు విధాలుగా కౌలు రైతులుంటారు. ఒకరు భూమి ఉన్నవారు, ఇంకొకరు భూమిలేని కౌలు రైతులు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులుండగా కౌలు రైతులు సుమారు 25 లక్షల వరకు ఉంటారని అంచనా. అయితే వీరిని గుర్తించేందుకు 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతుల చట్టం తెచ్చింది. దీనిప్రకారం కౌలు రైతులను గుర్తిస్తామని ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు అనేక అధికారాలు సంక్రమిస్తాయి. అదేవిధంగా చట్టపరంగా కౌలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అసలు రైతులు కౌలుపై అధికారికంగా ఒప్పందం చేసుకోవడానికి ముందుకొచ్చే అవకాశం ఉంటుందా అన్న సందేహం తలెత్తుతోంది. కౌలు రైతు కోసం అసలు రైతు పెట్టుబడి సాయాన్ని కోల్పోయేందుకు సిద్ధంగా ఉంటారా అనేది ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో కౌలు రైతులను ఎలా గుర్తించాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఏదిఏమైనా జూలై 15లోపు రైతుభరోసాపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉపసంఘాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సబ్‌కమిటీ త్వరలో పలువురు రైతు సంఘాల నేతలతోనూ, మేధావులతోనూ సమావేశం కానుంది. రైతుభరోసా మార్గదర్శకాల్లో భాగంగానే కౌలు రైతులకు ఎలా ఇవ్వాలన్న దానిపై అభిప్రాయాలు స్వీకరిస్తారు. కాగా, రైతు భరోసాకు నిబంధనలు కఠినంగా ఉంటాయన్న చర్చ జరుగుతోంది. పీఎం కిసాన్ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటారన్న వాదనలు కూడా ఉన్నాయి. వాస్తవంగా రైతుబంధుకు, రైతుభరోసాకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటుందని అధికారులు అంటున్నారు. అదీగాక రైతుబంధు మార్గదర్శకాలన్నీ పూర్తిస్థాయిలో మారుతాయని, దాని స్వరూపమే మారుతుందని చెబుతున్నారు.

రూ.4 కోట్ల విలువైన గంజాయి దహనం

కోర్టు ఆదేశాల మేరకు తుక్కాపురంలో కాల్చేసిన రైల్వే పోలీసులు



గంజాయిని దహనం చేస్తున్న రైల్వే పోలీసులు

సాక్షి,యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా తుక్కాపురంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు బుధవారం రూ.4 కోట్ల విలువైన 1,575 కిలోల గంజాయిని దహనం చేశారు. 2021 నుంచి 2023 వరకు సికింద్రాబాద్, వరంగల్, కాచిగూడ, కాజీపేట, నిజామాబాద్, నల్లగొండ, హైదరాబాద్, వికారాబాద్ రైల్వేస్టేషన్ల పరిధిలో ఈ గంజాయిని పట్టుకున్నట్లు రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు గంజాయిని దశల వారీగా తుక్కాపురంలోని రోమా ఇండస్ట్రీస్ మెడికల్ వేస్టేజ్ కంపెనీలోని బాయిలర్‌లో వేసి దహనం చేశారు. సికింద్రాబాద్ అర్బన్ పరిధిలో రూ.1,44,75,000 విలువ చేసే 579 కిలోల గంజాయి, సికింద్రాబాద్ రూరల్ పరిధిలో రూ.24,50,000 విలువ చేసే 98.68 కిలోల గంజాయి, ఖాజీపేట డివిజన్‌లో రూ.2.24 లక్షల విలువ చేసే 896.70 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు రైల్వే ఎస్పీ వివరించారు.

ఆస్తులు జప్తు చేస్తాం

ఎవరైనా గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా వారి ఆస్తులు జప్తు చేస్తామని రైల్వే ఎస్పీ చందనా దీప్తి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి గంజాయి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోందన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు రైల్వే పోలీసులతో రహస్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైళ్లలో ఎవరైనా అనుమానాస్పదంగా బ్యాగులు పెడితే వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆమె వెంట రైల్వే డీఎస్పీలు ఎస్.ఎన్. జావేద్ అలీ, టి.కృపాకర్, ఇన్‌స్పెక్టర్లు, జీఆర్‌పీ పోలీసులు ఉన్నారు.

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్ కేసులో తీర్పు రిజర్వ్

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. వాదనలు విన్న 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పును రిజర్వ్ చేశారు. ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న భుజంగరావు, ప్రణీత్‌రావు, తిరుపతన్నలు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వారి తరఫు న్యాయవాదులు ఉమామహేశ్వర్ రావు, వి.సురేందర్‌రావు బుధవారం వాదనలు వినిపించారు. ఇప్పటికే 90 రోజులు అయినా పూర్తి చార్జిషీట్ ను పోలీసులు దాఖలు చేయలేకపోతు న్నారని వివరించారు. పూర్తి ఆధారాలు ఉంటే ఇన్ని రోజులు అవుతున్నా.. ఎందుకు చార్జిషీట్ వేయలేదన్నారు. ఇప్పటికీ పూర్తి ఆధారాలు లేకుండా చార్జిషీట్ దాఖలు చేసినందుకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరువురి వాదనలు విన్న మేజిస్ట్రేట్ తీర్పును రిజర్వ్ చేస్తూ.. జడ్జిమెంట్‌ను గురువారానికి వాయిదా వేశారు.

'ఆదివాసీల హక్కులు కాలరాస్తున్నారు'



మాట్లాడుతున్న కవి శివారెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): మధ్యభారత దేశంలో ఆదివాసీ హక్కులను కాలరాస్తూ, ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మంది గిరిజనులను చంపుతూ నరమేధం సృష్టిస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆవేదన వ్యక్తం చేసింది. మావో యిస్టుల ఏరివేత పేరుతో వారు చంపుతున్న వారిలో 70% వరకు అమాయక గిరిజనులే ఉంటున్నారని తెలిపింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కవి కె.శివారెడ్డి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పీవోడబ్ల్యూ సంధ్య విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోనే కాకుండా మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఆదివాసీలపై జరుగు తున్న ఘోరాలను ప్రజలకు వివరించేందుకు, వారికి అండగా ఉండేందుకే సంఘీభావ వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 40కి పైగా పార్టీలు, ప్రజా సంఘాలకు ఇందులో భాగస్వామ్యం ఉన్నట్టు పేర్కొన్నారు. అడవిలోని అపారమైన ఖనిజ సంపద ను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే ఈ మారణ కాండ సాగిస్తున్నారని ఆరోపించారు.

కార్మికుల విద్యాభివృద్ధికి సాహూ మహారాజ్ కృషి

- దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: మహిళలు, కార్మికులకు రాత్రి బడులు ఏర్పాటు చేసి వారి విద్యాభివృద్ధికి సాహూ మహారాజ్ పాటుపడ్డారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. కొల్హాపూర్ సంస్థానాధీశుడు ఛత్రపతి శివాజీ దత్తపుత్రుడు సాహూ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో బీసీ రాజ్యాధి కార సమితి నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ 19వ శతాబ్దంలో నెలకొన్న సాంఘిక, సామాజిక అసమాన తలను రూపుమాపి, అంటరానితన నిర్మూల నకు చట్టం చేసిన తొలి భారతీయ చక్రవర్తిగా సాహూ మహారాజ్ కీర్తి గడించారని పేర్కొ న్నారు. బ్రాహ్మణేతర కులాలకు విద్యా ఉద్యో గాలు కల్పించడం ద్వారానే అట్టడుగు వర్గాలు వృద్ధి చెందుతాయని భావించి హరిజన, గిరిజన అట్టడుగు వర్గాలకు సాహూ రిజర్వే షన్లను అమలుచేశారని సురేశ్ తెలిపారు.

అక్టోబర్‌లోగా యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి

ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని యూనిట్-1, యూనిట్-2ల నిర్మాణం సత్వరంగా పూర్తిచేసి అక్టోబర్‌లోగా విద్యుదుత్పత్తిని ప్రారంభించాలని ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. బుధవారం ఆయన ఇంధన శాఖ కార్యదర్శిగా, జెన్‌కో, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రాస్ ట్రాన్స్‌కో, జెన్‌కో ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

'జూలై 1న కగార్ వ్యతిరేక దినంగా పాటించండి'

చర్ల: జూలై 1న ప్రపంచ కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం లేఖ విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో రాజకీయాధికారం కోసం కగార్ పేరుతో విప్లవకారులు, ఆదివాసీలపై సైనిక క్యాంపెయిన్ చేపట్టి ఆరు నెలలుగా ఊచకోత కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 130 మందిని పైగా హత్య చేశారని, పిట్టపాడా, చీపురుబట్టి, కొర్చోల్, పిడియా, ఆపటోలా, కకూర్‌లాంటి అమానవీయ చర్యలకు పాల్ప డుతూ నరమేధం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా వీటన్నింటినీ ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

శాలిగౌరారం ఎస్‌ఐపై డీజీపీకి ఫిర్యాదు

- తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని మహిళ ఆవేదన
- ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తనపట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ అదే మండలానికి చెందిన మహిళ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఆ మహిళ ఈనెల 24వ తేదీన జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ విచారణకు ఆదేశించారు. కాగా, బుధవారం ఆమె ఇదే అంశంపై రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డీజీపీకి కూడా ఫిర్యాదును పంపించారు. ఈ విషయంలో విచారణాధికారిని మార్చాలని ఆమె తన ఫిర్యాదులో డీజీపీని కోరారు. భార్యా భర్తల పంచాయితీ విషయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఎస్‌ఐ, మళ్లీ ఫిర్యాదు చేయాలంటూ తనను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అనుచితంగా ప్రవర్తించారని ఆమె పేర్కొన్నారు. 'పోలీస్‌స్టేషన్‌కు అప్పుడప్పుడు వచ్చి నేను చెప్పినట్లు నడుచుకోవాలి. అలాగైతేనే నీకు అన్ని విధాలా మంచిది. నీ ఫోన్ నంబర్ ఇవ్వు. నీ ప్రతీ అక్కర తీరుస్తా. ఈ సంభాషణ మన మధ్యనే ఉండాలి. ఎవరికీ చెప్పవద్దు. ఒకవేళ చెబితే మీ కుటుంబ విషయాల్లో తలదూర్చి అక్రమ కేసులు బనాయిస్తా. నీకంటే మీ అమ్మ ఇంకా బాగుంది' అని తనను వేదనకు గురి చేశాడని ఆ మహిళ తన ఫిర్యాదులో వివరించారు.

చిరుతను తప్పించబోయి కారు బోల్తా

ప్రమాదంలో భార్య మృతి... భర్తకు తీవ్రగాయాలు

మోపాల్ (నిజామాబాద్ రూరల్): చిరుతను తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం యాచారం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాలోత్ లలితాబాయి (30) ఆమె భర్త మాలోత్ ప్రభాకర్ మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వచ్చారు. తిరిగి రాత్రి 9 గంటల సమయంలో కారులో ఇంటికి బయల్దేరారు. మోపాల్ మండలంలోని అమ్రాబాద్ శివారులో ఒక్కసారిగా చిరుత అడ్డుగా రావడంతో కారు నడుపుతున్న ప్రభాకర్ దాన్ని తప్పించబోయాడు. దీంతో కారు అదే వేగంలో రోడ్డు పక్కనున్న పెద్ద బండరాయిపైకి ఎక్కి బోల్తా పడి చెట్టుకు ఢీకొంది. అటుగా వచ్చిన ఆటోవాలాలు, వాహనదారులు వారిని కారులో నుంచి బయటికి తీశారు. అప్పటికే లలితాబాయి తలకు బలమైన గాయమై మృతి చెందగా, ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెంటనే నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రభాకర్, లలితాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభాకర్ తల్లి మాలోత్ హేమాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన కారు. ఇన్‌సెట్‌లో మాలోత్ లలితాబాయి

దాడికి భూ వివాదమే మూలం

- మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- చెంచులకు అండగా ఉంటాం..
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత మహిళకు పరామర్శ



నిమ్స్‌లో బాధిత చెంచు మహిళను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

లక్డీకాపూల్ (హైదరాబాద్): నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి దాడి ఘటనకు భూ వివాదమే కారణమని తాము భావిస్తున్నట్లు మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చెంచుల పునరావాసం కోసం కేటాయించిన భూములపై కన్నేసిన కొందరు ఇలాంటి దాడులకు తెగబడుతున్నారన్నారు. బుధవారం మంత్రి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చెంచు మహిళ ఈశ్వరమ్మను పరమర్శించారు. బాధితురాలితో మాట్లాడి దాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి కేసు పురోగతిని తెలుసుకున్న మంత్రి.. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో భూములు అమ్ముకున్న భూ యాజమానులకు ధరణి తర్వాత తిరిగి పాస్ పుస్తకాలు రావడంతో చెంచులపై దాడులు చేస్తున్నారన్నారు. ఆ భూముల విలువ పెరగడంతో.. వాటిని లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షించేలా పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు బాధితురాలికి అండగా నిలిచారన్నారు. బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పిస్తామని చెప్పారు. బాధితురాలి మామయ్య నాగయ్య మృతిపై అనుమా నాలున్నందున ఆ కేసును పునఃవిచారణ చేయాల న్నారు. చెంచులకు అండగా ఉంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి తాత్కాలికంగా రూ.25 వేలు అందజేశామన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, నాగర్ కర్నూల్ ఐటీడీఓ రోహిత్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. మంత్రి సీతక్కతో పాటు ఈశ్వరమ్మను పరామర్శించిన వారిలో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య తదితరులున్నారు.

నాగన్న మృతదేహానికి పోస్టుమార్టం

- చెంచు మహిళ ఈశ్వరమ్మపై దాడి నేపథ్యంలో ఆమె మామ మరణంపై అనుమానాలు
- ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: చెంచు మహిళ ఈశ్వరమ్మపై దాడి నేపథ్యంలో ఈనెల 3న అనుమానాస్పదంగా మృతి చెందిన ఆమె చిన్నమామ నాగన్నను హత్య చేశారన్న అనుమానాలు వెల్లడవుతున్నాయి. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాగన్న మృతదేహానికి బుధవారం వైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలుకు తీసుకొని, ఆమె పైనే కొందరు పాశవికంగా దాడిచేసిన విషయం తెలిసిందే. ఆమెపై దాడి నేపథ్యంలో ఇటీవల అటవీప్రాంతంలో అనుమానాస్పదంగా చనిపోయిన ఆమె చిన్నమామ నాగన్నను హత్య చేసి ఉంటారన్న అనుమానాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. వీరి భూమిని కౌలుకు తీసుకున్న బండి వెంకటేశ్ ఆ భూమిని తక్కువ ధరకే కొనుగోలు చేసేందుకు యత్నించగా, నాగన్న అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఈనెల 3న గ్రామ శివారులోని రాయరాసులపెంట సమీపంలో అతను అనుమానాస్పద స్థితిలో మరణించారు. నాగన్న మృతదేహానికి పోస్టుమార్టం చేపట్టకుండానే ఖననం చేశారు. అయితే ఈనెల 18న కోడలు ఈశ్వరమ్మపై నిందితులు బండి వెంకటేశ్, అతని కుటుంబసభ్యులు దాడి చేశారు. ఈ ఘటన నేపథ్యంలో కొద్ది రోజుల ముందు మరణించిన నాగన్నను నిందితులు హత్య చేసి ఉంటారని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం నాగన్న మృతదేహానికి పోస్టుమార్టం చేపట్టారు. ఆర్డీఓ నాగరాజు, ఎమ్మార్వో శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ దశరథం, వైద్యుడు హన్మంతరావు ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక వివరాలు వెల్లడిస్తా మని ఎస్సై రుషికేశ్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తాం

హైకోర్టుకు వివరాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. హుజూరాబాద్‌లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయకుండా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న తనను అడ్డుకుంటున్నారని కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ...పిటిషనర్ (బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి) చెబుతున్నట్లు ఈ నెల 27 తర్వాత చెక్కులు చెల్లకుండాపోయే అవకాశమేదీ లేదని, ఆగస్టు వరకు చెల్లుబాటు ఉందని వెల్లడించారు. ఇప్పటికే 71 మంది లబ్ధిదారులకు చెందిన చెక్కులు బ్యాంకులకు పంపించామని..ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికి చెక్కులు అందజేస్తామని వివరించారు. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన జస్టిస్ సూరేపల్లి నందా..తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేశారు.

స్పీకర్‌గా బిర్లా

విపక్ష అభ్యర్థి సురేశ్‌పై విజయం

- మూజువాణి ఓటుతో ఎన్నిక
- మోదీ, రాహుల్ అభినందన
- సీటు దాకా తోడ్కొని వెళ్లిన వైనం
- విలువలకు పట్టం కడతా: బిర్లా
- సభలో తొలి రోజే వాయిదా పర్వం
- ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా తీర్మానం
- తీవ్రంగా తప్పబట్టిన విపక్షాలు
- పార్లమెంటు ఆవరణలో బీజేపీ నిరసన


స్పీకర్‌గా ఎన్నికైన బిర్లాను పోడియందాకా తోడ్కొని వచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మోదీ, రాహుల్ గాంధీ, కిరెణ్ రిజిజు

న్యూఢిల్లీ: అనూహ్యమేమీ జరగలేదు. అధికార ఎన్డీఏ పక్ష అభ్యర్థి ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. బుధవారం లోక్‌సభ సమావేశం కాగానే స్పీకర్ పదవికి బిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఏ పార్టీ కూడా ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. దాంతో మూజువాణి ఓటు ద్వారా విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై బిర్లా విజయం సాధించినట్టు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. స్పీకర్ ఎన్నికపై అధికార, విపక్ష కూటముల మధ్య నెలకొన్న రగడకు ఆ విధంగా తెర పడింది. అనంతరం మోదీ, విపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు 61 ఏళ్ల బిర్లాను స్పీకర్ స్థానం వరకు తోడ్కొని వెళ్లారు. పార్టీలకు అతీతంగా సభ్యులంతా చప్పట్లతో హర్షధ్వానాలు వెలిబుచ్చారు. అఖిలేశ్ యాదవ్ తదితర విపక్ష సభ్యులంతా ఈ సందర్భంగా బిర్లాను అభినందించారు. విధి నిర్వహణలో ఆయన నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని, ప్రజల గొంతుక వినిపించేందుకు విపక్షాలకు తగిన అవకాశాలిస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. బలరాం జాఖడ్ అనంతరం ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుని తిరిగి స్పీకర్‌గా ఎన్నికైన రికార్డును బిర్లా సొంతం చేసుకున్నారు. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293, ఇండియా కూటమికి 233 మంది సభ్యుల బలముంది. వయనాడ్ స్థానానికి రాహుల్ రాజీనామాతో సభలో ఒక ఖాళీ ఉంది.

మోదీ తొలి ప్రసంగం

బిర్లా ఎన్నిక అనంతరం 18వ లోక్‌సభలో మోదీ తొలి ప్రసంగం చేశారు. గత ఐదేళ్లలో సభ హుందాతనాన్ని పరిరక్షించడంలో స్పీకర్‌గా బిర్లా గొప్ప పరిణతి చూపారంటూ ప్రశంసించారు. పలు చరిత్రాత్మక నిర్ణయాలతో లోక్‌సభ చరిత్రలో స్వర్ణయుగానికి సారథ్యం వహించారంటూ కొనియాడారు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిన సందర్భాల్లోనూ ఆయన చక్కని సంతులనం పాటించారన్నారు. సభ నిర్వహణలో బిర్లా సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతారని విశ్వాసం వెలిబుచ్చారు. పార్లమెంటేరియన్‌గా ఆయన పనితీరును కొత్త సభ్యులంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

విపక్షాల అభినందనలు

రాహుల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా 18వ లోక్‌సభ చక్కగా పని చేస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈసారి సభలో విపక్షాల బలం పెరిగిందని గుర్తు చేశారు. వాటికి అందుకు తగ్గట్టుగా ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు వీలైనన్ని అవకాశాలు లభించాలన్నారు. ఈ సభలో సభ్యుల సస్పెన్షన్ల వంటి సభ హుందాతనాన్ని తగ్గించే చర్యలుండబోవని అఖిలేశ్ ఆశాభావం వెలిబుచ్చారు. సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ), టీఆర్ బాలు (డీఎంకే) తదితరులు మాట్లాడారు.

నేడు పార్లమెంటు సంయుక్త సమావేశం

గురువారం పార్లమెంటు సంయుక్త సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. మోదీ 3.0 నూతన సర్కారు ప్రాథమ్యాలను ఈ సందర్భంగా ఆమె పార్లమెంటు ముందుంచే అవకాశముంది. రాజ్యాంగంలోని 87వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ ఎన్నిక అనంతరం సమావేశాలు ప్రారంభమయ్యాక ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించాల్సి ఉంటుంది. ఇందుకోసం ముర్ము గురువారం ఉదయం రాష్ట్రపతి భవన్ నుంచి గుర్రపు బగ్గీలో సంప్రదాయ పద్ధతిలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకుంటారు. గజద్వారం వద్ద ప్రధానితో పాటు లోక్‌సభ, రాజ్యసభ ప్రిసైడింగ్ అధికారులు స్వాగతం పలుకుతారు. సంప్రదాయ సెంగోల్ చేబూని ముందు నడుస్తూ రాష్ట్రపతిని లోక్‌సభ చాంబర్లోకి తీసుకెళ్తారు.

అడ్డంకులు లేకుండా సాగాలి...

''నన్ను స్పీకర్‌గా ఎన్నుకున్నందుకు సభకు ధన్యవాదాలు. అధికార, విపక్ష సభ్యులు ఒక్కతాటిపై నడిస్తేనే సభ సాగుతుంది. ప్రతి ఒక్కరి గొంతుకనూ వినడమే భారత ప్రజాస్వామ్యపు మూల బలం. ఏకైక సభ్యుడున్న పార్టీకి కూడా సభలో కావాల్సినంత సమయం లభించాలి. మనల్ని ప్రజలు ఎన్నో ఆశలతో ఎన్నుకున్నారు. కనుక వారి సమస్యల పరిష్కారం కోసం సభ అడ్డంకుల్లేకుండా నడుస్తుందని ఆశిస్తున్నా. విమర్శలుండొచ్చు. కానీ సభను అడ్డుకోవడం సరి కాదు. సభ్యులపై చర్యలు తీసుకోవాలని నాకెప్పుడూ ఉండదు. కానీ ఉన్నత పార్లమెంటరీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కఠిన నిర్ణయాలు తప్పకపోవచ్చు''

- స్పీకర్‌గా ఎన్నికైన అనంతరం లోక్‌సభనుద్దేశించి ఓం బిర్లా

మోదీ రాహుల్ కరచాలనం

స్పీకర్‌గా ఎన్నికయ్యాక బిర్లాను పోడియం వద్దకు తీసుకెళ్లే సందర్భంలో లోక్‌సభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బిర్లాను అభినందించే క్రమంలో మోదీ, రాహుల్ కరచాలనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు నవ్వుతూ మాట్లాడుకోవడం సభ్యులందరినీ ఆకర్షించింది.



రాహుల్ నయా లుక్

స్పీకర్ ఎన్నిక సందర్భంగా రాహుల్ సరికొత్త వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఆయన తెలుపు రంగు లాల్చీ, పైజామా ధరించి లోక్‌సభకు వచ్చారు. ఆయన కొన్నేళ్లుగా టీ షర్టు, బ్యాగీ ప్యాంటే ధరిస్తున్నారు. భారత్ జోడో యాత్రల్లోనూ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ అదే వస్త్రధారణ కొనసాగించారు. సోమ, మంగళవారాల్లో లోక్‌సభకు వచ్చినప్పుడు, సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు కూడా టీ షర్టు, బ్యాగీ ప్యాంటులోనే కన్పించారు. రాహుల్ ప్రస్తుతం లోక్‌సభలో విపక్ష నేత కావడంతో అందుకు తగ్గట్టుగా లాల్చీ, పైజామాకు మారినట్టు భావిస్తున్నారు.

"స్పీకర్‌గా ఎన్నికైన మీకు విపక్షం తరఫున, 'ఇండియా' కూటమి తరఫున మీకు అభినందనలు. ఉభయ సభలు సజావుగా సవ్యంగా సాగాలని ఆశిస్తున్నాం. విశ్వాసంతోనే సహకారం సాధ్యమవుతుంది. ప్రజావాణి పార్లమెంట్‌లో ప్రతిధ్వనించాలి. ప్రభుత్వం వెంట అధికార బలం ఉండొచ్చేమోగానీ విపక్షాలు గతంతో పోలిస్తే మరింత గట్టిగా ప్రజావాణిని పార్లమెంట్‌లో వినిపించనున్నాయి. మమ్మల్ని మాట్లాడేందుకు మీరు అనుమతిస్తారని విశ్వసిస్తున్నాం. విపక్షసభ్యులు మాట్లాడితే ప్రజల గొంతు పార్లమెంట్‌లో మోగినట్లే. ఈ మేరకు మీరు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించండి"

"గత లోక్‌సభ సెషన్లు అత్యంత ఫలవంతమయ్యాయని ప్రభుత్వం ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉంది. విపక్షసభ్యులందరినీ సస్పెండ్ చేసి సభలో మౌనం రాజ్యమేలేలా చేయడం అప్రజాస్వామిక విధానం. సభ అత్యంత ప్రభావవంతంగా నడవడం కంటే ప్రజావాణి ఎంతగా సభలో వినిపించింది అనేదే ముఖ్యం"

- రాహుల్ గాంధీ

"ప్రజాస్వామ్య న్యాయానికి ఓం బిర్లాయే చీఫ్ జస్టిస్. మరెవరి ఆదేశాల ప్రకారమో కాకుండా ఆయన మార్గదర్శకత్వంలోనే సభ సజావుగా సాగాలని ఆశిస్తున్నా. విపక్ష లేకుండా ప్రతి రాజకీయ పక్షానికి సమానమైన అవకాశాలు కల్పించాలి. నిష్పక్షపాత వైఖరి ప్రదర్శించడం గొప్ప బాధ్యత. సస్పెన్షన్ వంటి సభ గౌరవానికి హాని కల్గించే చర్యలు పునరావృతంకాబోవని భావిస్తున్నా"

- అఖిలేశ్ యాదవ్

" సభలో విపక్షాలు బలం పుంజుకున్నాయి. దీంతో సభ కొత్తరూపు సంతరించుకుందిగానీ బీజేపీ వైఖరి మారలేదు. మెజారిటీ సభ్యులున్న పార్టీలకు ప్రాధాన్యత దక్కుతోంది. సభకు సారథి అయిన స్పీకర్ చిన్న పార్టీలనూ పట్టించుకోవాలి"

- అసదుద్దీన్

విపక్షనేతగా రాహుల్: స్పీకర్

న్యూఢిల్లీ: రాహుల్‌ను లోక్‌సభలో విపక్షనేతగా గుర్తిస్తున్నట్లు నూతన స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రతిపక్షాలకు 'విపక్షనేత' హోదా దక్కడం విశేషం. ఈ మేరకు జూన్ 9వ తేదీ నుంచే రాహుల్‌ను విపక్షనేతగా పరిగణిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ బుధవారం ఒక నోటిఫికేషన్ జారీచేసింది. పార్లమెంట్ చట్టం1977లోని రెండో సెక్షన్ ప్రకారం రాహుల్‌ను విపక్షనేతగా ప్రకటించింది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. పార్టీ చీఫ్ ఖర్గే, పార్టీ కార్యకర్తలు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడిగా ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్‌లో వినిపిద్దామని పిలుపునిచ్చారు. 16వ, 17వ లోక్‌సభలో విపక్షపార్టీలకు కనీసం 10 శాతం సభ్యులబలం లేనికారణంగా ఏ పార్టీకీ విపక్షహోదా దక్కలేదు. విపక్షనేతగా ఎన్నికవడం ద్వారా రాహుల్ తన పాతికేళ్ల రాజకీయజీవితంలో తొలిసారిగా రాజ్యాంగబద్ధ పదవిని స్వీకరించారు. కేబినెట్ మంత్రి హోదాతో సమానమైన విపక్షనేత హోదాలో రాహుల్‌కు ఒక ప్రైవేట్ కార్యదర్శి, ఇద్దరు అదనపు ప్రైవేట్ కార్యదర్శులు, ఇద్దరు వ్యక్తిగత సహాయకులు, ఇక హిందీ స్టెనో, ఒక క్లర్క్, ఒక శానిటేషన్ వర్కర్, నలుగురు ప్యూన్లను కేంద్రం సమకూరుస్తుంది. 1954చట్టం 8వ సెక్షన్, 1977 చట్టాల ప్రకారం జీతభత్యాలు చెల్లిస్తుంది. లోక్‌పాల్, సీఈసీ, ఈసీ, సీబీఐ డైరెక్టర్, సీవీసీ, సీఐసీ, ఎన్‌హెచ్ఆర్‌సీల నియామక ప్యానెళ్లలో ఇకపై రాహుల్ సభ్యునిగా ఉండనున్నారు.రాహుల్ తొలిసారిగా 2004లో అమేథీలో విజయంతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు.

కాక రేపిన ఎమర్జెన్సీ తీర్మానం

న్యూఢిల్లీ: స్పీకర్‌గా బాధ్యతలు చేపడుతూనే బుధవారం బిర్లా తీసుకున్న తొట్ట తొలి నిర్ణయమే లోక్‌సభలో కాక రేపింది. విపక్షాల నుంచి, ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి తీవ్ర నిరసనలకు, వ్యతిరేకతకు దారి తీసింది. 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడాన్ని ఖండిస్తూ స్పీకర్ సభలో స్వయంగా తీర్మానం ప్రవేశపెట్టారు! ''భారత్ ఎప్పుడూ ప్రజాస్వామిక విలువలకు పెద్దపీట వేసింది. అలాంటి దేశంలో ఇందిర 50 ఏళ్ల క్రితం ఇదే రోజున ఎమర్జెన్సీ విధించారు. ప్రజాస్వామిక విలువలపై, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపారు. విపక్ష నేతలను జైళ్లలో కుక్కారు. రాజ్యాంగంపై నేరుగా దాడి చేశారు. ఎమర్జెన్సీ విధించిన 1975 జూన్ 26 దేశ చరిత్రలో ఎన్నటికీ చెరగని మచ్చగా మిగిలిపోతుంది'' అంటూ తీర్మానాన్ని చదవి విన్పించారు. ఇందిర తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. ''ఎమర్జెన్సీ కాలంలో ప్రజలపై ఇందిర సర్కారు చెప్పలేనన్ని అకృత్యాలకు పాల్పడింది. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఎమర్జెన్సీ బాధితులందరికీ 18వ లోక్‌సభ సంతాపం తెలుపుతోంది. ఎమర్జెన్సీ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోంది'' అన్నారు. ఎమర్జెన్సీకి నిరసనగా నిమిషం పాటు మౌనం పాటించాలని సభ్యులను కోరారు. ఎన్డీఏ సభ్యులంతా నిలబడి మౌనం పాటించగా విపక్షాలన్నీ స్పీకర్ తీరును తీవ్రంగా ఖండించాయి. ఎమర్జెన్సీ ప్రస్తావనను నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దాంతో స్పీకర్‌గా తొలి రోజే సభను బిర్లా వాయిదా వేయాల్సి వచ్చింది. అనంతరం విపక్షాల నిరసనలకు ప్రతిగా బీజేపీ సభ్యులంతా పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శనకు దిగారు. ఎమర్జెన్సీ విధింపుపై కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.


స్పీకర్ తీరు ప్రశంసనీయం: మోదీ

ఎమర్జెన్సీని స్పీకర్ గట్టిగా ఖండించడం హర్షణీయమని మోదీ అన్నారు. ''ఇందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఎమర్జెన్సీ వేళ జరిగిన అకృత్యాలను స్పీకర్ తన తీర్మానంలో ఎత్తి చూపారు. రాజ్యాంగాన్ని తోసిరాజంటే, ప్రజాభిప్రాయాన్ని అణగదొక్కితే, వ్యవస్థలను నాశనం చేస్తే ఏమవుతుందో చెప్పేందుకు ఇందిర తీసుకున్న ఆ తప్పుడు నిర్ణయం ఒక చక్కని ఉదాహరణ'' అని ఎక్స్‌లో ప్రధాని పేర్కొన్నారు.

కుల గణన చేపట్టండి

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. 2021 నుంచి వాయిదాపడుతున్న జన గణనను వెంటనే చేపట్టాలని, ఇందులో భాగంగా కుల గణన కూడా చేయాలని తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో కోరారు. 'భారత్‌లోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, విద్య, ఉద్యోగాలు, ఆర్థికంగా సమాన అవకాశాలు అందాలంటే కుల గణన తప్పనిసరి అని శాసనసభ భావిస్తోంది' అని తీర్మానంలో పేర్కొన్నారు.


కాన్‌బెర్రా ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగుతూ అభివాదం చేస్తున్న అసాంజ్

అసాంజ్‌కు విముక్తి

- విడుదల చేసిన అమెరికా కోర్టు
- ఆస్ట్రేలియా చేరుకున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు
- స్వాగతించిన ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

సైపన్/కాన్‌బెర్రా: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్‌కు పూర్తి విముక్తి దొరికింది. అమెరికా పసిఫిక్ ద్వీప భూభాగంలో ఉత్తర మరియానా దీవుల రాజధాని సైపన్‌లోని ఫెడరల్ కోర్టు అసాంజ్‌ను బుధవారం విడుదల చేసింది. అంతకుముందు మూడు గంటలపాటు విచారణ సాగింది. గూఢచర్య చట్టానికి విరుద్ధంగా అమెరికా జాతీయ రక్షణ పత్రాలను పొందడం, వాటిని బయట పెట్టడం వంటి నేరాలను అసాంజ్ అంగీకరించారు. అయితే, ''రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛపై నాకు నమ్మకముంది. అందులో భాగంగానే ఓ జర్నలిస్టుగా రహస్య పత్రాలను సేకరించి బయట పెట్టా. అమెరికా రాజ్యాంగానికి చేసిన తొలి సవరణ ప్రకారం నా చర్యలకు రక్షణ ఉంది'' అని చెప్పుకొచ్చారు. ఆయన నేరాంగీకార వాంగ్మూలాన్ని అనుమతిస్తున్నట్టు చీఫ్ యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి రమొనా వి.మంగ్లోనా ప్రకటించారు. అసాంజ్‌కు ఐదేళ్ల రెండు నెలల శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఇప్పటికే బ్రిటిష్ జైల్లో ఐదేళ్ల శిక్ష అనుభవించిన కారణంగా ఆయన్ను విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ''మీరు ఈ న్యాయస్థానం నుంచి స్వేచ్ఛా వ్యక్తిగా బయటకు వెళ్లవచ్చు'' అని ప్రకటించారు. అనంతరం అసాంజ్ కోర్టు నుంచి బయటికొచ్చారు. ఈ పరిణామం పట్ల ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

మీడియా ఎదురుచూపులు

విచారణను కవర్ చేయడానికి ప్రపంచవ్యాప్త మీడియా సైపన్‌లోని కోర్టు దగ్గరికి చేరుకుంది. గంటలపాటు బయట వేచి చూసినా విచారణను చిత్రీకరించేందుకు మీడియాను కోర్టు హాల్లోకి అనుమతించలేదు. అసాంజ్ కోర్టు హాలు నుంచి బయటకు వస్తున్న ఫొటోను ఆయన భార్య స్టెల్లా ఎక్స్‌లో పోస్టు చేశారు. 'భావోద్వేగంతో కంటతడి పెట్టకుండా ఉండలేకపోతున్నా' అన్నారు. అసాంజ్ విడుదల స్వాగతించదగ్గ పరిణామమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అన్నారు. అసాంజ్ విడుదలకు ఆస్ట్రేలియా సకల ప్రయత్నాలు చేసిందన్నారు. ఇది చరిత్రాత్మకమైన రోజని అసాంజ్ న్యాయవాది జెన్నిఫర్ రాబిన్సన్ అన్నారు. ఆయన విడుదలకు సాయం చేసినందుకు అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వందేళ్లలో అమెరికా ఎవరిపైనా గూఢచర్య చట్టం ప్రయోగించలేదని, జర్నలిస్టు అయిన అసాంజ్‌పైనే మోపిందని ఆయన తరఫున వాదించిన మరో న్యాయవాది బారీ పొలాక్ తన క్లయింట్ అన్యాయానికి గురయ్యారన్నారు.

శుభాకాంక్షలు చెప్పిన న్యాయమూర్తి

విచారణ సందర్భంగా అసాంజ్‌కు న్యాయమూర్తి రమోనా ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం విశేషం. ''వచ్చే వారం మీ పుట్టిన రోజని తెలిసింది. మీరు కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారని ఆశిస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు. జూలై 3న అసాంజ్ 54వ ఏట అడుగుపెట్టనున్నారు.

భార్యను, తండ్రిని హత్తుకుని..

ఆస్ట్రేలియా రాయబారులతో కలిసి అసాంజ్ ప్రైవేట్ విమానంలో సైపన్ దీవుల నుంచి బయల్దేరి బుధవారం రాత్రి ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రా చేరుకున్నారు. కుడిచేయి పైకెత్తి పిడికిలి బిగించి విమానం నుంచి బయటికొస్తున్న ఆయన్ను చూసి మద్దతుదారులంతా పెద్దగా నినాదాలు చేశారు. విమానాశ్రయంలో తనకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న భార్య స్టెల్లా, తండ్రి జాన్ షిప్టన్‌లను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. వారు అసాంజ్‌ను హత్తుకుని కన్నీటిపర్యంతమయ్యారు.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అదుపులోకి తీసుకున్న సీబీఐ


కేజ్రీవాల్‌ను తీసుకెళ్తున్న అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయి తీహార్ సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ బుధవారం అదుపులోకి తీసుకుంది. సీబీఐ అధికారులు తొలుత ఆయనను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట ప్రవేశపెట్టారు. మద్యం కుంభకోణం కేసులో అవినీతి వ్యవహారాలపై విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను ఐదు రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ విజ్ఞాపన సమర్పించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తన వాదనను కోర్టుకు తెలియజేశారు. మద్యం కుంభకోణంతో తనకు సంబంధం లేదని, తాను అమాయకుడినని పేర్కొన్నారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ కేసుతో సంబంధం లేదని, ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్‌కు సిసోడియాను బాధ్యుడిని చేస్తూ తాను సీబీఐకి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని, అందులో ఎంతమాత్రం నిజం లేదని అన్నారు. సిసోడియాకు గానీ, ఇతరులను గానీ వ్యతిరేకంగా తాను సేట్‌మెంట్ ఇవ్వలేదన్నారు.

అరెస్టు ఇప్పుడే ఎందుకంటే..

తాము నిజాలు మాత్రమే బహిర్గతం చేస్తున్నామని, మీడియాకు ఎలాంటి లీకులు ఇవ్వడం లేదని సీబీఐ తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. మద్యం కుంభకోణం వెనుక పెద్ద కుట్ర ఉందని, పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని, ఈ కేసులో కేజ్రీవాల్‌ను ప్రశ్నించి మరిన్ని నిజాలు రాబట్టాల్సి ఉందని తమ విజ్ఞాపనలో సీబీఐ పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఇప్పుడే అరెస్టు చేయాలని ఎందుకు భావిస్తున్నారని న్యాయమూర్తి ప్రశ్నించగా, ఇన్నాళ్లూ సార్వత్రిక ఎన్నికలు జరగడంతో వేచి చూశామని, ఎన్నికలు ముగియడంతో అరెస్టు చేసి, విచారణ కొనసాగించాలని నిర్ణయించినట్లు సీబీఐ తరఫు న్యాయవాది బదులిచ్చారు. నూతన మద్యం విధానంలో భాగంగా ఢిల్లీలో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించాలని అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సిఫార్సు చేసినట్లు కేజ్రీవాల్ సేట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. అయితే, ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. అనంతరం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి, మూడు రోజులపాటు కస్టడీలో ఉంచి విచారించేందుకు సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి అమితాబ్ రావత్ అనుమతి ఇచ్చారు.

బయటకు రాకుండా కుట్రలు: సునీతా


తన భర్త అరవింద్ కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రానివ్వకుండా మొత్తం వ్యవస్థ కుట్రలు సాగిస్తోందని ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ మండిపడ్డారు. దేశంలో చట్టం అమల్లో లేదని, కేవలం నియంతృత్వం రాజ్యమేలుతోందని ఆరోపించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

రెగ్యులర్ బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ బుధవారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో మరో పిటిషన్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

ఆస్పత్రిలో అడ్వాణీ

వృద్ధాప్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిక



న్యూఢిల్లీ: బీజేపీ కురు వృద్ధుడు, మాజీ ఉప ప్రధాని అడ్వాణీ బుధవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య నిపుణులు సమీక్షిస్తున్నారు. 96 ఏళ్ల అడ్వాణీ వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. బీజేపీని దేశవ్యాప్తంగా విస్తరించడంలో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు అడ్వాణీది కీలక పాత్ర. దాదాపు నాలుగు దశాబ్దాల ఆయన రాజకీయ జీవితంలో రథయాత్ర కీలక మలుపు. ఆ యాత్ర ద్వారా బీజేపీకి దేశవ్యాప్తంగా ఊపు తీసుకొచ్చారు. 1999–2004 మధ్య ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా చేశారు. బీజేపీ అధ్యక్షునిగా కూడా పని చేశారు. పదేళ్లుగా అడ్వాణీ పూర్తి విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఈ ఏడాదే ఆయన భారతరత్న అందుకున్నారు. వయో భారం దృష్ట్యా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన నివాసానికి వెళ్లి ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో పురస్కారాన్ని అందజేయడం తెలిసిందే.

తుమ్మితే పేగులు బయటికొచ్చాయి!

సురక్షితంగా లోపల పెట్టేసిన వైద్యులు ● అమెరికాలో అరుదైన ఘటన

వాషింగ్టన్: ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మూత్రకోశం ఆపరేషన్ చేయించుకున్న 63 ఏళ్ల రోగి అనూహ్యమైన మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితులను ఎదుర్కొన్నారు. గట్టిగా తుమ్మి, దగ్గడంతో పేగులు బయటికొచ్చాయి. దీంతో ఆయనను అత్యవసరంగా ఆస్పత్రిలో చేర్పించి ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకుండా కాపాడారు. ఫ్లోరిడావాసికి జరిగిన ఈ విచిత్ర ఘటన వివరాలు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ మెడికల్ కేస్ రిపోర్ట్స్'లో ప్రచురితమయ్యాయి. యూరినరీ బ్లాడర్ ఆపరేషన్ తర్వాత కోలుకున్న ఆ వ్యక్తికి ఇటీవల ఆస్పత్రికి వెళ్లారు. ఆపరేషన్ సమయంలో పై నుంచి వేసిన కుట్లను విప్పేశారు. ఆపరేషన్, కుట్లు విప్పడం అంతా సవ్యంగా జరగడంతో చిన్న పార్టీ చేసుకుందామనుకుని ఆ దంపతులు తర్వాతి రోజు ఉదయాన్నే దగ్గర్లోని రెస్టారెంట్‌కు వెళ్లి అల్పాహారం తినేందుకు కూర్చున్నారు. ఆ సమయంలో ఆ వ్యక్తి బిగ్గరగా తుమ్మడంతోపాటు దగ్గారు. దీంతో ఆపరేషన్ కోసం గతంలో కోత పెట్టిన ప్రాంతం నుంచి పేగుల్లో కొంతభాగం బయటికొచ్చింది. హతాశుడైన వ్యక్తి వెంటనే ధైర్యం తెచ్చుకుని సొంతంగా డ్రైవింగ్ చేస్తూ ఆస్పత్రికి వెళ్దామనుకున్నాడు. భార్య వద్దని వారించడంతో అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లారు. పరిస్థితి చూసి అవాక్కవడం వైద్యుల వంతయింది. ముగ్గురు నిష్ణాతులైన యూరాలజీ సర్జన్లు జాగ్రత్తగా వాటిని మళ్లీ యథాస్థానంలోకి వెనక్కి నెట్టారు. ఇలాంటి ఘటన జరగడం మాకు తెలిసి ఇదే తొలిసారి అని అక్కడి వైద్యులు వ్యాఖ్యానించారు.

నేడే బైడెన్, ట్రంప్ బిగ్ డిబేట్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలో నిలిచిన రాజకీయ ప్రత్యర్థులు జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్ష చర్చా కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఇరువురు నేతలు గురువారం జరిగే ముఖాముఖి డిబేట్‌లో పాల్గొంటారు. బైడెన్, ట్రంప్ గత ఎన్నికల్లో పరస్పరం పోటీపడిన సంగతి తెలిసిందే. ఈసారి వారిద్దరూ మళ్లీ పోటీ చేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల ముందు అభ్యర్థుల మధ్య ఆనవాయితీగా జరిగే డిబేట్ గురువారం జరగనుంది.

ముగ్గురు ఉగ్రవాదుల కాల్చివేత

భదెర్వాహ్/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం భారత భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మొహమ్మద్ (జేఈఎం)కు చెందిన వారుగా భావిస్తున్నారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు గాయపడ్డారు. ఈనెల 11న పోలీసులపై రెండు దాడులు జరిగాక సైన్యం, సీఆర్‌పీఎఫ్, పోలీసులు కలిసి సంయుక్తంగా గాలింపు చేపట్టారు. దోడా జిల్లాలో సినూ పంచాయతీ పరిధిలోని ఒక గ్రామంలో గాలింపు జరుపుతుండగా బుధవారం 10 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులు ఎడతెరిపి లేకుండా కాల్పులు జరిపారు. దాదాపు ఆరుగంటల పాటు జరిగిన ఎన్‌కౌంటర్లో ముగ్గురు ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

రోడ్డు బాగాలేకపోతే టోల్ వసూలు చేయొద్దు

కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి గడ్కరీ ఆదేశం

న్యూఢిల్లీ: రహదారి సరిగ్గా లేకపోతే వాహనదారుల నుంచి టోల్ రుసుము వసూలు చేయొద్దని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ రహదారుల నిర్వహణ సంస్థలను ఆదేశించారు. శాటిలైట్ ఆధారిత టోల్ రుసుముల వసూలుపై బుధవారం ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించలేనప్పుడు టోల్ చార్జి వసూలు చేయొద్దని అన్నారు. గుంతలు, బురదతో నిండిన రోడ్లపై కూడా టోల్ వసూలు చేస్తే జనం నుంచి వ్యతిరేకత వస్తుందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5,000 కిలోమీటర్ల మేర రహదారులపై ఉపగ్రహ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా పిట్రోడా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌కు చైర్మన్‌గా శామ్ పిట్రోడా పునర్నియామకమయ్యారు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం కావడం, వర్ణ వివక్ష వ్యాఖ్యలుగా మోదీతో సహా బీజేపీ దాడికి దిగడంతో ఆయన మే 8న రాజీనామా చేశారు. రాహుల్ గాంధీకి సన్నిహితుడైన పిట్రోడాను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం మళ్లీ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమించారు.

గోల్డీ బ్రార్‌పై రూ. 10 లక్షల రివార్డు

న్యూఢిల్లీ: కెనడాలో నివసిస్తున్న ఉగ్రవాది గోల్డీ బ్రార్ ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నగదు రివార్డును అందిస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బుధవారం ప్రకటించింది. బెదిరించి డబ్బులు గుంజేందుకు చండీగఢ్‌లోని ఒక వ్యాపారవేత్త నివాసం వద్ద ఈ ఏడాది మార్చి 8న సత్వీందర్ సింగ్ (అలియాస్ సతిందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్), అతని అనుచరుడు గుర్‌ప్రీత్ సింగ్ (అలియాస్ గోల్డీ ధిల్లాన్ అలియాస్ గోల్డీ రాజ్‌పురా)లు కాల్పులకు తెగబడ్డ సంగతి తెలిసిందే.

కాలేజీలో హిజాబ్‌పై నిషేధం సబబే

ముంబై హైకోర్టు తీర్పు

ముంబై: హిజాబ్, బుర్కా, నకాబ్‌లపై నిషేధం విధిస్తూ నగరానికి చెందిన ఒక కాలేజీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి ముంబై హైకోర్టు నిరాకరించింది. ఈ నిబంధనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులకు భంగకరం కాదని అభిప్రాయపడింది. విద్యా సంస్థ పాలనలో క్రమశిక్షణ నెలకొల్పడం కొరకే డ్రెస్ కోడ్ పెడతారని, ఇది కాలేజీ ప్రాథమిక హక్కని జస్టిస్ ఏ.ఎస్.చందూర్కర్, జస్టిస్ రాజేష్ పాటిల్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం పేర్కొంది. మతం, కులంతో సంబంధం లేకుండా డ్రెస్ కోడ్ అందరికీ వర్తిస్తుందని తెలిపింది. హిజాబ్ నిషేధాన్ని సవాల్ చేస్తూ తొమ్మిది మంది విద్యార్థినులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. చెంబూర్ ట్రోంబే ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే ఎన్.జీ.ఆచార్య, డి.కె.మరాఠే కాలేజీల్లో ఇటీవల డ్రెస్ కోడ్‌ను తీసుకొచ్చారు. కాలేజీ ఆవరణలో హిజాబ్, నకాబ్, బుర్కా, దుపట్టాలు, టోపీలు, బ్యాడ్జీలు ధరించడాన్ని నిషేధించారు.



ఈ నగరానికి ఏమైంది?

నగరంలో కొన్నిరోజులుగా తుపాకులు పేలుతున్నాయి. కత్తులు స్వైరవిహారం చేస్తున్నాయి. స్నాచింగ్‌లు పెరిగిపోతున్నాయి. హత్యలు, స్నాచింగ్స్, హత్యా యత్నాలు పెచ్చుమీరాయి. -10లో



మహిళాశక్తి క్యాంటీన్లు

మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. మహిళలను లక్షాధికారులుగా చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/24.0

నగరంలో రానున్న 24 గంటల్లో తేలికపాటి వర్షం పడవచ్చు. గరిష్టంగా 33, కనిష్టంగా 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

కొత్త బాసులొచ్చారు..





ఆమ్రపాలి, రంగనాథ్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ (ఎఫ్ఏసీ)గా ఆమ్రపాలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్‌రాస్ నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు ఆమ్రపాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. బుద్ధ భవన్ కార్యాలయంలో ఈవీడీఎం కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ బాధ్యతలు స్వీకరించారు.



అశోక్ రెడ్డి సైతం..

అలాగే.. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన సుదర్శన్ రెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. నూతన ఎండీకి జలమండలి అధికారులు స్వాగతం పలికారు.

దశాబ్ది ఉత్సవాలుగా గోల్కొండ బోనాలు

మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి గోల్కొండ కోట బోనాలను దశాబ్ది ఉత్సవాలుగా భారీ ఎత్తున నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో గోల్కొండ కోటలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. గోల్కొండ కోట శ్రీ జగదాంబిక అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రుల బృందం పట్టు వస్త్రాలు సమర్పిస్తుందని తెలిపారు. పట్టువస్త్రాల ఊరేగింపును లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి గోల్కొండ కోట వరకు కళాబృందాలతో నిర్వహిస్తామన్నారు. బోనాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు సహాయ సహకారాలు అందిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, జలమండలి జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, బల్దియా డీఎంసీ శశిరేఖ, డీఎంఓహెచ్ వెంకట్, ట్రాఫిక్ ఈసీటీ వెంకటేశ్వర్లు, గోల్కొండ తహసీల్దార్ అహల్యారెడ్డి పాల్గొన్నారు.

అడుగంటిన ఆశలు!

డెడ్‌స్టోరేజీకి చేరుకున్న జలాశయాలు


సుదీర్ఘ కాలం తర్వాత అత్యవసర పంపింగ్

- వర్షా కాలం ప్రారంభమైనా.. పెరగని నీటిమట్టం
- నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల పరిస్థితి ఇదీ

డెడ్ స్టోరేజీకి చేరిన నాగార్జున సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అత్యవసర పంపింగ్

ప్రస్తుతం జలాశయాల్లో నీటి మట్టం ఇలా (అడుగుల్లో)

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నీటిమట్టం	ప్రస్తుతం	గతేడాది
నాగార్జున సాగర్	590.000	504.500	520.000
శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు	485.560	456.682	474.990
ఉస్మాన్ సాగర్	1790.000	1780.250	17.84.750
హిమాయత్ సాగర్	1763.500	1756.350	1759.800
సింగూరు	523.600	519.533	520.795
మంజీరా	1651.750	1646.900	1643.000



నాగార్జున సాగర్



ఎల్లంపల్లి ప్రాజెక్టు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగు నీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాల్లో నీరు డెడ్‌స్టోరేజీకి చేరాయి. వర్షాకాలం ప్రారంభమైనా.. నీటిమట్టం పెరగడంలేదు. గతేడాది కృష్ణా, గోదావరి బేసిన్‌లో వరద నీరు చేరకపోవడంతో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. సుదీర్ఘ కాలం తర్వాత రెండు జలాశయాల్లో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి డెడ్ స్టోరేజీ నీటిని పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. నగరం ఎత్తైన ప్రదేశంతో పాటు రాళ్లు, కొండలతో నిండి ఉండటంతో భూగర్భ జలాలపై ఆధారపడకుండా వంద కిలోమీటర్ల దూరంలోని నాగర్జున సాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణా జలాలు, సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను తరలిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి సుమారు 75 శాతం వరకు నీటి తరలింపు ఉంటుంది. మరోవైపు జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తో పాటు సింగూర్, మంజీరా జలాశయాల నుంచి సైతం నీటి తరలింపు కొనసాగుతోంది.

ఏడేళ్ల తర్వాత...

ఏడేళ్ల తర్వాత నాగార్జున సాగర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా కృష్ణా తాగు నీటి సరఫరా పథకం ఫేజ్ - 1, 2, 3 కింద రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. గత నెలలోనే సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా నీటి తరలింపు నిలిచిపోయింది. కొద్ది రోజులు రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిని కొద్ది రోజులు నగరానికి సరఫరా చేశారు. ఆ తర్వాత పుట్టంగండిలో అత్యవసర పంపింగ్ కోసం జీరో పాయింట్ వద్ద పది మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడి సరఫరా చేపట్టారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ..

- గోదావరి బేసిన్ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎనిమిదేళ్ల విరామం తర్వాత అత్యవసర పంపింగ్ ప్రక్రియను చేపట్టారు. మొత్తం 20 మోటార్లు ఏర్పాటు చేయగా మొదటి విడతగా ఏడు పంపుల ద్వారా నీరు ఎత్తిపోత ప్రక్రియ కొనసాగుతోంది. అవసరాన్ని, నీటి లభ్యతను బట్టి మిగిలిన పంపులను కూడా దశల వారీగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలిస్తున్నారు.
- వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ఎగువనున్న కడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి వరద లేదు. ఔట్ ఫ్లో 745 ఎంజీడీలు కొనసాగుతోంది. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. నీటి సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.10 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులో 4 టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు ఉన్నాయి. 3.31 టీఎంసీల వరకు లభ్యత ఉటుంది. ఈ ప్రాజెక్టు నీటిని నగరంలోని కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే.. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు గోదావరి జలాల ద్వారానే నీరు అందిస్తున్నారు.

సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 504.50 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 312.00 టీఎంసీలకు ప్రస్తుతం 125.97 టీఎంసీలకు పరిమితమైంది. జలాశయానికి ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్ ఫ్లో 800 క్యూసెక్కులు కొనసాగుతోంది. 2017లో ప్రాజెక్టు నీటి మట్టం పడిపోతే 500 అడుగులకు చేరే వరకు నీటిని డ్రా చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి ఎమర్జెన్సీ పంపింగ్‌లో అవసరమైతే.. రెండో దశ పంపింగ్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు జలమండలి ప్రకటించింది.

మాన్సూన్ టీమ్స్ రెడీ

- వర్షాకాలం సమస్యల పరిష్కారం కోసం..
- చెరువులు, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం

మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్..

ఒక్కో టీమ్‌లో వాహనం, నలుగురు కార్మికులు, నీటిని పారదోలేందుకు పరికరాలు ఉంటాయి. షిఫ్టుల వారీగా టీమ్స్ పని చేస్తాయి. ఈసారి 154 టీమ్స్ అందుబాటులో ఉంటాయి.

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో నిల్వ నీటితో రోడ్లు చెరువులవుతున్నాయి. కాలనీలు నీట మునుగుతున్నాయి. ఇలా నీటినిల్వల ప్రాంతాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఈ సంవత్సరం కూడా వివిధ ప్రాంతాల్లో వివిధ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఆయా టీంల వివరాలు ఇలా ఉన్నాయి.

స్టాటిక్ లేబర్ టీమ్స్..

- ఒక్కో టీమ్‌లో నీరు అధికంగా నిలిచిపోయి రోడ్లు చెరువులుగా మారే ప్రాంతాల్లో, క్యాచ్‌పిట్ల వద్ద ఒకరు లేదా ఇద్దరు కార్మికులు ఉంటారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు నీటిని తోడి పోస్తారు. ఇలాంటి టీమ్స్ 238 రంగంలో ఉంటాయి. ఈ రెండు టీమ్‌ల ఖర్చు అంచనా వ్యయం రూ.41.47 కోట్లు.
- వీటితో పాటు సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్ఎంపీ)కింద ప్రధాన రహదారుల మార్గాలను నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీల ఆధ్వర్యంలో మరో 29 మొబైల్ ఎమర్జెన్సీ బృందాలు పని చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఇంకా.. నాలాల వెంబడి పరిస్థితులకనుగుణంగా పనులు చేసేందుకు 203 మంది నోడల్ ఆఫీసర్లు నాలా ఇన్‌చార్జి ఆఫీసర్లుగా, వర్షాలతో చెరువులు పొంగిపొర్లే సమయాల్లో తగిన చర్యలు తీసుకునేందుకు 25 మందిని లేక్స్ నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపింది. వీటితో పాటు సమస్యాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఈవీడీఎం డీఆర్ఎఫ్ టీమ్స్ పని చేస్తాయి.



భూమ్.. బూమ్!



మార్కెట్ విలువ 20 నుంచి 40 శాతం పెరిగే అవకాశం

ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ విలువకు మధ్య భారీ వ్యత్యాసం

- వ్యవసాయ, వ్యవసాయేతర స్థలాల మార్కెట్ విలువ సవరింపునకు కసరత్తు
- ప్రధాన రహదారులు, మున్సిపాలిటీల్లో 40 శాతం పెరిగే అవకాశం
- ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మణికొండలో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం గజం స్థలానికి రూ.18 వేలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.1.50 లక్షలకుపైగా పలుకుతోంది. కోకాపేట్, నార్సింగిలో ప్రభుత్వ మార్కెట్ విలువ గజానికి రూ.12 వేలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.1.50 లక్షలకు పైమాటే. శేరిలింగంపల్లిలో గజం రూ.32,500 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.2.50 లక్షలు పలుకుతోంది. హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, చిలుకూరులో ఎకరం భూమి మార్కెట్ వాల్యూ రూ. 52.50 లక్షలు ఉండగా.. అదే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ.6 నుంచి రూ.10 కోట్లు పలుకుతోంది. శంషాబాద్‌లో ప్రభుత్వ మార్కెట్ విలువ ఎకరానికి రూ.1,22,500 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.10 కోట్లపై మాటే. యాచారం పట్టణంలో ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ వాల్యూ ఎకరానికి రూ.24 లక్షలు ఉండగా, శివారు ప్రాంతాల్లో రూ.10.50 లక్షలు ఉంది. ఇలా.. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువతో పోలిస్తే.. బహిరంగ మార్కెట్‌లో భూముల విలువల మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. వీటిని సవరించడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చవచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ శాఖలు నిర్ణయించాయి. ఈ మేరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల కేంద్రాలు, ఐటీ అనుబంధ పారిశ్రామిక వాడల వారీగా భూముల లెక్కలను తీసే పనిలో నిమగ్నమయ్యాయి. ఆయా ప్రాంతాలను బట్టి భూ మార్కెట్ విలువ 20 నుంచి 40 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మున్సిపాలిటీలు, పారిశ్రామిక వాడలు..

- ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునేందుకు భూముల మార్కెట్/రిజిస్ట్రేషన్ల విలువలను సవరించాలని సర్కార్ నిర్ణయించింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ల ఫీజులు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్‌లోని ధరలకు మధ్య వ్యత్యాసాన్ని పరిశీలించి ఓ నివేదిక సిద్ధం చేయాల్సిందిగా ఇప్పటికే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే ఓ నివేదికను తయారు చేసినట్లు తెలిసింది. మార్కెట్ విలువలను సవరించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరడంతో పాటు కొనుగోలుదారులపై రిజిస్ట్రేషన్ చార్జీల భారం మరింత పడనుంది.
- ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి, కొత్తూరు, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయాంజాల్, తుక్కుగూడ, ఆమన్‌గల్, శంషాబాద్, షాద్‌నగర్ మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లలో భూముల విలువలు భారీగా పెరిగే అవకాశం ఉంది. జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రామాల్లోనూ భూముల మార్కెట్ విలువ పెరగనుంది.

ఆగస్టు 1 నుంచి అమల్లోకి..

- ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈ నెల 18న క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్‌లోని ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసంపై అధ్యయనం చేసి మార్కెట్ విలువ సవరణపై ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 2021 నాటి సవరణ అనంతరం అమలులో ఉన్న రిజిస్ట్రేషన్, బహిరంగ మార్కెట్ విలువలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన సవరణ ప్రతిపాదనలు మొదటి దశలో సబ్ రిజిస్ట్రార్ల నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు, వారి పరిశీలన అనంతరం డీఐజీ కార్యాలయాలకు చేరాయి. ఈ నెల 29న కమిటీ ఆమోదం తెలపనుంది. సవరించిన ధరలను జులై 1 నుంచి 15 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు.
- జులై 20న స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించనున్నారు. 24న మార్కెట్ విలువను రివిజన్ కమిటీ ఆమోదం తెలపనుంది. సవరించిన ధరలను జులై 31న కంప్యూటర్‌లో నమోదు చేయనున్నారు. ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువ అమల్లోకి రానుంది. యాచారంలో ప్రస్తుతం ఎకరం భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.75 వేలు ఖర్చు అవుతుండగా, మార్కెట్ విలువ సవరణ ద్వారా ఈ చార్జీలు రూ.లక్ష దాటే అవకాశముంది. శేరిలింగంపల్లి, మణికొండ, నార్సింగి, కోకాపేట్, రాజేంద్రనగర్, బుద్వేల్, శంషాబాద్ నివాస భవనాల్లో చ.అ. విస్తీర్ణం ధర రూ.2 వేల నుంచి 4 వేలు పెరిగే అవకాశం లేకపోలేదు.

ఎయిర్‌పోర్టులో కారు చోరీ

ఒకరి అరెస్ట్.. పరారీలో మరొకరు



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి కారు చోరీ చేసిన ఇద్దరు దొంగల్లో ఒకరిని ఆర్‌జీఐఏ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీ ఉన్నట్లు పోలీసులు చెప్పారు. బుధవారం ఆర్‌జీఐఏ పోలీసులు ఇక్కడ మాట్లాడుతూ.. కాప్రా బాలాజీ నగర్‌లో నివసించే బొద్దు రాజ్‌కుమార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 23 అర్ధరాత్రి నేరేడ్‌మెట్ కాకతీయనగర్‌కు చెందిన తన యజమాని కుటుంబాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో వదిలేశాడు. ఆ తర్వాత ఫ్రీ పార్కింగ్ ఏరియాలో కారును పార్క్ చేసి మంచి నీళ్లు తాగేందుకు వెళ్లివచ్చాడు. ఇంతలో పార్కింగ్ పక్కనే ఉన్న ఏరియా నుంచి వచ్చిన ఇద్దరిలో ఒకడు రాజ్‌కుమార్‌ను కత్తితో బెదిరించాడు. తాళంచెవులు తీసుకుని కారు స్టార్ట్ చేసి అందులో ఇద్దరు పరారయ్యారు. ఈ విషయాన్ని డ్రైవర్ రాజు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా వివిధ సాంకేతిక ఆధారాలతో బాలాపూర్ బైసా గార్డెన్‌కు చెందిన నజీబుల్లా అలియాస్ జాహేద్, ఎర్రకుంటకు చెందిన అబ్దుల్ మాజీద్‌లు నిందితులుగా గుర్తించారు. పోలీసులకు బుధవారం ఉదయం నజీబుల్లా కారుతో పట్టుబడగా అబ్దుల్ మాజీద్ పరారీలో ఉన్నాడు. చోరీ కేసును ఛేదించిన ఆర్‌జీఐఏ పోలీసులను డీసీపీ రాజేష్ అభినందించారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి నీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-2లోని కోదండాపూర్ పంప్ హౌజ్‌లో రెండో పంపుఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతు పనుల కోసం గురువారం పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి. కొన్నిచోట్ల పూర్తిగా.. మరికొన్ని చోట్ల పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని, ఇంకొన్ని ప్రాంతాల్లో ప్రెజర్‌తో నీరు సరఫరా అవుతుందని పేర్కొంది. మీరాలం, బాలాపూర్, మైసారం, బార్కాస్ భోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండీ, భోలక్ పూర్, చిలకల గూడ, తార్నాక, లాలాపేట్, బౌద్ధ నగర్, మారేడ్ పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, కంటోన్మెంట్, ప్రకాశ్ నగర్, పాటిగడ్డ, హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, వైశాలి నగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కపురి కాలనీ, మహీంద్రహిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కా నగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, మీర్ పేట్, బడంగ్ పేట్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది.

ధరణిలో భూమిని తొలగించారంటూ వ్యక్తి ఆత్మహత్యా యత్నం



ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న సూరిబాబు

శంషాబాద్: ధరణిలో తన భూమికి సంబంధించిన వివరాలు తొలగించారంటూ శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంకరాపురం గ్రామానికి చెందిన చెన్న కమలేష్ కమలమ్మ, లక్ష్మయ్య దంపతులకు ఘాన్సిమియా గూడలోని సర్వేనంబరు 4/7 4/8లో ఉన్న భూమి వివరాలను గత ఏడాది ధరణిలో తొలగించారని బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సుమారు వందసార్లకుపైగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ధరణిలో తిరిగి వివరాలు నమోదు చేయడం లేదంటూ కమలమ్మ, లక్ష్మయ్య దంపతుల కుమారుడు సూరిబాబు ఓ సీసాలో తెచ్చుకున్న పెట్రోలును ఒంటిపై పోసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అప్పటికే అక్కడికి చేరుకున్నారు. పెట్రోలు పోసుకున్న వెంటనే సూరిబాబును అదుపులోకి తీసుకుని నీళ్లు పోయించారు. సూరిబాబు కుటుంబ సభ్యులు అక్కడే కాసేపు బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమ భూమి వివరాలు తొలగించి దానిని వేరే వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పరిశీలనలో ఉందని అధికారులు వెల్లడించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాల్సిందే

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాచిగూడ: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష స్కామ్‌పై ప్రధాని స్పందించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం నారాయణగూడ చౌరస్తాలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర నేత కృష్ణ తదితరులతో కలిసి బల్మూరి వెంకట్ మాట్లాడారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా దానిని రద్దు చేయకుండా ప్రధాని మౌనం వహించడం తగదన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మాట్లాడకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేపడతామని హెచ్చరించారు. చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో హస్మిబాబు, ఎం.డి. జావిద్, లెనిన్, సాయికృష్ణ, అనిల్, స్టాలిన్, శ్రీమాన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాలు

రూ. 3 కోట్లు ఇవ్వాల్సిందే..

- వెంచర్ నిర్వాహకుల వద్ద డిమాండ్
- ప్లాట్ యజమాని వద్ద రూ.2 లక్షల వసూలు
- మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు మహేందర్‌రెడ్డి

మేడ్చల్ రూరల్: నేను మేడ్చల్ తహశీల్దార్ కార్యాలయం నుండి వచ్చానంటూ ప్లాట్ యజమాని వద్ద డబ్బు వసూలు చేసి మరోమారు బెదిరింపులకు పాల్పడి రూ. 3 కోట్లు డిమాండ్ చేసిన వ్యక్తి గురించి బాధితులు, తహశీల్దార్ మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. పూడూర్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి కొంత కాలం నుండి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిత్యం కాలక్షేపం చేస్తూ భూ వివరాలు సేకరిస్తూ ఉండేవాడు. ఇదిలా ఉండగా సోమారం గ్రామంలో గంగస్థాన్ వెంచర్‌లోని ప్లాట్ నెంబర్ 183ను దుండిగల్ కు చెందిన బాల్‌రెడ్డి 2022లో కొనుగోలు చేశాడు. తన ప్లాట్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసుకునేందుకు పనులు చేపట్టగా అదే సమయంలో పూడూర్ గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి ప్లాట్ వద్దకు వెళ్లి తాను తహశీల్దార్ కార్యాలయం నుండి వచ్చాను..మీరు కొన్న ప్లాట్ స్థలంలో గతంలో చెరువు కుంట ఉండేది.. మీరు ప్రభుత్వ భూమి ఎలా కొన్నారు. ఇప్పుడు ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో 2022 ఆగస్టులో బాల్‌రెడ్డి చెక్కు రూపంలో రూ.2 లక్షలు మహేందర్‌రెడ్డికి ఇచ్చారు.

20 రోజుల నుంచి ఇబ్బందులకు గురి చేస్తూ....

గతంలో రూ. 2 లక్షల వసూలు చేసిన మహేందర్ రెడ్డి అంతటితో ఆగకుండా గత 20 రోజుల నుండి మళ్లీ బాల్‌రెడ్డిపై బెదిరింపులు ప్రారంభించాడు. వెంచర్ నిర్వాహకులు ప్రభుత్వ కుంట స్థలం కబ్జా చేశారని.. ఇప్పుడు వెంచర్‌ను అధికారులు పూర్తిగా తొలగిస్తారని వెంచర్ నిర్వాహకులు వద్ద నుండి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశాడు. అంతేకాక తహశీల్దార్ కార్యాలయంలో సైతం మహేందర్‌రెడ్డి వెంచర్ నిర్వాహకులు కుంటను కబ్జాచేసి వెంచర్ ఏర్పాటు చేశారంటూ ఫిర్యాదు చేశాడు. 20 రోజుల నుండి డబ్బులు ఇప్పించాలని లేకపోతే వెంచర్ నిర్వాహకులు ఇబ్బంది పడాల్సి వస్తుందని బాల్‌రెడ్డి హెచ్చరించాడు.

అది పెద్ద మనుషులు చెప్పిన మొత్తం

వెంచర్ నిర్వాహకుల వద్ద నుండి డబ్బులు ఇప్పించాలని మహేందర్‌రెడ్డి బాల్‌రెడ్డికి పలుమార్లు ఫోన్‌చేసి కోరాడు. రూ.3 కోట్లు అడిగిన మహేందర్‌రెడ్డి అదికూడా తాను స్వయంగా అడిగింది కాదని తనను పంపిన పెద్ద మనుషులు చెప్పిన మొత్తం అని మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని ఆ పని అంతా పెద్ద మనిషి చూసుకుంటాడంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఆ వాయిస్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పోలీసులకు బాధితుడు,తహసీల్దార్ ఫిర్యాదు

మహేందర్‌రెడ్డి బెదిరింపులతో విసుగు చెందిన బాధితుడు మేడ్చల్ తహసీల్దార్‌కు గత నెల 27న ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసిన తహసీల్దార్ శైలజ ఆ స్థలంలో ఎలాంటి కుంట లేదని నిర్ధారించారు. తమ పేరు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో మేడ్చల్ పోలీసులకు ఈ నెల 22న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు బాధితుడు ఇచ్చిన ఆధారాలతో నిందితుడు మహేందర్‌రెడ్డిని మంగళవారం రిమాండ్ చేశారు.

ఘనంగా నర్సింగ్ వార్షికోత్సవం



లక్డీకాపూల్ : నాణ్యత ప్రమాణాలలో రాజీలేకుండా భారతీయ సంప్రదాయ దుస్తులను వస్త్రప్రియుల అభిరుచులకు అనుగుణంగా అందించడమే 'నర్సింగ్' విజయ రహస్యమని ఆ సంస్థ ఎండీ సంజయ్ సింఘానియా పేర్కొన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని నర్సింగ్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లో నర్సింగ్ 61వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న సినీ తారలు వర్షా (జబర్దస్త్ ఫేం), అమీక్ష పవార్‌లతో పాటు ఫ్యాషన్ మోడళ్లు సందడి చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. జంట నగరాల్లో 9 షోరూమ్‌లను కలిగిన నర్సింగ్ ఫ్యాషన్ ప్రియులు మెచ్చే రీతిలో శారీస్, లెగ్గిన్స్, ఆఫ్ శారీస్, డిజైనర్ వేర్స్‌ను అందించడంలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఇప్పటివరకు అందివస్తున్న ఫ్యాషన్‌కు అనుగుణంగా నర్సింగ్ క్లాత్ షోరూమ్ అన్ని వర్గాల ప్రజల మెప్పు పొందుతుందని స్పష్టం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి.

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్ లో ఉన్న విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావిళ్ళ సీతారామయ్యలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, డాక్టర్ చిన్నారెడ్డి లకు విడివిడిగా కలిసి వినతి పత్రం సమర్పించారు. నగదు రహిత వైద్యం, పెండింగ్‌లో గల నాలుగు డీఏ బకాయిలు, ఈకుబేర్ లో దీర్ఘకాలికంగా మంజూరు కాని బిల్లులు , 2023 పీఆర్‌సీ,రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు, 398 టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా నివేదికను ప్రభుత్వానికి అందించాలని కోరారు.

డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం గీత

రహమత్‌నగర్: మాదక ద్రవ్యాల వినియోగం సమాజ వినాశనానికి దారి తీస్తుందని నాట్కో హైస్కూల్ హెచ్ఎం గీత ఆందోళన వ్యక్తం చేశారు. బోరబండ సైట్–2 నాట్కో పాఠశాలలో యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డ్రగ్స్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కల్గించే అంశమన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. అనంతరం డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలపై ఛాయ చిత్ర ప్రద ర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు లక్ష్మీకుమారి, ప్రేమమణి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సాహు మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం

లిబర్టీ: దళితుల అభ్యున్నతి, ప్రగతి కోసం సాహు మహరాజ్ జీవితాంతం పోరాటం సాగించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందు అన్నారు. సాహు మహరాజ్ ఉదద్యమ స్ఫూర్తిని పోరాటపటిమను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సాహు మహరాజ్ జయంతి పురస్కరించుకొని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహు మరాజ్ రిజర్వేషన్లు సాధించడంలో ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. సామాజికంగా వెనుకబడిన దళితులకు బీసీలకు రిజర్వేషన్ల కల్పన కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. దళితులు, బీసీలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అంటే ఆనాడు సాహు మరాజ్ వేసిన బీజమేనని సాధారణంగా గుర్తు చేశారు. కేవలం వెనుకబడిన వర్గాలకే మాత్రం కాకుండా ఎస్సీలకు, సామాజికంగా ఉన్నత స్థానంలో ఉండాలని రిజర్వేషన్ల కోసం ఆనాడే కృషి చేశారని పేర్కొన్నారు. సాహు మహరాజ్ ఆశయ సాదన కోసం పని చేయాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేస్తూ పేద వర్గాలకు చేయూతనిస్తున్న సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎన్విరాన్మెంటల్ సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న సమస్తకు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యుడు అనురాగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం సమర్పించి అందిస్తున్న సేవలను వివరించారు. ఈసందర్భంగా ఆయన ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఆదిలీలా ఫౌండేషన్‌కు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని విన్నవించారు. ప్రధానితో మాట్లాడి సహకారం అందించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

వేడుకగా రేణుకాఎల్లమ్మ కల్యాణం


ఊరేగింపులో పాల్గొన్న విజయారెడ్డి

పంజగుట్ట: ఆషాఢ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రమంజిల్ రామకృష్ణానగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆయంలో అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ సంబురాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఊరేగింపును ప్రారంభించారు.

కేఎల్‌హెచ్ యూనివర్సిటీకి అరుదైన అవార్డు


అవార్డు అందుకుంటున్న కేఎల్‌హెచ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన పీఏఎల్ఎస్ హబ్ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని కేఎల్‌హెచ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ పార్థసారథి వర్మ అన్నారు. పీఏఎల్ఎస్ కార్యక్రమం కింద వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు అసాధారణ ప్రతిభకు గాను ఈ అవార్డులు వరించాయన్నారు. దాదాపు 28 ఈవెంట్లలో తమ విద్యార్థులు చురుకైన పాత్ర పోషించారన్నారు.

వైభవంగా బోనాల దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తాం


కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా జరుగుతున్న బోనాల దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటామని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. రహమత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ... డివిజన్‌లోని 12 దేవాలయాలకు బోనాల ఉత్సవాల నిధులు మంజూరయ్యారని, వాటిని త్వరలోనే ఆయా కమిటీల ప్రతినిధులకు అందజేస్తామన్నారు. రిజిస్ట్రేషన్, బ్యాంకు ఖాతాలు కలిగిన ఆలయ కమిటీ బాధ్యులు తమ ఆలయ లెటర్‌హెడ్‌లను తన కార్యాలయంలో సమర్పించాలని కోరారు. గత ప్రభుత్వం కంటే వైభవంగా ఈ ఏడాది బోనాల ఉత్సవాలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నగరంలో ఉత్సవాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు బుధవారం ఉన్నతాధికారులతో జీహెచ్ఎంసీ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. డివిజన్‌లో ప్రతి ఆలయాన్ని సందర్శించి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకుంటానని కార్పొరేటర్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో...
సరికొత్త బోధనకు శ్రీకారం

- అమలులోకి పూర్వ ప్రాథమిక విద్య
- ఆట పాటలు, కథలతో బోధన
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో నాలుగు విడతల్లో శిక్షణ


శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యాన్ని పెంచడం, మెరుగైన కథలతో కూడిన విద్యను అందించడం, గ్రహణశక్తిని పెంచడం లక్ష్యంగా పూర్వ ప్రాథమిక విద్య నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది మాత్రం చక్కటి ప్రణాళికతో మరింత పకడ్బందీగా చిత్రాలతో కూడిన పుస్తకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సారి నూతన జాతీయ విద్యా విధానంలో 3–6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య తప్పనిసరిగా బోధించాలని నిబంధన విధించారు.

- ఇందులో భాగంగానే కొత్త తరహా పాఠ్య పుస్తకాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. వీటి ద్వారా బోధన ఎలా చేయాలనే దానిపై ఇప్పటికే హైదరాబాద్ జిల్లా నుంచి కొందరు సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు.
- సోమవారం నుంచి ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది.
- నాలుగు విడతలుగా ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలో ఒక్కో విడతలో 35 మంది టీచర్లు చొప్పున ఒక బ్యాచ్‌ను రూపొందించారు.
- బంజారాహిల్స్, షేక్‌పేట ఐసీడీఎస్ పరిధిలో మొదటి విడతలో 38 మంది అంగన్‌వాడీ టీచర్లకు సోమ, మంగళ, బుధ వారాల్లో శిక్షణ పూర్తయ్యింది. ప్రాజెక్టు పరిధిలో ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.


అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన పుస్తకాలు

12 వేల మందికి పైగా చిన్నారులు...

ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారుగా 12 వేల మందికి పైగా చిన్నారులు ఉన్నారు. అలాగే 3,000 మందికి పైగా బాలింతలు, 4,000 మందికి పైగా గర్భిణీలు ఉన్నారు. వీరందరికీ పోషకాహారం అందిస్తుండగా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య కూడా అందించాల్సి ఉంది.

- కేవలం వీరికి పోషకాహారం ఇచ్చి సరిపెట్టకుండా సరికొత్త రీతిలో బోధన చేయనున్నారు. గతంలో చదువుల కోసం పుస్తకాలు ఇచ్చినా బోధించడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్య తప్పనిసరిగా అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రియదర్శినితో...

పిల్లల సంఖ్యకు అనుగుణంగా రెండు రకాల పుస్తకాలు సరఫరా చేశారు. 'ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళిక–2024' పుస్తకంలో పిల్లల అవసరాలకు తగ్గట్లుగా, తరువాత నేర్చుకునే చదువుకు అనుగుణంగా ఈ పుస్తకాలను తీర్చిదిద్దారు. ఆట, పాట, ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా టీచర్లు బోధన చేయాల్సి ఉంటుంది. మూడు రోజుల పాటు ఈ బోధన పైనే శిక్షణ అందిస్తున్నారు. ఇందులో 9 పాఠ్యాంశాలను 43 వారాల ప్రణాళికలుగా రూపొందించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లకు సహాయకారిగా ఉండేందుకు 'పూర్వ ప్రాథమిక విద్యా దీపిక'ను కూడా అందించారు. ఎలా ఉండాలి, ఎందుకు, ఏమిటి వంటి అంశాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు.

గ్రహణశక్తి పెరిగేందుకు దోహదం

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు సులభమైన పద్ధతిలో ఆసక్తికరమైన ఆట, పాటలు, కథలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నాం. ఈ మేరకు రాష్ట్ర స్థాయి శిక్షణ పొందిన వారు అంగన్‌వాడీ టీచర్లందరికీ విడతల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. మా పరిధిలో నాలుగు విడతల్లో శిక్షణ పూర్తవుతుంది. అందరికీ శిక్షణ ఇచ్చి అమలుచేస్తాం. ఈ శిక్షణ ద్వారా పిల్లల్లో గ్రహణశక్తితో పాటు శారీరక, ఆరోగ్య అభివృద్ధి కూడా జరుగుతుంది. బోధన సులువుగా అర్థమయ్యేలా కరదీపికలు రూపొందించడం జరిగింది. పిల్లలకు గేమ్స్ ఆడిస్తారు. చక్కని కథలు చెబుతారు. గతంలో మాదిరిగా కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి.

– పుష్ప, సీడీపీఓ, ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్

నేలకొరుగుతున్న భారీ వృక్షం


ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ ముందు నేలకొరుగుతున్న భారీ వృక్షం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా ముక్తిధామం ముందు పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్లాట్‌నెంబర్ సీ–45ను ఆనుకుని నిర్మాణంలో ఉన్న భవనంలో ఓ భారీ వృక్షం రోజురోజుకు నేలకొరుగుతూ స్థానికంగా ప్రమాణం పొంచి ఉందని ఆలయ భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి భవన నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సెల్లార్ తవ్వడంతో రోజూ పనులు జరుగుతుండగా ఈ చెట్టు నేలకొరుగుతుంది. భారీ వర్షాలు పడితే చెట్టు కూలే అవకాశాలు ఎక్కువగా ఉందని, నేరుగా గుడి మీద పడుతుందని, భక్తుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. చెట్టు నేలకొరుగుతున్న దృశ్యాలు కళ్లకు కదుతున్నా అధికారులు ఇటువైపు దృష్టిసారించడం లేదన్నారు. ఈవీడీఎం అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్టును తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మున్ముందు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉండటంతో ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా అధికారులపై ఉంది.

మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు మానుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉషాకిరణ్

పంజగుట్ట: రాష్ట్ర మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్ హెచ్చరించారు. ఆదివాసీ గుడెం నుంచి మంత్రిగా ఎదిగి ప్రజాసేవ చేస్తున్న గిరిజన బిడ్డను చూసి ఓర్వలేక కొంతమంది బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. సీతక్క దగ్గర ఎప్పుడో పని చేసిన వ్యక్తి ఏదో ఇసుకవ్యాపారంలో దొరికితే ఇసుక వ్యాపారంలో సీతక్క పీఏ అని ప్రచారం చేస్తున్నారని అక్రమ ఇసుక వ్యవహారంలో సీతక్కకు కాని ఆమె పీఏకు కాని ఎలాంటి సంబంధం లేదని ఆరోపణలు చేస్తున్న వారు ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఆధారాలు ఉంటే బయట పెట్టాలని సవాల్ చేశారు. అసలు అక్రమ దందా మొదలు పెట్టిందే బీఆర్ఎస్ నాయకులని, 2015లో ఇసుక సవరణ జీవో తీసుకువచ్చిందే వారని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని తాము ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ప్రజా కోర్టులో బీఆర్ఎస్‌ను ప్రజలు వ్యతిరేకించినా ఆ నాయకులకు ఇంకా బుద్ధిరాలేదని ఇకనైనా ప్రజలకోసమే జీవిస్తున్న నాయకురాలిపై అభాండాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి విభాగం అధ్యక్షులు మేడ శ్రీను, సాగబోయిన పాపారావు, నాగమణి, వలువాయి శ్రీను, దేవరాయ సురేష్, పాల్య నాయక్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 40, బెండకాయ 45, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 24, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 23, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి రూ. 5–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చంద్రబాబు వర్గీకరణ వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేస్తామనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. బుధవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకమైనవని అన్నారు. గతంలో చంద్రబాబు చేసిన ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామని అనడం కూడా రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఆందోళనలతో చంద్రబాబుకు మాలల తడాకా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ నాయకులు గోపూజు రమేష్, బైండ్ల శ్రీనివాస్, బంగి ఆనంద్ కుమార్, గోకుల్ కళ్యాణ్, గిరి, ఓబులేష్, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాలు తగిలిందని తోటి విద్యార్థిపై దాడి

వెంగళరావునగర్: కాలు తగిలిందని యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సాయిరోహణ్ అనే విద్యార్థి మధురానగర్ సమీపంలోని ఎస్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీ చదువుతున్నాడు. బుధవారం ఉదయం మొదటి పీరియడ్‌లో అతని కాలు మహేష్ అనే మరో విద్యార్థికి తగిలింది. దాంతో సాయిరోహణ్ అతనిని క్షమాపణలు కోరాడు. అయితే మహేష్ మాత్రం సాయిరోహణ్‌ను చెంప మీద కొట్టాడు. అప్పటికి గొడవ తగ్గినా రెండో పీరియడ్‌లో మహేష్ తన స్నేహితులు జగదీష్ మరో యువకుడిని తీసుకొచ్చి సాయిరోహణ్‌ను కొట్టారు. దాంతో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ. వంద కోట్ల స్థలం కబ్జాకు యత్నం



చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యాలు

- పట్టపగలే చెరువు బఫర్ జోన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు
- కళ్లు మూసుకున్న జీహెచ్ఎంసీ యంత్రాంగం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ఉన్న లోటస్ చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించిన కబ్జాదారులు పట్టపగలే నిర్మాణాలకు తెరలేపారు. గత నెల రోజులుగా చెరువు బఫర్ జోన్‌లో భూమిని చదును చేస్తూ చెరువు ఫెన్సింగ్‌ను కూల్చివేసి పనులు జరుగుతున్నా జీహెచ్ఎంసీ అధికారులకు గానీ, లోటస్ పాండ్ సెక్యూరిటీ గార్డ్స్‌కు గానీ కనిపించలేదు. దీంతో ఇక్కడ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఔషధ మొక్కలు, భారీ వృక్షాలు, ఆహ్లాదకర వాతావరణంతో వాకర్లకు, సందర్శకులకు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్న లోటస్ చురువులో జరుగుతున్న ఆక్రమణలతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిలింనగర్ వెంచర్–2 నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లే రోడ్డు పక్కనే చెరువు ఫెన్సింగ్ ఉండగా దాన్ని కూల్చివేశారు. జేసీబీలతో అందులోకి చొచ్చుకువచ్చి భూమిని చదును చేస్తున్నారు. పైప్ లైన్ నిర్మాణం కోసం కూడా ఇప్పటికే ప్రధాన రోడ్డును తవ్వారు. ఈ చెరువు ఫెన్సింగ్ ఫిలింనగర్ రోడ్డు నెంబర్–11, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 86 వైపు ఉంది. ప్రకృతి ప్రేమికులు ఈ కబ్జా పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోటస్ చెరువు చుట్టూ 20 సంవత్సరాల క్రితమే బౌండరీ ఫెన్సింగ్‌ను పక్కాగా నిర్మించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల విచారణ...

చెరువు బఫర్ జోన్‌లోకి చొచ్చుకువచ్చి గుర్తుతెలియని వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో జూబ్లీహిల్స్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇక్కడ తనిఖీలు నిర్వహించారు. అయితే వసూళ్లు, అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచిన సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకంతోనే ఈ కబ్జా జరుగుతుందని, వారిని పక్కనబెట్టి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇక్కడ విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులపై జూబ్లీహిల్స్ ఫిలింనగర్ కాలనీవాసులు పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయిన నేపథ్యంలో ఉన్నతాధికారులే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే లోటస్ పాండ్ చుట్టూ బఫర్‌జోన్‌లో 20కి పైగా ప్లాట్లు తయారయ్యే అవకాశాలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే లోటస్‌పాండ్ తూము కింద కోట్లాది రూపాయల విలువ చేసే వరద ప్రవాహ ప్రాంతం కబ్జాకు గురైంది.

సైఫాబాద్ సైన్స్ కళాశాలపై దానకిషోర్ వరాల జల్లు


దానకిషోర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ దానకిషోర్ వరాల జల్లు కురిపించారు. ఇటీవల సైఫాబాద్ సైన్స్ కళాశాలను సందర్శించిన సమయంలో ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆయన ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కళాశాలలో కొత్త డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణార్థం ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణతో చర్చించి యూనివర్సిటీ బడ్జెట్ నుంచి రూ. 10 లక్షలను విడుదల చేయించారు. అలాగే కళాశాలలోని బాయ్స్ హాస్టల్‌లో ఓపెన్ జిమ్‌ను, గర్ల్స్ హాస్టల్‌లో ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నుంచి నిధులను విడుదల చేయించారు. అలాగే కళాశాలలో పచ్చదనం, జీవ వైవిధ్యాన్ని చూసి ముగ్ధులైన దానకిషోర్ కళాశాల ప్రాంగణంలో బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి రూ. 95 లక్షల నిధులను హెచ్ఎండీఏ నుంచి విడుదల చేయించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, కళాశాల సిబ్బంది దానకిషోర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బస్తీల్లో కార్పొరేటర్ పర్యటన


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని నూర్‌నగర్, అల్ ఖతిర్ హోటల్ గల్లీ, పంజగుట్ట పడవ స్కూల్ ప్రాంతాలను బిన్ ఫ్రీ తీర్చిదిద్దుతామని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని శానిటేషన్ సూపర్‌వైజర్, ఎస్ఎఫ్ఏలతో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎక్కడా చెత్తాచెదారం నిలిచిపోకుండా చూడాలన్నారు. రోజూ శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. రోజూ చెత్త వేసే ప్రాంతాలపై నిఘా పెట్టి అక్కడ చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత ఎస్ఎఫ్ఏలపై ఉందన్నారు.

పాఠశాలల బంద్: ఏబీవీపీ నేతల అరెస్టు

రహమత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలతో విద్యా సమస్యలు పరి ష్కారించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ విద్యార్థి సం ఘం బుధవారం బంద్ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రహమత్‌నగర్, బోరబండ పాఠశాలలు మూసివేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తంగళ్లపెల్లి నందుతో పాటు పలువురు విద్యార్థి సంఘాల నాయకులకు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నందు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్న విద్యా శాఖ మంత్రిని నియమించలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


పోలీసులు అదుపులో ఏబీవీపీ నాయకులు

బస్తీలో చెత్తను తొలగించకుంటే ఎలా?


చీఫ్ మెడికల్ ఆఫీసర్ అండ్ హెల్త్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీ నేతలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానిసింగ్‌నగర్ బస్తీలో నిత్యం రోడ్లను ఊడ్చడం లేదని, చెత్త తీసుకువెళ్లడానికి స్వచ్ఛ ఆటోలు రావడం లేదని, ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోతుందని ఆరోపిస్తూ బస్తీ నేతలు ఎండీ సలీం, కే యాదగిరి తదితరులు బుధవారం జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ అండ్ హెల్త్ డాక్టర్ కే పద్మజను ప్రధాన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. రోడ్లు ఊడ్చడం లేదని, చెత్తను తొలగించడం లేదని ఇక్కడి అధికారులకు, ఎస్ఎఫ్ఏలకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని, అందుకే ఇక్కడి దాకా వచ్చామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఏఎంఓహెచ్ ఏమి చేస్తున్నారంటూ వారిని ప్రశ్నించారు. తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వీధిదీపాలు మరమ్మతులు చేయించండి...

జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీలో కొత్తగా వీధిదీపాలు ఏర్పాటుచేయాలని, పాతటికి మరమ్మతులు చేయించాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ వీధి దీపాల ఈఈ ఇంద్రదీప్‌కు బుధవారం బస్తీ నేతలు సలీం, యాదగిరి వినతిపత్రం అందజేశారు. ఎక్కడా వీధిదీపాలు వెలుగుకు నోచుకోవడం లేదని, కొత్తవి అవసరం ఉన్నా అమర్చడం లేదని ఫిర్యాదు చేశారు.

నిత్యావసరాల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: నారాయణగూడలోని ఎస్ఎస్ఎస్ కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం గివ్ అండ్ గ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రూ. 2 లక్షల విరాళాలతో 1800 పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మల్కాజిగిరి, మలకోపేట నల్లకుంట ప్రాంతాలలో మూడు మురికివాడలు, ఐదు అనాథాశ్రమాలు, రెండు వృద్ధాశ్రమాల్లోని పేదలకు ఒక నెలకు సరపడా నిత్యావసర సరుకులు, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ దీప, ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, ప్రోగ్రామింగ్ ఆఫీసర్ స్వప్న, ఎస్ఎస్ఎస్ అధ్యక్షుడు ఎం.రిశ్వంత్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ సాయికిరణ్ చౌదరి, ఉపాధ్యక్షురాలు దివ్య, కోశాధికారి చైతన్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి గురువారం, 27, జూన్, 2024

చిరుత కాదు.. జంగపిల్లి!

- సీసీ ఫుటేజీల్లో గుర్తించిన అటవీ అధికారులు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో సంచరించేది చిరుత కాదు, జంగపిల్లి అని అటవీ అధికారులు నిర్ధారించారు. చిరుత సంచరిస్తోందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అటవీ అధికారులు అప్రమత్తమై ఘాంసిమియాగూడ పరిసర ప్రాంతాల్లో రెండు బోన్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పలుచోట్ల సీసీ కెమెరాలు అమర్చారు. అయితే మంగళవారం రాత్రి కెమెరాల్లో ఓ జంగపిల్లి ఆనవాలు స్పష్టంగా నిక్షిప్తమయ్యాయి. ఈ ప్రాంతంలో తిరిగేది చిరుత కాదని, అయినప్పటికీ నిఘా కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

గాంధీలో రూ.66 కోట్లతో అభివృద్ధి పనులు



హేమంత్‌కు పూలమొక్క బహూకరిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తెలంగాణ వైద్య విద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో రూ66 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి హేమంత్‌ను బుధవారం కలిసి బొన్సాయ్ పూలమొక్క బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. గాంధీఆస్పత్రిలో రూ.15.5 కోట్లతో డ్రైనేజీ సిస్టం, రూ. 12 కోట్లతో ఎలక్ట్రికల్ వర్క్స్, రూ. 3.5 కోట్లతో ఫైర్‌ఫైటింగ్ సిస్టం, రూ.35 కోట్లతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ (ఎస్ఓటీసీ)కు నిధులు మంజూరు అయ్యావని, కొన్ని పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఆయా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి నిరుపేద రోగులకు అందుబాటులోకి తేవాలని హేమంత్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షకు ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 30 నుంచి జూలై 4 వరకు నిర్వహించే డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(వర్క్స్) గ్రేడ్ -2 సీబీఆర్‌టీ మోడ్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం సెషన్ 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2:30 నుంచి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన సమయం కంటే అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లో హాజరు కావాలని, ఆ తర్వాత అనుమతించడం జరగదని పేర్కొన్నారు.

ఉపా కేసులను ఎత్తివేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రచయిత్రి అరుంధతీ రాయ్, కశ్మీర్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని సామాజిక ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల ఆధ్వర్యంలో అరుంధతీరాయ్‌పై ఉపా కేసు వాస్తవాలు అనే అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి రీసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య అధ్యక్షత వహించగా ప్రొ.హరగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిపై కూడా ఉపా కేసులు పెట్టారని ఓయూ విద్యార్థి జేఏసీ నేత కోట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు డాక్టర్ వంశీధర్, విద్యార్థి నేతలు నాగేశ్వర్ రావు, సతీష్, వలిగొండ నరసింహా, తాళ్ల అజయ్, భగత్, పవన్, అశ్వన్, రమేష్, కోటి, రుక్మత్ పాషా, వికాస్ పాల్గొన్నారు.

ఈ నగరానికి ఏమైంది?

వరుసగా చోటుచేసుకుంటున్న హత్యలు.. పంజా విసురుతున్న స్నాచర్లు

- పోలీసులు కాల్పులు జరుపుతున్నా అంతే..
- గస్తీ విధానంలో లోపాలే ప్రధాన కారణం
- వివాదాలకు కేంద్రబిందువుగా ఖాకీలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నగరానికి ఏమైంది.. కొన్నిరోజులుగా తుపాకులు పేలుతున్నాయి. కత్తులు స్వైరవిహారం చేస్తున్నాయి. స్నాచింగ్‌లు పెరిగిపోతున్నాయి. హత్యలు, స్నాచింగ్స్, హత్యాయత్నాలు ఎక్కువకావడంతో నగరవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత 12 రోజుల్లో రాజధానిలో ఆరు హత్యలు జరిగాయి. స్నాచర్లు వరుసపెట్టి పంజా విసురుతున్నారు. పోలీసులు తుపాకులకు పని చెప్తున్నా వీళ్లు తగ్గట్లేదు. అధికారుల నిర్లిప్తత, పెట్రోలింగ్‌లో లోపాలే ఈ పరిణామాలకు కారణాలనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అన్ని నిరోధించేవి కాకపోయినా...

హత్యల్లో కొన్ని నిరోధించగలిగేవి, మరికొన్ని నిరోధించలేనివి ఉంటాయి. ప్రధానంగా వ్యక్తిగత కక్షలు, కుటుంబ కలహాలు, ఆస్తి/ఆర్థిక వివాదాలు, వివాహేతర సంబంధాల వల్ల జరిగే వాటిని ముందస్తుగా ఎవరూ గుర్తించలేరు. రౌడీషీటర్ల మధ్య గ్యాంగ్‌వార్, హత్య, ప్రతీకార హత్యలతోపాటు సుపారీ హత్యల్ని పోలీసులు నిరోధించే అవకాశం ఉంటుంది. గడిచిన 12 రోజుల్లో నగరంలో చోటు చేసుకున్న ఆరు హత్యల్లో ఈ తరహాకు చెందినవీ ఉన్నాయి. వీటిని అడ్డుకోలేకపోవడానికి నిఘాలేమి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పోలీసుల వైఫల్యం కూడా ఒక కారణమే.

తుపాకుల దుమ్ము దులుపుతున్నా...

నగరంలో ఇటీవల గొలుసుల కంటే ఎక్కువగా సెల్‌ఫోన్లు స్నాచింగ్‌లు జరుగుతున్నాయి. దీంతోపాటు రాత్రివేళల్లో అనేక చోట్ల అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. వీటికి చెక్ చెప్పడానికిగాను పోలీసు విభాగం 'ఫ్రెండ్లీ పోలీసింగ్'ను పక్కన పెట్టేసింది. కొన్నేళ్లుగా ఫ్రెండ్లీ పేరుతో పోలీసులు తమ లాఠీలు, తుపాకులను ఠాణాలకే పరిమితం చేశారు. ఇవి సిబ్బంది, అధికారుల చేతిలో కనిపిస్తే వారి వద్దకు వచ్చి, తమ బాధలు చెప్పుకోవడానికి బాధితులు వెనుకడుగు వేస్తారంటూ గతంలో అధికారులు ఈ పని చేయించారు. అయితే తాజా పరిణామాలతో వీటిని బయటకు తీసిన పోలీసులు సికింద్రాబాద్, సైదాబాద్‌ల్లో కాల్పులు జరిపారు. పటిష్టమైన గస్తీ విధానం అమలైతేనే వీటిని నిరోధించే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు.

పోలీసులనూ ముసురుతున్న వివాదాలు

కొన్ని రోజులుగా పోలీసులనూ వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నగర సీసీఎస్ ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావు, రూ.3 లక్షలు తీసుకుంటూ ఇదే విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. ఈ ప్రభావంతో సీసీఎస్‌లో పని చేస్తున్న పలువురిపై బదిలీ వేటు పడింది. షాహినాయత్ గంజ్ హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటరమణారెడ్డి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, ఎస్సై శంకర్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్, ఎస్సై మధు సైతం వివాదాల్లో చిక్కుకోవడంతో వేటు పడింది. ఎన్నికల హడావుడి ముగియడంతో నేడో రేపో బదిలీ అయిపోతామనే ఉద్దేశంతో పలువురు పోలీసులు ఉండగా, ఆ ప్రక్రియ మాత్రం పెద్ద ప్రహసనంలా సాగుతూ పరిస్థితిని మరింత జటిలంగా మారుస్తోంది.

నిఘా నిద్దురపోతుండటం వల్లే..

గస్తీ విధానానికి సుస్తీ చేయడం, నిఘా విభాగాలు నిద్దురోవడం కారణంగానే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని నిపుణులు చెప్తున్నారు. వ్యూహాత్మకంగా గస్తీ జరిగినప్పుడే అనేక నేరాలను నిరోధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేస్తున్నారు. నిఘా విభాగాలు సైతం అంత చురుకుగా లేని సందర్భాల్లోనే ఇలాంటి ఉదంతాలు జరుగుతాయని పేర్కొంటున్నారు. ఇటీవల ఏకంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కీలక నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన అనేక మంది ఆ పార్టీ నేత బాల్క సుమన్ నేతృత్వంలో పోచారం ఇంటి వరకు రాగలిగారు. ముఖ్యమంత్రి లోపల ఉండగానే లోపలకు దూసుకుపోయేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే నిఘా విభాగంపై అనుమానాలు కలుగుతున్నాయని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న ఉదంతాలివి..

- ఆసిఫ్‌నగర్‌లో కుతుబుద్దీన్, చందానగర్‌లో విజయలక్ష్మి, బాలాపూర్‌లో సమీర్, మియాపూర్‌లో చిన్నారి, ఫలక్‌నుమలో జాకీర్ అలీ, బేగంపేటలో ఉస్మాన్ హత్యలు
- ఛత్రినాకలో ఓ బ్యూటీషియన్‌పై ఆమె స్నేహితుడు చేసిన హత్యాయత్నం, పహాడీషరీఫ్‌లో చిన్నారి కిడ్నాప్
- బోరబండ రైల్వే స్టేషన్‌లో అల్లాపూర్‌కు చెందిన డానిష్ అనుమానాస్పద మృతి
- సికింద్రాబాద్, జవహర్‌నగర్, శామీర్‌పేట, సైదాబాద్‌ల్లో స్నాచింగ్స్
- మేడ్చల్‌లోని శ్రీ జగదాంబ జ్యువెలర్స్‌లో పట్టపగలు చోటుచేసుకున్న దోపిడీ

అనేక అంశాల్లో తీవ్ర గందరగోళం

కేవలం నేరాల నిరోధం విషయంలోనే కాదు, పోలీసింగ్‌కు సంబంధించిన అనేక అంశాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవలి వరుస ఉదంతాల నేపథ్యంలో రాత్రి వేళల కచ్చితంగా 10.30 గంటలకు దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసేయించాలని పోలీసు శాఖ నిర్ణయించుకుంది. దీనికి సంబంధించి అంతర్గత ఆదేశాలు జారీ కావడంతో కొన్ని ఇంటర్‌నెట్ వెబ్‌సైట్స్‌లో ఆ అంశం ప్రత్యక్షమైంది. దీన్ని అనేక మంది పోలీసులు తమ వాట్సాప్ స్టేటస్‌లుగానూ పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలోనూ ఈ అంశాలు కనిపించాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు ఆటోలకు మైకులు పెట్టి ప్రచారం కూడా చేశారు. 'లాఠీ పోలీసింగ్' అంటూ వీడియోలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఓ నేత దీనికి వ్యతిరేకంగా ట్వీట్ చేయడంతో కథ అడ్డం తిరిగింది. వ్యాపార సంస్థల మూసివేతపై వస్తున్నవన్నీ పుకార్లే అంటూ పోలీసులు ప్రకటించారు.

సీఎం ఇంటి వద్ద గురుకుల అభ్యర్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గురుకుల అభ్యర్థులు

బంజారాహిల్స్: గురుకులాల్లో బ్యాక్‌లాగ్‌లు లేకుండా పోస్టులు భర్తీ చేయాలని, ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురుకుల అభ్యర్థులు బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసం ముందు నిరసన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన గురుకుల అభ్యర్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. హైకోర్టు తీర్పు ఆధారంగా ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పైస్థాయి నుంచి కింది స్థాయి (డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ) వరకు డిసెండింగ్ ఆర్డర్‌లో నియామకాలు చేపట్టాలని కోరారు. పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు పోస్టుల భర్తీ చేయకపోవడం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం వీరంతా పెద్దమ్మ గుడి సమీపంలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు.

హోంగార్డులను పర్మనెంట్ చేయాలి



వేంనరేందర్ రెడ్డిని కలిసిన హోంగార్డుల సంఘం నాయకులు

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో రాష్ట్ర హోంగార్డుల సంఘం నాయకులు బుధవారం కలిశారు. హోంగార్డుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. హోంగార్డుల ఉద్యోగాలను పర్మనెంట్ చేసేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్, ప్రధానకార్యదర్శి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్వాల్ దయానంద్, ఉపాధ్యక్షులు హన్మంత్ రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పోస్టింగ్‌ల కోసం మాజీ హోంగార్డుల ఆందోళన



మినిస్టర్స్ క్వార్టర్స్ వద్ద మాజీ హోంగార్డుల ఆందోళన

బంజారాహిల్స్: పదేళ్ల పాటు డ్యూటీ చేసిన తర్వాత ఆర్డర్ కాపీ లేదనే నెపంతో తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మాజీ హోంగార్డులు కోరారు. బుధవారం మాజీ హోంగార్డులు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున బంజారాహిల్స్‌రోడ్ నెం.12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌కు తరలివచ్చారు. గతంలో సీఎం కేసీఆర్ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చి విస్మరించారని, అందుకే తమ గోడును మంత్రులకు విన్నవించేందుకు వచ్చామని వారు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో కూడా ఈ సమస్య ఉందని, ఇప్పటికే మంత్రి సీతక్కను కలిశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది హోంగార్డులు ఉన్నారని, ఉపాధి లేక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల రీ సైక్లింగ్ బెంచీల తయారీ



- ఓక్రిడ్జ్ స్కూల్ విద్యార్థి అనాహిత ప్యాట్నీ ప్రతిభ

లక్డీకాపూల్: ప్లాస్టిక్ వ్యర్థాల రీ సైక్లింగ్ ద్వారా పాఠశాలలకు ఉపయోగపడే విధంగా ఓ విద్యార్థిని బెంచీలను తయారు చేసింది. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన అనాహిత ప్యాట్నీ తయారు చేసిన వంద బెంచీలను బోరబండలోని ప్రభుత్వ పాఠశాలకు అందజేశారు. ఇన్‌ఫ్రా గ్రీన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. కాగా, ఈ సందర్భంగా ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని ప్యాట్నీని పలువురు అభినందించారు.

శిల్పారామంలో విదేశీ జర్నలిస్టులు



మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శించిన విదేశీ మీడియా ప్రతినిధులు

మాదాపూర్: తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్న పర్యాటక, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యాకేంద్రాలను సందర్శించడానికి 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. ఇందులో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామాన్ని బుధవారం సందర్శించారు. ఈస్ట్ ఆసియా, యూరేసియా, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్కెనిస్తాన్, కిర్గిగ్ రిపబ్లిక్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, మంగోలియా, కజికిస్తాన్ దేశాల ప్రముఖ మీడియా ప్రతినిధులు శిల్పారామంలోని స్టాల్స్‌లో ఉన్న ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనతో కళాకారులు రితిక, తనిష్కలు సందర్శకులను ఆకట్టుకున్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన పొలిటికల్ కార్టూనిస్టులు



శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పొలిటికల్ కార్టూనిస్టులు

సాక్షి, సిటీబ్యూరో: ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. ఈ మేరకు బుధవారం ఫోరం తరఫున ప్రముఖ పొలిటికల్ కార్టూనిస్టులు నర్సిం, శంకర్, మృత్యుంజయ్, జె.వెంకటేశ్‌లు శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఉన్న కార్టూనిస్టులు వివిధ పత్రికల్లో వేసిన పొలిటికల్ కార్టూన్లతో అకాడమీ ఆధ్వర్యంలో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని వారు సూచించారు. 1983లో ఇలాగే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన ఉత్తమ కార్టూనిస్టులు, జర్నలిస్టుల అవార్డులను పునరుద్ధరణకు ప్రయత్నించాలని కోరగా సానుకూలంగా స్పందించారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

వెంగళరావునగర్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌ను పారదోలాల్సిన అవసరం ఉందని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్(ఎంజీఎం) హైస్కూల్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు, టీచర్లు పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రత్యేక స్క్రీన్‌పై వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఏసీపీతోపాటు ప్రముఖ బుల్లితెర దర్శక నిర్మాత వినోద్‌బాల, పలువురు ప్రముఖులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎంఎం నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు, కోచ్ ఇమ్రోజ్, టీచర్లు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలను నివారించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంజీఎం స్కూల్ విద్యార్థులు

వ్యాపారాలకు 'విస్తరణ' దెబ్బ

- ప్రొటెక్ట్ రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ అధ్యక్షుడు



మంత్రి పొన్నంను కలిసిన ప్రొటెక్ట్ రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: రాజీవ్ రహదారి విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని ప్రొటెక్ట్ రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ అధ్యక్షుడు ఉప్పలంచ అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, అమర్నాథ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జింఖానా మైదానం నుంచి కార్ఖానా మీదుగా తిరుమలగిరి వెళ్లే రహదారి వెంట వందలాది మంది వ్యాపారాలు చేసుకుంటున్నారని, విస్తరణ పనులతో వారి జీవనోపాధి దెబ్బతింటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నగరంలో ఎక్కడాలేని విధంగా 200 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేస్తే తామంతా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిజాయితీకి మెచ్చి ఐదుగురికి సన్మానం

సాక్షి, సిటీ బ్యూరో: తెలంగాణ ఫ్రీమేసన్స్ సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డే నిర్వహించారు. నిజాయితీగా వ్యవహరించిన ఐదుగురు పౌరులకు సన్మానం చేశారు. దాదే శ్రీనివాస్ అనే ఆటోడ్రైవర్ గత రెండున్నరేళ్లుగా నగరంలోని వేలాది బహిరంగ ప్రదేశాల్లో 'మనం మారాలి', 'వి మస్ట్ చేంజ్', 'హమే బడలనా చాహియే' అంటూ రాతలతో మార్పు కోసం ప్రయత్నం చేస్తున్నాడు. రోడ్డు విస్తరణలో చెట్టును నరికివేయకుండా కాపాడేందుకు 12 ఏళ్ల అనిరుధ్ చెట్టుపైకి ఎక్కి ఏకంగా దాని పైనే 7 గంటల పాటు కూర్చొని చెట్టును కొట్టివేయకుండా కాపాడాడు. 50 ఏళ్ల ఆటో డ్రైవర్ మహ్మద్ ఖలీమ్ హుస్సేన్ ఆటోలో మరిచిపోయిన రూ. 1.25 లక్షలతో పాటు ఆభరణాలను పోలీసులకు అప్పగించాడు. ముషీరాబాద్ డిపో-2 పనిచేస్తున్న ఒక మహిళా కండక్టర్ ఉమా రాణి బస్సులో దొరికిన పర్స్ ను యజమానికి తిరిగి ఇచ్చింది. నగల దుకాణంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ మహేష్ చారి రోడ్డుపై దొరికిన రూ. 48వేల నగదు పోలీసులకు తిరిగి ఇచ్చాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా గౌరవ కాన్సులర్ జనరల్ సురేష్ చుక్కపల్లి మాట్లాడుతూ నిజాయితీగా ఉండే వ్యక్తులను గుర్తించి, ప్రోత్సహించే విధానం అవసరమన్నారు. ఫ్రీమేసన్స్ సంస్థ సేవలను కొనియాడారు.

మహిళాశక్తి క్యాంటీన్లు

కలెక్టరేట్ సహా మండల కేంద్రాల్లో ఐదింటికి గ్రీన్ సిగ్నల్

- జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలికల్లో మరో 20
- మహిళా శక్తి అధ్వర్యంలో మహిళా సంఘాలు నిర్వహించేలా కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. మహిళలను లక్షాధికారులుగా చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకొని చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయంసహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళాశక్తి ఆధ్వర్యంలో మహిళా క్యాంటీన్లు పెట్టించాలని భావిస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐదింటిని ఏర్పాటు చేయాలని లక్ష్యం విధించారు. కలెక్టరేట్‌లో ఒకటి, ఎంసీపల్లి మినహాయించి, మిగతా నాలుగు మండలాల పరిధిలో నాలుగింటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న మున్సిపల్ సర్కిళ్లతోసహా 13 పురపాలక సంఘాలతో కలిపి మొత్తంగా మరో 20 మహిళా క్యాంటీన్ల ఏర్పాటునకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఒక మహిళా క్యాంటీన్ ఏర్పాటు కోసం జిల్లా నుంచి అవకాశం దక్కింది.

- జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 3,390 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 36,782 మంది సభ్యులున్నారు. సంఘాల అర్హతను బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. ప్రభుత్వపరంగా క్యాంటీన్లు ఏర్పాటు చేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కారు ఇటీవలే నిర్ణయించింది. జిల్లాలో వీటిని నెలకొల్పితే మహిళలకు వెన్ను దన్నుగా ఉంటుందని అధికారులు యోచిస్తున్నారు.



పక్కాగా క్యాంటీన్ల నిర్వహణ

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మహిళా క్యాంటీన్ల నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు క్యాంటీన్లు నిర్వహించడంతోపాటు మీ-సేవ కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేసేందుకు కూడా మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఏకరూప దుస్తులు కుట్టించడం పూర్తయింది. ఆయా యూనిట్లు నెలకొల్పేందుకు అర్హుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కాగా, డీఆర్డీఏ ఐదు క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలు ఎంపిక చేస్తున్నారు.

క్యాంటీన్లను త్వరలోనే ఏర్పాటు చేస్తాం

మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇచ్చాయి. జిల్లాలోని రూరల్ ప్రాంతంలో ఐదు చోట్ల నెలకొల్పేందుకు అనువైన స్థలాలు చూస్తున్నాం. వాటిని గుర్తించగానే అర్హులైన మహిళా సంఘాలను ఎంపిక చేసి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. ఇతర యూనిట్లను సైతం నెలకొల్పి మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తాం.

–సాంబశివరావు, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి

కరెంటు మీటర్ రీడింగ్‌పై అపోహలొద్దు

ముషారఫ్ ఫరూఖీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రతినెలా 30/31 రోజులకు జారీ చేయాల్సిన విద్యుత్ బిల్లు కొన్ని సందర్భాల్లో సిబ్బంది రెండు మూడు రోజుల ఆలస్యంగా రీడింగ్ తీస్తుంటారు. దీని వల్ల ఆ నెలలో వినియోగించిన యూనిట్లు పెరిగి స్లాబ్ రేటు మారడంతో అధిక బిల్లులు వస్తున్నాయని కొందరు వినియోగదారుల్లో అపోహ ఉంది. వినియోగదారులు నష్టపోవద్దనే రీడింగ్ తీసిన రోజులతో సంబంధం లేకుండా కేవలం నెల రోజులకే బిల్లులు జారీ చేసేలా స్పాట్ బిల్లింగ్ మెషీన్‌లో ఏర్పాటు చేసినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ వినియోగదారుల విద్యుత్ వాడకం బిల్లు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ వెబ్‌సైట్‌లో https://tgsouthernpower.orgలో ఎనర్జీ చార్జెస్ క్యాలికులేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసును అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. ఈ క్యాలికులేటర్‌లో తమ బిల్లులోని రీడింగ్ తేదీలు, మీటర్ రీడింగ్ వివరాల నమోదు ద్వారా బిల్లింగ్ రోజులు, టారిఫ్ వంటి వివరాలు పొందొచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయ వర్సిటీ సందర్శించిన థాయ్‌లాండ్ ప్రొఫెసర్లు



వ్యవసాయ వర్సిటీ అధికారులతో థాయిలాండ్ ప్రొఫెసర్లు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని థాయ్‌లాండ్‌కు చెందిన స్కూల్ ఆఫ్ ఆగ్రో ఇండస్ట్రీ ఆఫ్ మేఫా యునివర్సిటీ ప్రొఫెసర్లు బుధవారం సందర్శించారు. రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి, ఇతర అధికారులతో సమావేశమై మేఫా వర్సిటీ అకడమిక్ కార్యక్రమాల గురించి వివరించారు. పండ్లు, కూరగాయల పంటకోత అనంతర టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ వంటి అంశాలతోపాటు విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్స్ గురించి చర్చించారు. ఇరు వర్సిటీలు పరస్పర సహకారంతో కలిసి పనిచేయాల్సిన అంశాలను గుర్తించారు. సమావేశంలో ఇక్రిశాట్‌కు చెందిన ఇన్నోవేషన్ డిజిటల్ అగ్రికల్చర్ హెడ్ డాక్టర్ ఆర్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 27, జూన్, 2024

అందుబాటులోకి పెట్ క్రిమటోరియంలు | సంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు | రూ. 2500 ఫీజు చెల్లిస్తే చాలు

డయల్ చేస్తే ఇంటికే అంతిమయాత్ర వాహనం

అల్లారుముద్దుగా పెంచుకున్న పెంపుడు కుక్కలు మృతి చెందితే వాటి అంతిమ సంస్కారాలు ఎలా చేయాలా అని యజమానులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా పెంపుడు శునకాలు, ఇతర పెంపుడు జంతువులను ఖననం చేయడం, దహన సంస్కారాలు చేయడానికో స్థలం లేక నగరజంతు ప్రేమికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అపార్ట్‌మెంట్, విల్లా కల్చర్ వచ్చాక పెంపుడు శునకాలను ఖననం చేసేందుకు మరుభూమి లేక ఇబ్బందులు పడుతున్న కష్టకాలంలో జీహెచ్‌ఎంసీ, పీపుల్ ఫర్ ఎనిమల్స్ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. ఎవరైనా తమ ఇంట్లో పెంపుడు కుక్క మృతి చెందితే దానికి గౌరవప్రదంగా అంతిమయాత్ర నిర్వహించడం, అంతకుమించి మర్యాదపూర్వకమైన దహన సంస్కారాలు చేయడం అందుబాటులోకి వచ్చింది. ఆ వివరాలు తెలుసుకుందాం.. – బంజారాహిల్స్

pet లాస్ట్ సెట్

జంతువులకూ దహన సంస్కారాలు



నగరంలో జంతు ప్రేమికులు చాలా మందే ఉన్నారు.. వారు అల్లారు ముద్దుగా పెంచుకున్న జంతువులు మృతి చెందితే తీసుకెళ్లి ఎక్కడో పడేయకుండా సంప్రదాయబద్ధంగా శునకాలు, ఇతర జంతువులకు కూడా దహన సంస్కారాలు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పీపుల్ ఫర్ ఎనిమల్స్(పీఎఫ్‌ఏ) సంయుక్తంగా డోర్ టూ టూర్ క్రిమేషన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. పెంపుడు జంతువుల యజమానులకు ఇదొక శుభవార్త అనే చెప్పాలి. ఇంటికే వచ్చి మృతి చెందిన శునకాన్నో, ఇతర పెంపుడు జంతువునో ప్రత్యేకంగా అలంకరించిన అంతిమయాత్ర వాహనంలో వలంటీర్లు సంప్రదాయబద్ధంగా తీసుకెళ్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పీఎఫ్‌ఏ ప్రత్యేక వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చి ఫోన్ చేస్తే చాలు ఇంటికే వచ్చి పెట్ మృతదేహాన్ని ఫతుల్లాగూడలోని క్రిమేషన్‌కు తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రూ.2,500 దూరాన్ని బట్టి ఫీజుగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఫతుల్లాగూడలో మాత్రమే అందుబాటులో ఉన్న పెట్ క్రిమేషన్ త్వరలోనే గాజుల రామారం, గోపన్‌పల్లిలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



డిసెంబర్ 2022 నుంచే..

ఫతుల్లాగూడలో ఈ సౌకర్యం 2022 డిసెంబర్ నుంచే అందుబాటులోకి వచ్చింది. చాలా మంది తమ ఇంట్లో కుక్కలు చనిపోతే ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియక కన్నీరు మున్నీరవుతూ బాధపడుతుండటాన్ని గమనించిన పీఎఫ్‌ఏ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం వలంటీర్లను కూడా నియమించింది.

డయల్ చేయాల్సిన నంబర్లు..

జంతు ప్రేమికులు తమ ఇళ్లలో పెంపుడు శునకం మృతి చెందితే 73374 50643, 95055 37388 నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రత్యేకంగా అలంకరించిన అంతిమయాత్ర వాహనంలో వలంటీర్లు క్రిమేషన్‌కు తీసుకెళ్తారు. దహన సంస్కారాల తర్వాత ఆ బూడిదను ప్రత్యేకంగా ఓ కుండీలో ఉంచి సంబంధిత యజమానులకు అందజేస్తారు. ఆ బూడిదను ఇళ్లలో ఉన్న మొక్కల వద్దకానీ, తమ స్వగ్రామాల్లో కానీ, మరే ఇతర ప్రాంతాల్లో ఉన్న మొక్కలు, చెట్ల వద్ద అయినా పూడ్చిపెడితే సరిపోతుందని సూచిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ త్వరలోనే ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లలో కూడా పెట్ క్రిమటోరియంలను నిర్మించే ప్రతిపాదనకు శ్రీకారం చుట్టింది.



ఒక్క ఫోన్ చేస్తే.. చాలు..

ఎక్కడైనా పెంపుడు జంతువు మృతి చెందిందని యజమానులు ఫోన్ చేయగానే ఆ వలంటీర్లు అక్కడ వాలిపోతారు. క్రిమటోరియంకు ఆ శునకాన్ని తీసుకొచ్చి పూలదండలు వేసి సంప్రదాయబద్ధంగా దహనం చేస్తాం. అనంతరం భస్మాన్ని కుండల్లో భద్రపరిచి యజమానులకు అందిస్తున్నాం. గ్యాస్‌తో నడుస్తున్న ఈ క్రిమటోరియం వల్ల ఎలాంటి కాలుష్యం వెలువడదు. ఎవరికీ ఇబ్బందులు లేని పరిస్థితుల్లో ఈ క్రిమటోరియం నిర్మించడం జరిగింది.

– వాసంతి వాడి, ఫౌండర్ ప్రెసిడెంట్ పీఎఫ్‌ఏ

గ్యాస్‌తో నడిచే క్రిమటోరియం...



ప్రస్తుతం ఫతుల్లాగూడలో అనంతయాత్ర పేరుతో పెట్ క్రిమటోరియంను నిర్వహిస్తున్నాం. త్వరలో మరిన్ని అందుబాటులోకి తీసుకురానున్నాం. ప్రతి నెలా 25 వరకూ శునకాలకు మర్యాదపూర్వకమైన, సంప్రదాయబద్ధ దహన సంస్కారాలు నిర్వహిస్తున్నాం. మా వద్ద ఇందుకోసం అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాం. 14 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు. వలంటీర్లు కూడా అంకితభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్‌తో ఈ క్రిమటోరియం నిర్వహిస్తున్నాం. ఇకో ఫ్రెండ్లీ క్రిమటోరియంను నడిపిస్తున్నాం.

– దత్తాత్రేయ జోషి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పీఎఫ్‌ఏ



రూ.80 లక్షలతో మహదేవ్‌పురం పెట్ క్రిమటోరియం



కూకట్‌పల్లి సమీపంలోని మహదేవ్‌పురం సిక్ బస్తీ దగ్గర రూ.80 లక్షల వ్యయంతో పెట్ క్రిమటోరియం నిర్మించారు. ఇది ఇంకా అందుబాటులోకి రాలేదు. ఏ ఎన్జీవోకు ఇవ్వాలన్నదానిపై టెండర్ పిలుస్తారు. ఇది అందుబాటులోకి వస్తే చాలా మంది జంతు ప్రేమికులకు తమ ఇంట్లో చనిపోయే పెంపుడు కుక్కల దహన సంస్కారాలు గౌరవ ప్రదమైన వాతావరణంలో నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎ.లింగస్వామి, వెటర్నరీ ఆఫీసర్ జీహెచ్‌ఎంసీ

పచ్చని చెట్ల కిందే ఐటీ ఉద్యోగుల జాబ్ | చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం | హైస్పీడ్ ఇంటర్నెట్, మీటింగ్ హాల్స్ సదుపాయం | వారాంతంలో కుటుంబంతో కలిసి అక్కడే ఎంజాయ్

'కలెక్టివ్ ఫామింగ్ గేటెడ్ కమ్యూనిటీ'లతో కొత్త ట్రెండ్

“ఐటీ జాబ్ అంటే వరుస మీటింగ్‌లు, టార్గెట్లతో బిజీబిజీ.. వీకెండ్ వస్తే తప్ప వ్యక్తిగత జీవితానికీ, కుటుంబానికీ టైం ఇవ్వలేని పరిస్థితి. అలా కాకుండా ఉద్యోగమే పచ్చని చెట్ల కింద, చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం, జీవ వైవిధ్యం మధ్యలో ఉంటే.. ఎంత బాగుంటుందో కదూ! అవును.. అచ్చం అలాంటి వాతావరణాన్నే కోరుకుంటున్నారు నేటి యువ ఐటీ ఉద్యోగులు, ఎంటర్‌ప్రెన్యూర్స్. వీరి అభిరుచికి తగ్గట్టుగానే పలు నిర్మాణ సంస్థలు 'కలెక్టివ్ ఫామింగ్ గేటెడ్ కమ్యూనిటీ'లకు శ్రీకారం చుట్టాయి. ఈ నయా ట్రెండ్ గురించే ఈ కథనం.. – సాక్షి, సిటీబ్యూరో”



ఐటీ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ఫామ్‌లో..

నేచర్‌లో వర్క్

కాలుష్యానికి దూరంగా.. ఆరోగ్యానికి దగ్గరగా

నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ అపార్ట్‌మెంట్లతో జనసాంద్రత పెరిగిపోతుంది. దీంతో రోడ్లు, నీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. అత్యాధునిక వసతులున్న లగ్జరీ కమ్యూనిటీల్లో నివాసం ఉంటున్నా సరే నాణ్యమైన జీవితం గగనమైపోతోంది. పచ్చని ప్రకృతిలో, స్వచ్ఛమైన గాలి పీల్చలేని పరిస్థితి. ప్రస్తుత జనాభా అవసరాలకు వెడల్పాటి రోడ్లు వేసినా.. కొన్నేళ్లకు పెరిగే జనాభా, వాహనాల రద్దీకి అవి ఇరుకుగా మారిపోతున్నాయి. పోనీ, నగరానికి కాస్త దూరంగా విశాలమైన స్థలంలో వీకెండ్ హోమ్ లేదా ఫామ్ హౌస్ సొంతంగా కట్టుకోవాలన్నా, దాన్ని నిరంతరం నిర్వహణ చేయాలన్నా కష్టంతో కూడుకున్న పని. దీనికి పరిష్కారంగా కొందరు డెవలపర్లు 'కలెక్టివ్ ఫామింగ్ గేటెడ్ కమ్యూనిటీ' ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారు.



70 శాతం ఐటీ ఉద్యోగులే..

ఇదీ ప్రత్యేకత..

కరోనాతో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకే గదిలో గంటల కొద్దీ కంప్యూటర్ ముందు కూర్చొని పని చేయడం బోర్ కొట్టేసింది. దీంతో ఉద్యోగస్తులకు అనారోగ్య సమస్యలతో పాటు కంపెనీలకు ఉత్పాదకత తగ్గుతోంది. దీంతో ఇప్పుడు నగరంలో వర్క్ ఫ్రం ఫామ్ కల్చర్ హల్‌చల్ చేస్తోంది. పచ్చని ప్రకృతిలో నివాసం, అక్కడి నుంచే ఉద్యోగం చేసుకునేందుకు వీలుగా ఆధునిక ఏర్పాట్లు ఉండటమే వీటి ప్రత్యేకత. సాధ్యమైనంత వరకూ పచ్చని చెట్లు, జీవ వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, కొద్దిపాటి స్థలంలోనే నిర్మాణాలుంటాయి. రోడ్డు కనెక్టివిటీ బాగున్న ప్రాంతాలను ఎంచుకొని కాలుష్యానికి దూరంగా, ఆరోగ్యానికి దగ్గరగా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తున్నారు.



టీమ్ మీటింగ్ హాలు

చేవెళ్ల, షాద్‌నగర్, శామీర్‌పేట, శంషాబాద్, ఘట్‌కేసర్, హయత్‌నగర్ వంటి నగరం నలువైపులా ఈ తరహా ప్రాజెక్టులను చేపడుతున్నారు. వీటిల్లో గృహాలు 600 గజాల నుంచి 1,800 గజాల మధ్య ఉంటాయి. 70 శాతం మంది ఐటీ ఉద్యోగులే ఉంటున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బహుళ జాతి కంపెనీలకు చెందిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు కస్టమర్లుగా ఉన్నారు.

ఇంటర్నెట్, మీటింగ్ రూమ్‌లు..

ప్రత్యేకంగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వ్యవస్థతో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుంది. ఉద్యోగులకు విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు, సౌర విద్యుత్ ఏర్పాట్లు కూడా ఉంటాయి. బృంద చర్చల కోసం 10–20 మంది కూర్చునేందుకు వీలుగా కాన్ఫరెన్స్ హాల్, బోర్డ్ రూమ్స్ ఉంటాయి. నేటి యువతరానికి అవసరమైన స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి సదుపాయాలు కూడా ఉంటాయి.



వర్క్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రచ్చబండలతో సోషల్ బంధం..

వేప, రావి వంటి చెట్లతో పాటు ఆకు కూరలు, కూరగాయలతో పాటు వ్యవసాయం కూడా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌ల లోపలికి ఓనర్లకైనా సరే వాహనాలకు ప్రవేశం ఉండదు. అత్యవసర వెహికిల్స్‌కు మినహా ప్రధాన ద్వారం వద్దే వాహనాలను పార్కింగ్ చేసి, అక్కడ ఉన్న ఎలక్ట్రిక్ బగ్గీలో ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. అలా నడుచుకుంటూ వెళ్తుంటూ దారికి ఇరువైపులా కనుచూపుమేర పచ్చని గడ్డితో ల్యాండ్ స్కేపింగ్ ఉంటుంది. చిన్న కొలనులో సందడి చేసే బాతులు, కొంగలు, పిచ్చుకల కిలకిలలు, తుమ్మెదలు, సీతాకోక చిలుకల సందడితో కనువిందుగా ఉంటుంది. పాత తరహాలో ఇంటి పక్కనే రచ్చబండలుంటాయి. దీంతో ఇరుగుపొరుగు వారితో సోషల్ బంధం పెరుగుతుంది.





స్థానికులకు ఉపాధి..



వీకెండ్‌లో మాత్రమే వచ్చే కస్టమర్ల గృహాలను మిగిలిన రోజుల్లో నిర్వహణ అంతా కమ్యూనిటీయే చూసుకుంటుంది. గార్డెనింగ్, వంట వాళ్లు అందరూ స్థానిక గ్రామస్తులనే నియమించుకోవడంతో వారికీ ఉపాధి కల్పించినట్లవుతుంది.

– నగేష్ కుమార్, ఎండీ, ఆర్గానో

ఈ వాతావరణం బాగుంది



ప్రతిరోజూ ట్రాఫిక్ చిక్కుల్లో నరకం అనుభవిస్తూ ఆఫీసుకు వెళ్లే సరికి అలసిపోయినట్లు అయిపోతోంది. దీంతో ఏకాగ్రత తగ్గిపోతోంది. ఈ ప్రాజెక్ట్‌కు వచ్చాక ఆహ్లాదకర వాతావరణంలో పనిచేయడం చాలా బాగుంది. ఉత్పాదకత పెరిగింది.

– సీహెచ్ శ్రీనివాస్, ఫార్మా ఉద్యోగి

ప్రతీది ఇక్కడే అందుబాటులో..



శివారు ప్రాంతంలో ప్రాజెక్ట్ అంటే మొదట్లో భయమనిపించినా ఇక్కడికి వచ్చాకే తెలిసింది ప్రతి ఒక్కటీ ఇక్కడే అందుబాటులో ఉంది. సేంద్రీయ ఆహార ఉత్పత్తులతో నిత్యావసరాలు, మినీ థియేటర్ వంటి అన్ని రకాల సదుపాయాలున్నాయి. పైగా స్వచ్ఛమైన గాలి, వెలుతురు, చుట్టూ పచ్చని ప్రకృతితో ఎంతో ఆనందంగా ఉంది.

– చిందె స్వాతి, గృహిణి

టీనేజర్ల రక్షణ కోసం సరికొత్తగా స్నాప్‌చాట్

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ నేరాలకు టీనేజర్లు బాధితులుగా మారకుండా చూసేందుకు ప్రముఖ వ్యక్తిగత సంబంధాల యాప్.. స్నాప్‌చాట్ కొత్త ఫీచర్లను జత చేసింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఓ సమావేశంలో తెలిపారు. నిజమైన స్నేహాలను బలోపేతం చేస్తూ హానికరమైన సంబంధాలను అరికట్టే దిశగా ఇవి రూపొందాయని, బ్లాకింగ్ కేపబులిటీస్‌ను అభివృద్ధి చేయడం, లొకేషన్ షేరింగ్‌ను సరళీకృతం చేయడం, స్నేహబంధాల రక్షణ టూల్స్‌ను విస్తరించడం, ఇన్–చాట్ వార్నింగ్స్‌ను పెంచడం.. వంటి మార్పు చేర్పులతో ఫీచర్లు జత చేశామని వివరించారు. ఈ సందర్భంగా టీన్ ఆన్‌లైన్ సేఫ్టీపై ఏర్పాటు చేసిన ప్యానెల్ చర్చలో నటి, స్నాప్ స్టార్ నితాన్షి గోయెల్, యంగ్ లీడర్స్ ఫర్ యాక్టివ్ సిటిజన్‌షిప్(వైఎల్‌ఏసి) సహ వ్యవస్థాపకులు అపరాజితా భర్తి, స్నాప్ పబ్లిక్ పాలసీ హెడ్ ఉత్తరా గణేష్ పాల్గొన్నారు.



28 నుంచి 'బ్యాటిల్ గ్రౌండ్స్' గ్రాండ్ ఫినాలే

ఆన్‌లైన్ గేమర్స్‌ను వరించనున్న రూ. 2 కోట్ల ప్రైజ్ మనీ



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో ప్రతిష్టాత్మకమైన 'బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా సిరీస్ 2024'(బీజీఐఎస్) గ్రాండ్ ఫినాలేకు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. క్రాఫ్టన్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా గ్రాండ్ ఫినాలే ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనుంది. దేశంలోనే అతిపెద్దదైన ఈ రాయల్ ఎస్పోర్ట్స్ ఇండియా సిరీస్ టోర్నమెంట్‌లో రూ.2 కోట్ల ప్రైజ్ మనీ అందించడం విశేషం. దేశంలోని యువ ఆటగాళ్లతో కూడిన చివరి 16 అగ్రశ్రేణి జట్లు చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకోవడానికి ఆన్‌లైన్ రౌండ్‌లలో పోటీ పడనున్నారు. గేమింగ్ ఔత్సాహికులు ఈ సిరీస్‌ను ప్రత్యక్షంగానే కాకుండా క్రాఫ్టన్ ఇండియా ఈ–స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్‌లో వీక్షించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

గోడలకు వేలాడే సంగీతం

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అలనాటి సామెతల్ని కొత్తగా నిర్వచిస్తోంది. గోడలకూ చెవులుంటాయని పెద్దలు చెబితే.. గోడల నుంచి సుస్వరాలు వినిపిస్తాయని సరికొత్త మ్యూజిక్ ఫ్రేమ్స్ నిరూపిస్తున్నాయి. గోడకు ఫొటో ఫ్రేమ్స్‌లానే తమ మ్యూజిక్ ఫ్రేమ్‌ను కూడా వేలాడదీస్తే ఇష్టమైన సంగీతాన్ని ఆస్వాదించవచ్చని అంటోంది ప్రసిద్ధ గృహోపకరణాల బ్రాండ్ శామ్‌సంగ్.. తాజాగా ఈ బ్రాండ్ రూపొందించి సిటీ మార్కెట్‌లోకి విడుదల చేసిన ఈ వైర్‌లెస్ మ్యూజిక్ ఫ్రేమ్ ద్వారా వీనులవిందైన సంగీతాన్ని వినడం మాత్రమే కాదు వ్యక్తిగత ఫొటోలు, కళాత్మక చిత్రాలు సైతం పొందుపర్చుకోవచ్చు. డాల్బీ అట్మోస్ వంటి ఫీచర్లతో అందుబాటులోకి వచ్చిన ఈ ఫ్రేమ్.. అందాన్ని పెంచే ఇంటీరియర్‌లా అమరిపోతుందంటున్నారు.



సచివాలయాలతో సమున్నత సేవలు

పాలనలో వైఎస్ జగన్ వినూత్న ఒరవడిపై నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు సదస్సులో నిపుణుల ప్రశంసలు

- 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన వ్యవస్థ ఓ అద్భుతం
- పాలనా వికేంద్రీకరణలో భాగంగా విప్లవాత్మక వ్యవస్థ ఏర్పాటు
- సంక్షేమ ప్రయోజనాలతోపాటు పౌరుల అవసరాలన్నీ తీర్చారు
- గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం
- ప్రతి గ్రామంలోనూ పౌరులందరికీ చేరువైన వ్యవస్థ
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసలు
- గ్రామ, వార్డు సచివాలయాలతో ఎస్‌డీజీ లక్ష్యాల సాధన
- పథకాలు, కార్యక్రమాల అమలుకు యాప్‌లు, అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ
- బాలికల్లో రక్తహీనత నిర్మూలనకు డేటా సేకరణ, క్రోడీకరణ
- ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ



సాక్షి, అమరావతి: పాలకులు తీసుకున్న ఒక్క నిర్ణయం పౌర సేవలు, ప్రభుత్వ పథకాల అమలు స్వరూపాన్నే మార్చేసింది. గ్రామ గ్రామాన సరికొత్త చిత్రం ఆవిష్కృతమైంది. పల్లె రూపురేఖలే మారిపోయాయి. విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు సాకారమయ్యాయి. ఎక్కడా లంచాలు, వివక్ష, పడిగాపులకు తావులేకుండా పారదర్శకంగా ప్రతి ఇంటికీ ప్రయోజనాలను అందచేసింది. గ్రామం నుంచి కదలాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగాన్నే పల్లె చెంతకు తీసుకొచ్చింది. దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో సాకారమైన విప్లవాత్మక మార్పులివి. నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు నిర్వహించిన సంయుక్త సదస్సు ఈ అంశాలను ప్రముఖంగా ప్రస్తావించడం గమనార్హం. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ అద్భుతమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసించారు. ఇంటింటికీ పౌర సేవలు, అర్హులకు సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ అద్భుతంగా పని చేస్తోందని, ప్రధానంగా నీతి ఆయోగ్ నిర్దేశించిన ఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి) లక్ష్యాల సాధనకు సచివాలయాలతో క్షేత్రస్థాయి నుంచి కృషి చేశారని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ఆవిష్కరణ డేటా ఆధారిత పాలన, ప్రణాళికల కోసం డేటా సేకరణపై ఇటీవల లక్నోలో నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు సంయుక్త సదస్సు నిర్వహించాయి. డేటాను నాలెడ్జ్‌గా మార్చడం, 2047 భారత్ విజన్ లక్ష్యాలను సాధించడం, డేటాను పరిపాలనలో వినియోగించడం తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలపై చర్చాగోష్ఠి నిర్వహించారు. సదస్సులో నీతి ఆయోగ్, ప్రపంచబ్యాంకుతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని ఆయా రాష్ట్రాల్లోని ఆవిష్కరణలపై ప్రముఖంగా చర్చించారు.

ప్రతి పౌరుడికీ అందుబాటులో సేవలు..

సమగ్ర డేటా సేకరణ ద్వారా పాలనను మెరుగుపరిచే లక్ష్యంతో 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ప్రారంభించిందని, పాలన వికేంద్రీకరణలో భాగంగా తెచ్చిన ఈ వ్యవస్థ అద్భుతమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనను వికేంద్రీకరించడంతోపాటు విధాన రూపకర్తలకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు గ్రామాలు, వార్డులలో ఆధునిక పరిజ్ఞానంతో సౌకర్యాలు కల్పించారన్నారు. ఏపీలోని ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడికీ ఈ వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్లు, నెలవారీ కేటాయింపులు లాంటి సంక్షేమ ప్రయోజనాలను అందజేయడంతోపాటు పౌరుల అవసరాలను గుర్తించి తీర్చుతున్నట్లు తెలిపారు. పరిపాలనాపరమైన ఫిర్యాదులను సింగిల్ విండో వ్యవస్థ ద్వారా పరిష్కరిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం వివిధ టెక్ పోర్టల్‌లను ఏర్పాటు చేయడం వల్ల పైస్థాయి నుంచి కింద స్థాయి వరకు పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేసే వెసులుబాటు కలిగిందన్నారు. విప్లవాత్మక పాలనలో భాగంగా డేటా సేకరణ, క్రోడీకరణ, మార్పిడి ద్వారా సచివాలయాల వ్యవస్థతో ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలను అమలు చేశారన్నారు. నీతి ఆయోగ్ రూపొందించిన 116 సూచికల ఆధారంగా 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సచివాలయాల వ్యవస్థ దోహదం చేసిందని అభినందించారు. అన్ని పోర్టల్‌లలో డేటాను సేకరించడంతో పాటు విశ్లేషించి మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. పాఠశాలలకు వెళ్లే బాలికల్లో రక్తహీనత నిర్మూలన లాంటి సామాజిక లక్ష్యాలతో పాటు బడికి దూరమైన పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పడం లాంటి వాటిని సచివాలయాల వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా అమలు చేసిందని ప్రస్తావించారు.

ఎస్‌డీజీ లక్ష్యాల సాధన..

నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో పటిష్ఠ వ్యవస్థను తెచ్చిందని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమైన డేటా సేకరణ, విశ్లేషణ గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచే జరుగుతోందన్నారు. పథకాలు, కార్యక్రమాల అమలుకు యాప్‌లు తీసుకొచ్చి అన్ని స్థాయిల్లో పకడ్బందీగా పర్యవేక్షించారన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి పౌరుల అవసరాలను తీర్చడం, గ్రామంలోనే సేవలు అందించడం లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రారంభించిందన్నారు. అవి సింగిల్ విండో విధానం ద్వారా పంచాయతీలు, స్థానిక సంస్థలకు సహాయ విభాగంగా పనిచేయడంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. సచివాలయాల స్థాయిలోనే పౌరుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకు సచివాలయాల వ్యవస్థ టెక్ పోర్టల్‌తో బలమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉందన్నారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనలో భాగంగా ఆరోగ్యం, విద్య సంబంధిత కార్యక్రమాలను గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాల పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ డాష్ బోర్డ్ ఏర్పాటైందని, వీటన్నింటినీ ప్రతిబింబించేలా రాష్ట్ర స్థాయి డేటా రూపొందించడం కార్యక్రమాలు విజయవంతంగా అమలుకు దోహదం చేసిందన్నారు. అన్ని స్థాయిల్లో అధికారులు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. బాలికలలో రక్తహీనత నిర్మూలనకు విద్యాసంస్థల్లో డేటాను సేకరించి సంబంధిత విభాగాల ద్వారా క్రోడీకరించారని తెలిపారు. వలంటీర్ల ద్వారా భారీ సర్వేతో బడికి దూరమైన పిల్లల డేటాను సేకరించడంతోపాటు తిరిగి స్కూళ్లకు వెళ్లేలా ప్రోత్సహిస్తూ విద్యార్థి సమాచార పోర్టల్‌ను నిర్వహిస్తున్నారన్నారు. నవశకం ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులను పారదర్శకంగా గుర్తించి క్రోడీకరించిన లబ్ధిదారుల డేటాతో పోర్టల్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు.

పిన్నెల్లి అరెస్టు

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు



పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తీసుకువచ్చిన పోలీసులు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి ఆయనపై నమోదు చేసిన కేసుల్లో అరెస్టు చేశారు. పిన్నెల్లి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం తోసిపుచ్చింది. ఆ వెంటనే పోలీసులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ఉంటున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేశారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు. రాత్రి 8 గంటల సమయంలో నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం తిరిగి పల్నాడు ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ఆయన్ని ఎస్పీ కార్యాలయంలోనే ఉంచారు. ముందు జాగ్రత్తగా ఎస్పీ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి మీడియా ప్రతినిధులతో సహా ఎవర్నీ అనుమతించలేదు. పిన్నెల్లిని అర్ధరాత్రి దాటిన తర్వాత మాచర్ల కోర్టుకు తరలించి, అక్కడ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలో మాచర్ల పట్టణాన్ని కూడా పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. కోర్టు పరిసరాల్లో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతలపై యథాతథస్థితి

ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఏపీవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల కూల్చివేతకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రలకు హైకోర్టు బ్రేకులు వేసింది. వైఎస్సార్‌సీపీ కార్యాలయాల విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. వైఎస్సార్‌సీపీ కార్యాలయాల భవనాల కూల్చివేతలపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తాము చట్టానికి అనుగుణంగా వ్యవహరిస్తామని, కోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ అడ్వొకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు పదే పదే చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం విషయంలో కూడా చట్టాన్ని అనుసరిస్తామంటూ కోర్టుకు స్పష్టమైన హామీ ఇచ్చి తెల్లారేసరికి పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు, చట్ట ప్రకారం నడుచుకుంటామన్న ప్రభుత్వ న్యాయవాదుల వాదనను విశ్వసించలేదు. యథాతథస్థితిని కొనసాగించాలన్న తన ఉత్తర్వులకే కట్టుబడింది. వివిధ జిల్లాల్లో తమ పార్టీ కార్యాలయాలను కూల్చివేసేందుకు అధికారులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

సెక్రటేరియట్ సీఎస్‌ఓగా అడిషనల్ కమాండెంట్ గంగారాం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం సీఎస్‌ఓ (చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్)గా టీజీఎస్పీ మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ టి.గంగారాం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం సీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న టీజీఎస్పీ 17వ బెటాలియన్ కమాండెంట్ ఏకే మిశ్రాను ఇబ్రహీంపట్నం మూడో బెటాలియన్‌కు అటాచ్ చేశారు. మిశ్రా నుంచి సీఎస్‌ఓగా వెంటనే బాధ్యతలు తీసుకోవాలని గంగారాంను ఆదేశిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సీఎస్‌ఓగా పూర్తి బాధ్యతలు నిర్వర్తించాలని అందులో స్పష్టం చేశారు.

'వన్యప్రాణుల వేటను సహించబోం'

సాక్షి, హైదరాబాద్: వన్యప్రాణులను చంపడం/వేటాడటం వంటి చట్టవిరుద్ధమైన పనులు ఎవరు చేసినా సహించబోమని వైల్డ్ లైఫ్ చీఫ్ ఎంసీ పర్గెయిన్ హెచ్చరించారు. వన్యప్రాణుల వేటను అడ్డుకోవడం అటవీ అధికారులకు సవాల్‌గా మారుతోందన్నారు. వేటగాళ్ల ప్రయత్నాలను నిరోధించేందుకు 2023 డిసెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటెన్సివ్ ప్రివెంటివ్ డ్రైవ్ 'క్యాచ్ ది ట్రాప్'ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా అటవీ సిబ్బంది వీలైనన్ని ప్రాంతాలు తిరిగి, వేటకు సంబంధించి గత రికార్డులలో ఉన్న వ్యక్తులను, అనుమానితులను విచారించి, వేట కోసం వారు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకుంటారని చెప్పారు. బుధవారం మహవీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేటగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న భారీ వేట సామాగ్రిని ప్రదర్శించారు.

ఆ దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి



శిల్పారెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని బీజేపీ మహిళా మోర్చా డిమాండ్ చేసింది. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయ ప్రధాన గేటును తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. 'మహిళలకు న్యాయంజరగాలి.. కాంగ్రెస్ డౌన్ డౌన్'అంటూ నినాదాలు చేశారు. కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి గోషామహల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగు తున్నాయని ఆరోపించారు. ఒక మహిళపై అత్యాచారం జరిగినా పట్టించుకోలేదని, బీజేపీ నేతలు వెళ్లిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి పరామర్శించారని విమర్శించారు.

కట్టుదిట్టంగా మాదక ద్రవ్యాల నిరోధం

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జూపల్లి, సీతక్క. చిత్రంలో డీజీపీ రవిగుప్తా, సుమన్, తేజ సజ్జ

మాదాపూర్: (హైదరాబాద్): తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో బుధవారం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమో.. అంతకంటే డ్రగ్స్‌తో ఎక్కువ ముప్పు ఉందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా గంజాయి, డ్రగ్స్ ఎక్కువగా అందుబాటులో ఉన్నాయని.. అవి సరఫరా చేస్తున్న వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు జారీ చేసిందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టి జీవిత ఖైదీలను చేయనున్నట్టు తెలిపారు. మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించేందుకు బ్రోచర్లు, పాటలు, వీడియోను విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ రవిగుప్తా, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి, నార్కోటిక్స్ విభాగం సందీప్ శాండిల్య, క్రీడాకారిణి మిథాలీరాజ్, నటుడు తేజ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

విపక్షంలో పెద్ద పార్టీకే ప్రధాన ప్రతిపక్ష హోదా

కేంద్ర, రాష్ట్ర చట్టాలు చెబుతున్నది అదే

- 10 శాతం సీట్లు ఉంటేనే ఆ హోదా ఇవ్వాలనే నిబంధన ఏ చట్టంలోనూ లేదు
- లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి స్పష్టీకరణ
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 3 సీట్లే వచ్చినా ప్రధాన విపక్షంగానే గుర్తింపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బెనిఫిట్స్ దశలవారీగా చెల్లిస్తాం

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ తీపి కబురు చెప్పింది. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సి ఉండి, వివిధ కారణాలతో చెల్లింపు నిలిచిపోయిన ఆర్థిక ప్రయోజనాలను త్వరలో విడతల వారీగా చెల్లిస్తామని ప్రకటించింది. రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన వివిధ బెనిఫిట్స్ నెలలుగా నిలిచిపోయిన తీరును వివరిస్తూ ''బొకే ఇచ్చి బైబై'' శీర్షికతో బుధవారం 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన ఆర్టీసీ, ఆగిపోయిన బెనిఫిట్స్ చెల్లింపును త్వరలో పునరుద్ధరిస్తామని, దశలవారీగా ఆయా ఆర్థిక ప్రయోజనాల మొత్తాన్ని పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందిస్తామని పేర్కొంది. గ్రాట్యుటీని గత మార్చి వరకు పదవీ విరమణ పొందిన వారికి అందించామని, ఏప్రిల్, మే నెలల్లో రిటైర్ అయిన ఉద్యోగులకు త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించింది. రిటైర్మెంట్ చివరి నెల వేతనాన్ని మార్చి నెల వరకు పదవీ విరమణ పొందిన వారికి చెల్లించామని, ఏప్రిల్, మే నెలల్లో రిటైర్ అయిన వారికి సంబంధించిన వివరాలను ఆడిట్‌కు పంపామని తెలిపింది. బాండ్ల బకాయిలను చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొంది. కొందరు ఉద్యోగుల వద్ద బాండ్లు లేకపోవటం, డెబిట్‌ల క్లియరెన్స్‌లో సాంకేతిక సమస్యల వల్ల కొంత జాప్యం జరిగిందని వెల్లడించింది. ఆర్థిక పరిస్థితిని బట్టి ఆర్జిత సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్ మొత్తం, కరువు భత్యం బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. డేటా ఫీడింగ్, ఆప్షన్ దరఖాస్తుల జారీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు వివరించింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అన్ని రకాల ప్రయోజనాల లబ్ధి అందించేందుకు కట్టుబడి ఉన్నట్టు ఆర్టీసీ ప్రకటన రూపంలో వెల్లడించింది.

విలువలే కాదు.. తప్పులూ సవరణ..!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విలువలను నమోదు చేస్తుంది. ఇందులో ఫామ్-1, 2ల కింద రాష్ట్రంలోని వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువలను నమోదు చేస్తుంది. ఫామ్-3 కింద గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు, ఫామ్-4 కింద జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనే ఉన్న వ్యవసాయ భూముల విలువలను నమోదు చేస్తుంది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన విలువల సవరణ ప్రక్రియలో భాగంగా ఫామ్-1,2,3ల నమోదు పూర్తయిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెపుతున్నాయి. ప్రస్తుతం ఫామ్-4 కింద హైవేల పక్కన ఉన్న వ్యవసాయ భూముల విలువలను నమోదు చేసే పని జరుగుతోంది. ఇందు కోసం రెవెన్యూ వర్గాల నుంచి సర్వే నంబర్ల వారీ వివరాలు తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్లు పనిలో పనిగా తప్పులు సవరించే పనిని కూడా ప్రారంభించారు. వ్యవసాయ భూమి గజాలుగా నమోదైన సర్వే నంబర్లను మళ్లీ ఎకరాల్లోకి మారుస్తున్నారు.

ఆధ్యాత్మిక, భక్తి ప్రసారాల కోసం ప్రభుత్వ చానల్

- అధికారులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం
- హైదరాబాద్ బోనాల జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు
- అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు ఇబ్బంది పడొద్దు
- వచ్చే నెల 5లోగా పనులు పూర్తి చేయాలని సూచన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కొండా సురేఖ. చిత్రంలో మంత్రి పొన్నం, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ పరిధిలో ఆధ్యాత్మిక, భక్తి సంబంధిత ప్రసారాల కోసం ప్రత్యేకంగా ఒక చానల్‌ను తెచ్చే ప్రయత్నాలు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఆషాఢ బోనాల జాతరను గ్రంథస్తం చేయడంతోపాటు డాక్యుమెంటరీని రూపొందించాలని సూచించారు. సినిమా థియేటర్లలో బోనాల జాతరపై యాడ్స్ ప్రసారం చేసేదిశగా సినీ పరిశ్రమతో చర్చించాలన్నారు. ఆషాఢ బోనాల జాతర నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బోనాల సందర్భంగా అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, వచ్చే నెల 5 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర ద్వారాల వద్ద వలంటీర్లను పెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయగలిగేలా ఆలయాల వద్ద పనిచేసే సిబ్బందికి ఆరోగ్య శాఖ శిక్షణ ఇవ్వాలని సూచించారు. బోనాల నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో అదనపు సర్వీసులను నడపడంతోపాటు సమయాన్ని పొడిగించాలని కోరారు.

రూపవతి ఏనుగుపై ఆరా

అమ్మవారి ఘట్టం ఊరేగింపు నిమిత్తం కర్ణాటక నుంచి తెప్పిస్తున్న ఏనుగు (రూపవతి) గురించి మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. జాతరలో ఏనుగు ప్రశాంతంగా ఉండేలా చూడాలని, తగిన విశ్రాంతి ఇవ్వాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. జాతరలో చేపట్టే సాంస్కృతిక ప్రదర్శనల్లో జానపద కళాకారులకు తగిన అవకాశం ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో, అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాలలో నిర్వహించే బోనాల జాతర గురించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డీజీపీ రవి గుప్తా, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు లొంగొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రలోభాలు, ఒత్తిళ్లకు తలొగ్గి పొరపాట్లు చేయొద్దని, బీఆర్‌ఎస్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ పార్టీ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారమే పరమావధిగా పనిచేసే వారికి ప్రజల్లో ఆదరణ ఉండదని గతంలో అనేక పర్యాయాలు నిరూపితమైందన్నారు. తొందరపాటు నిర్ణయాలతో ప్రజా జీవితంలో చెడ్డపేరు తెచ్చుకోవద్దని చెప్పినట్లు సమాచారం. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యేల అభిప్రాయాలు కేసీఆర్ కోరినట్లు తెలిసింది. కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎత్తి చూపే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందంటూ సంకేతాలు ఇచ్చారని సమాచారం.

ఎర్రవల్లికి తరలివస్తున్న నేతలు

ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోరుతున్న నాయకులకు ఎర్రవల్లి నివాసానికి రావాల్సిందిగా ఆహ్వానం అందుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఎర్రవల్లికి వస్తున్నారు. అలాగే పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఇతర ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు కూడా కేసీఆర్‌ను కలుస్తున్నారు. ఆయన ప్రతి ఒక్కరినీ కలుస్తూ వారితో ఫోటోలు దిగుతున్నారు. త్వరలో జిల్లాల వారీగా కేసీఆర్ పర్యటనలు ఉంటాయని, స్థానికంగా బస చేసి కార్యకర్తలను కలుస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ రాష్ట్ర కార్యవర్గం పునర్వ్యవస్థీకరణ, క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు, అన్ని స్థాయిల్లో పార్టీ కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై త్వరలో కేసీఆర్ షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎంఎల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, పార్టీ ముఖ్య నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, సుధీర్‌బాబు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవిగౌడ్, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ తదితరులు కూడా కేసీఆర్‌ను కలిశారు.

వ్యవసాయానికి రూ. 64 వేల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

అవసరాలను వెల్లడించారు. రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు, రైతుభరోసా కోసం రూ.23 వేల కోట్లను ప్రతిపాదించారు. ఈ ఏడాది నుంచి అమలు చేయబోయే పంటల బీమాకు రూ.3 వేల కోట్లు కావాలని పేర్కొన్నారు. దీంతోపాటు రైతుబీమాకు రూ.1,500 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు ప్రతిపాదించారు. వ్యవసాయ అనుబంధ విభాగాల కోసం మిగతా నిధులను కోరారు. ఆయిల్ పామ్ సాగును పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. దానికి దాదాపు వెయ్యి కోట్లు కావాలని కోరినట్టు సమాచారం.

వ్యవసాయ యాంత్రీకరణ కీలకం

గత పదేళ్లుగా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. దీంతో కూలీలు దొరకడం కష్టంగా మారింది. కానీ ప్రభుత్వం నుంచి కనీసం తైవాన్ స్ప్రేయర్ వంటివి కూడా రైతులకు సబ్సిడీపై అందే పరిస్థితి లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. బయట మార్కెట్లో కొనాలంటే.. రైతులు ఆ ధరలు భరించడం కష్టం. కొరత కారణంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెప్తున్నారు. 2018 వరకు ప్రభుత్వం ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై ఇచ్చిందని.. ఆ తర్వాత పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు.

అలక వీడిన జీవన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

తెలిసింది. అధిష్టానం ఆదేశాల మేరకు ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం జీవన్‌రెడ్డిని వెంటబెట్టుకుని ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రాత్రి 7.30 గంటలకు నేరుగా తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌కు చేరుకున్నారు. అక్కడ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో భేటీఅయి అరగంట పాటు మంతనాలు సాగించారు. అనంతరం 8 గంటలకు జీవన్‌రెడ్డిని తోడ్కొని దీపాదాస్, శ్రీధర్‌బాబులు జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లి సుదీర్ఘంగా చర్చించారు.

అండగా నిలిచిన వారిని గుర్తిస్తామన్నారు: జీవన్‌రెడ్డి

ఏ పార్టీకైనా కార్యకర్తలే ముఖ్యమని, కార్యకర్తల మనోభావాలు గుర్తించి, పార్టీకి అండగా నిలిచిన వారిని ప్రాధాన్యమిచ్చి గుర్తిస్తామని కేసీ వేణుగోపాల్ చెప్పారని జీవన్‌రెడ్డి అన్నారు. వేణుగోపాల్‌తో భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఏ పార్టీకైనా కేడర్ ఆత్మగౌరవమే ప్రధానం. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం. పార్టీకి అండగా నిలిచినవారి ఆలోచనలకు అనుగుణంగానే ముందుకెళ్తాం. వారి కృషికి ప్రాధాన్యత ఇస్తామని వేణుగోపాల్ ఇచ్చిన హామీతో సంతృప్తి చెందాను' అని జీవన్‌రెడ్డి తెలిపారు. మారుతున్న రాజకీయ పరిణామాలు, పరిస్థితుల కారణంగా కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదని, అందరికీ కావాల్సింది పార్టీ ఐక్యతే అన్నారు. ఈ భేటీకి చొరవ తీసుకున్న దీపాదాస్ మున్షీ, శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

తలుపులు తెరిచే ఉంటాయి: దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసంతో ఎవరైనా ఎమ్మెల్యే పార్టీలోకి రావాలనుకుంటే పార్టీ తలుపులు తెరిచే ఉంటాయని రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ చెప్పారు. 'కాంగ్రెస్‌లో ఇప్పటికే చాలామంది చేరారు. ఇంకా చాలామంది చేరబోతున్నారు. మా పార్టీలోని కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా కలిసి నడుస్తాం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో పటిష్టంగా నడుస్తోంది' అని అన్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల నియామకం ఉంటుందా అనే ప్రశ్నకు.. 'పిక్చర్ అభీ బాకీ హై (సినిమా ఇంకా ఉంది) త్వరలోనే ఉంటుంది. పీసీసీ అధ్యక్షుడి ఎంపిక అధిష్టానం నిర్ణయం. అసెంబ్లీ, పార్లమెంటులాగా కాలవ్యవధి ఉండదు' అని మున్షీ బదులిచ్చారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది: శ్రీధర్‌బాబు

గత పదేళ్లలో కాంగ్రెస్ పార్టీని చీల్చి, నష్టపరిచి, బలహీనపరిచిన వారే పార్టీ చేరికలపై మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారని, అయితే రాజీనామాలు చేసి రావాలన్న నిబంధనపై పార్టీ ఆలోచన ఏవిధంగా ఉంటుందో చూడాలన్నారు.



ఆస్పత్రిలోని పేద రోగులకు కిచిడీ పంచుతున్న కిరణ్ కామ్దార్

ఆస్పత్రిలోని రోగులు ప్రతి మధ్యాహ్నం ఆమె కోసం ఎదురు చూస్తారు. ఆమె రాకుండా పోదు. మబ్బులు రానీ నిప్పులు కురవనీ వస్తుంది. ముంబై ఆస్పత్రుల్లోని పేద రోగులకు రోజుకు వంద మందికి ఆమె కిచిడీ పంచుతుంది. ఆమె దగ్గర డబ్బు లేదు. మనసు తప్ప. అందుకే ఆమెను అందరూ 'కిచిడీ ఆజి' అని పిలుస్తారు.

కిచిడీ బామ్మ

62 సంవత్సరాల కిరణ్ కామ్దార్ కుదురుగా నిలబడి గాని, కూచునిగాని మాట్లాడలేదు. దానికి కారణం ఐదేళ్ల క్రితం ఆమెకు వచ్చిన పార్కిన్సన్స్ వ్యాధి. కాని ఆమె ఆలోచనలు కుదురుగా ఉన్నాయి. ఆమె సేవా గుణం కుదురుగా ఉంది. దానిని ఎవరూ కదపలేరు.

ముంబై శివార్లలో కొంకణి తీరాన ఉన్న పాల్ఘర్ పట్టణం ఆమెది. సాదాసీదా జీవనమే అయినా ఒక మనిషికి సాటి మనిషి సేవ అవసరం అని ఆమె తెలుసుకుంది. అందుకు కారణం ఆమె కుమారుడు సెరిబ్రల్ పాల్సీతో జన్మించడమే. కుమారుడి కోసం జీవితాన్ని అంకితం చేసిన కిరణ్ చుట్టుపక్కల పేద పిల్లలకు పాఠాలు చెప్పడంతో పాటు చేతనైన సాయం చేయడం కొనసాగించేది. అయితే పార్కిన్సన్స్ వ్యాధి ఆమె కార్యకలాపాలను స్తంభింపచేస్తుందని ఆమె భర్త, కుమార్తె అనుకున్నారు. కాని 2021లో జరిగిన ఒక ఘటన అందుకు విరుద్ధంగా ఆమెను ప్రేరేపించింది.


కిరణ్ కామ్దార్

■ కిచిడి ముద్ద

పాల్ఘర్‌లో ఒకే ఒక పెద్ద గవర్నమెంట్ హాస్పిటల్ ఉంది. చుట్టుపక్కల 15 పల్లెల నుంచి పేద జనం ఉదయం నుంచే వచ్చి ఓపీలో వెయిట్ చేస్తుంటారు. వారికి చెకప్ అయ్యేసరికి మధ్యాహ్నం 2 అవుతుంది. ఆ సమయంలో వారి ఆకలి బాధకు అక్కడ విరుగుడు లేదు. 2021లో కోవిడ్ సెకండ్‌వేవ్ సమయంలో ఒక బంధువును పరామర్శించడానికి కిరణ్ ఆ ఆస్పత్రికి వెళ్లింది. మధ్యాహ్నం వేళ చాలామంది పేషెంట్లు ఆకలితో బాధ పడుతున్నారని గ్రహించింది. 'వీరికి ఆకలి తీరే మార్గమే లేదా?' అనుకుని వెంటనే రంగంలో దిగింది. హాస్పిటల్ డీన్‌ని కలిసి 'నేను మీ హాస్పిటల్‌లోని పేషెంట్లకు శుచిగా చేసిన వెజిటబుల్ కిచిడి పెట్టొచ్చా. వాళ్లు అన్నం లేక బాధ పడుతున్నారు' అని అడిగింది. హాస్పిటల్ డీన్ వెంటనే అంగీకారం తెలిపారు. అలా మొదలైంది కిరణ్ 'కిచ్‌డీ బ్యాంక్' ఆలోచన.

■ రోజూ 100 మంది

అంతటి పార్కిన్సన్స్ వ్యాధితో బాధ పడుతున్నా రోజూ స్వయంగా దాదాపు 20 నుంచి 22 కిలోల కిచిడి తయారు చేస్తుంది కిరణ్. ఆ తర్వాత దానిని స్వయంగా తీసుకుని ఆస్పత్రి చేరుతుంది. అక్కడ వార్డు వార్డుకు తిరుగుతూ పేషెంట్లకి, వారి బంధువులకి, చిన్న పిల్లలకు పంచి పెడుతుంది. ఇందుకు రెండు మూడు గంటలు పట్టినా ఆమె అలసి పోదు. పల్లెటూరి పేద వారు ఆమె తెచ్చే ఆ కిచిడి కోసం ఎదురు చూస్తూ ఉంటారు. 'నువ్వు దేవతవు తల్లీ' అని ఆశీర్వదిస్తూ ఉంటారు. 'కిచిడి పేషెంట్లను త్వరగా కోలుకునేలా చేస్తుంది. సులభంగా అరుగుతుంది' అంటుంది కిరణ్.

■ అదే వైద్యం

పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతూ ఇంతమందికి రోజూ వండటం గురించి కిరణ్‌కు చికిత్స చేస్తున్న డాక్టర్లు ఆందోళన చెందినా, వారించినా ఇప్పుడు మూడేళ్లుగా సాగుతున్న ఆమె సేవను చూశాక, ఆమెకు పరీక్షలు చేశాక 'ఆమె చేస్తున్న సేవే ఆమెకు వైద్యంగా పని చేస్తున్నదని' తేల్చారు. ఆమె సంకల్పం వ్యాధిని అదుపులో పెడుతోందని తెలియచేశారు. కిరణ్ కామ్దార్ గత మూడేళ్లుగా సాగిస్తున్న ఈ సేవకు ఆమెకు ఎన్నో అవార్డులు వచ్చాయి. మెచ్చుకోళ్లు దక్కుతున్నాయి. నిజానికి ఇది అసాధ్యమైన పని కాదు. ఆమె మాత్రమే చేయదగ్గ పని కాదు. ఎవరైనా అతి సులువుగా పూనుకోదగ్గదే. ప్రతి ప్రాంతంలో ఎన్నో ప్రభుత్వ ఆస్పత్రుల దగ్గర పేదవాళ్లు, లోపలి పేషెంట్లు సరైన తిండి లేక బాధపడుతుంటారు. వారికి కిచ్‌డీయో సాంబార్ రైసో పెట్టడం పెద్ద కష్టం కాదు. రోజూ చేయకపోయినా వారానికి ఒకరోజైనా ఇలాంటి సేవ చేస్తే ఆ తృప్తే వేరు. ఎక్కువమంది పూనుకోరు. పూనుకున్నవారు కిరణ్ కామ్దార్‌లా చిరాయువు పొందుతారు.

అదర్ సైడ్

కన్నీళ్ల భాష తెలిసిన విజీ వెంకటేష్ కళారంగంలోకి అడుగుపెట్టింది. దేశవ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించడం నుంచి క్యాన్సర్ బాధితులకు అండగా నిలవడం వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన విజీ వెంకటేష్‌లో నటిగా మరో కోణం పరిచయం అయింది. ఆమెకు నటనలో ఓనమాలు తెలియవు. అయితే 'తెలియదు' అనే మాట దగ్గర ఆమె ఎప్పుడూ ఆగిపోలేదు. మలయాళం మాట్లాడడం నేర్చుకుంది. సాధన చేసి నటనలో శభాష్ అనిపించుకుంది. 'బలమైన సినీ మాధ్యమం ద్వారా ఎన్నో సందేశాలను ప్రజలకు చేరువ చేయవచ్చు' అంటుంది విజీ వెంకటేష్...

వెండితెర వెలుగుల్లోనూ...


విజీ వెంకటేష్

71 ఏళ్ల వయసులో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన విజీ వెంకటేష్ మన దేశంలో క్యాన్సర్ పేషెంట్‌ల కోసం మూడు దశాబ్దాలకు పైగా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఆమె స్వచ్ఛంద సంస్థ 'ది మాక్స్ ఫౌండేషన్'కు ఇండియా, సౌత్ ఏషియా హెడ్‌గా ఉన్నారు.

దిల్లీలో పుట్టి పెరిగిన విజీకి సామాజిక స్పృహకు సంబంధించిన విషయాలపై స్కూల్ రోజుల్లో నుంచే ఆసక్తిగా ఉండేది. ఆ ఆసక్తికి అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. వివాహం తరువాత దిల్లీ నుంచి బాంబేకు వచ్చింది. ఒక కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుగా అనిపించింది. తన ఆసక్తులకు తగిన వాతావరణం ఇక్కడ కనిపించింది. ఆంగ్లంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 'ది మాక్స్ ఫౌండేషన్' ద్వారా ఉద్యోగ, సేవాప్రస్థానాన్ని ప్రారంభించింది.

'క్యాన్సర్ పేషెంట్ల గురించి పనిచేయాలనుకోవడానికి కారణం ఏమిటి? అని చాలామంది నన్ను అడుగుతుంటారు. అయితే కాన్సర్‌పై పోరాటానికి, అవగాహన కలిగించడానికి క్యాన్సర్ పేషెంట్ కానక్కర్లేదు. వారి కష్టాలు మనకు తెలిసుంటే చాలు. ముంబైలో సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి క్యాన్సర్ బాధితులకు అవసరమైన నిధుల సేకరణ ప్రారంభిండం ద్వారా నా ప్రస్థానం మొదలైంది' అంటుంది విజీ.

నిధుల సేకరణ మాత్రమే కాదు పేద క్యాన్సర్ పేషెంట్ల ఇంటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. ధైర్యం చెప్పేది. వీరిలో చాలామందికి పొగాకు నమిలే అలవాటు ఉన్నట్లు గ్రహించింది.

ఉద్యోగ ప్రయాణం మొదలైన కొత్తలో బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీకి వెళ్లి క్యాన్సర్‌కు సంబంధించిన ఎన్నో పుస్తకాలను చదివి కొత్త విషయాలను తెలుసుకునేది. అంతేకాదు టాటా మెమోరియల్ హాస్పిటల్‌లోని ఆంకాలజీ డిపార్ట్‌మెంట్ ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకుంది.

ఫ్యాక్టరీలకు వెళ్లి పొగాకు నమలడం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యల గురించి కార్మికుల కోసం అవగాహన సదస్సులు నిర్వహించేది. ఈ సమావేశాలు పొగాకు నమిలే అలవాటు ఉన్న చాలామందిలో మార్పు తీసుకువచ్చి ప్రమాదం బారిన పడకుండా చూశాయి.

అవగాహన సదస్సులతో పాటు పేదల కోసం ఎన్నో చోట్ల క్యాన్సర్‌కు సంబంధించి ఎర్లీ డిటెక్షన్ క్యాంపులు నిర్వహించింది. ఈ క్యాంప్‌లు ఎంతోమందిని కాపాడాయి.


మలయాళ చిత్రంలో ఫాహద్ ఫాజిల్, విజీ వెంకటేష్

అసలు సినిమాల్లో నటించే అవకాశం విజీ వెంకటేష్‌కు ఎలా వచ్చింది అనే విషయానికి వస్తే... సోషల్ మీడియాలో ఆమె చురుగ్గా ఉంటుంది. మలయాళ డైరెక్టర్ అఖిల్ సత్యన్, అతని టీమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో విజీ వెంకటేష్ ఫొటోను చూశారు. తమ సినిమా 'పచ్చుం అబ్భుతావిలక్కుమ్'కు 'ఉమ్మచ్చి' క్యారెక్టర్‌కు సరిగ్గా సరిపోయే మహిళ అనుకున్నారు. వెంటనే విజీ వెంకటేష్‌ను సంప్రదించారు.

'నేను ఫుల్-టైమ్ జాబ్ చేస్తున్నాను. నాకు మలయాళం పెద్దగా రాదు' అని చెప్పింది.

'ఈ వయసులో నటన ఏమిటి' అని కూడా అన్నది.

అయితే డైరెక్టర్ పట్టువదలని విక్రమార్కుడు అయ్యాడు. 'రోల్' గురించి మరింత వివరంగా చర్చించాడు. అతడి ఆసక్తి, వృత్తిపట్ల అంకిత భావం నచ్చడంతో విజీకి 'ఓకే' అనక తప్పలేదు. ఇక అప్పటినుంచి మలయాళం స్పీకింగ్ స్కిల్స్‌పై దృష్టి పెట్టింది. నటనలో మంచి మార్కులు కొట్టేసింది.

ఈ సినిమాలో విజీ తల్లి పాత్ర పోషించింది. స్వతంత్ర వ్యక్తిత్వం, పోరాడే ధీరత్వం ఉన్న మహిళ పాత్ర అది. నిజానికి ఈ పాత్రకి సంబంధించిన లక్షణాలు ఆమెలో సహజంగా ఉన్నవే.

ఈ సినిమా నుంచి మరికొన్ని సినిమాల నుంచి ఆఫర్లు వచ్చాయి. 'వీర' లాంటి చిత్రాలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు జయరాజ్ చిత్రం కోసం సైన్ చేసింది. కాటుక, ముక్కు పుడక... ఇలా విజీ వెంకటేష్‌కు తనదైన సిగ్నేచర్ స్టైల్ ఉంది. తన మొదటి సినిమా కోసం ఆ స్టైల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే కొత్త లుక్‌లో కూడా సహజంగా, అందంగా ఉంది విజీ వెంకటేష్.

బ్యూటిప్స్

అందానికి ఓట్లు





ఓట్స్ ఆరోగ్యపోషణతో పాటు సౌందర్యపోషణకూ దోహదం చేస్తాయి. ఓట్స్‌తో చర్మ సౌందర్యాన్ని సంరక్షించుకోవడం ఎలాగో చూద్దాం.

- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్‌పొడర్‌లో మూడు టేబుల్ స్పూన్‌ల పెరుగు, టీ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిక్స్‌ను ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా రుద్దుతూ చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి తగిన పోషణ లభించడంతోపాటు మృతకణాలు తొలగిపోయి చర్మం కాంతిమంతమవుతుంది.
- మొటిమలు తగ్గాలంటే టేబుల్ ఓట్స్ పొడర్‌లో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. పూర్తిగా ఆరిన తర్వాత మెల్లగా రుద్దుతూ చన్నీటితో శుభ్రం చేయాలి. చర్మంలో అధికంగా ఉన్న జిడ్డును ఓట్స్ పీల్చుకోవడం వల్ల మొటిమలు వాడిపోతాయి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే నాలుగు వారాల్లోనే మొటిమలు పూర్తిగా తగ్గిపోతాయి.
- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్ పొడర్‌లో టేబుల్ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్‌ల పాలు కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఈ ప్యాక్ సహజమైన బ్లీచ్. చర్మాన్ని తెల్లబరుస్తుంది. మృదువుగా మారుతుంది కూడా.
- ఓట్స్ పొడర్ రెండు టేబుల్ స్పూన్‌లు, బాదం పొడి టేబుల్ స్పూన్, తేనె టేబుల్ స్పూన్, పాలు లేదా పెరుగు రెండు టేబుల్ స్పూన్‌లు కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి, మెడకు పట్టించి వలయాకారంలో పది నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఈ ప్యాక్ వల్ల మృతకణాలు తొలగిపోవడంతోపాటు చర్మకణాల్లో పట్టేసిన మురికి వదులుతుంది. ఈ ప్యాక్ నెలకు రెండుసార్లు వేస్తుంటే ప్రత్యేకంగా స్క్రబ్ క్రీమ్‌లు, బ్లీచ్‌లు వాడాల్సిన అవసరం ఉండదు.
- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్ పొడర్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల బొప్పాయి గుజ్జు, టీ స్పూన్ బాదం ఆయిల్ కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. పొడి చర్మానికి ఈ ప్యాక్ చాలా మంచి ఫలితాన్నిస్తుంది. చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. మొటిమలు ఉన్న వాళ్లు బాదం ఆయిల్ లేకుండా ప్యాక్ వేసుకోవచ్చు.

యోగవికాసానికి పద్మ పురస్కారం


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మశ్రీ అందుకుంటున్న చార్లొట్ చోపిన్

నూటొక్క వసంతాలను చూసిన చార్లొట్ చోపిన్ ఈ ఏడాది మే నెలలో మనదేశం అందించే అత్యున్నత పద్మపురస్కారాన్ని అందుకున్నారు. ఆమె పుట్టి వందేళ్లు దాటింది. నిజమే, 1922, డిసెంబర్ 11వ తేదీన ఫ్రాన్స్‌లోని చేర్ పట్టణంలో పుట్టారామె. యాభై ఏళ్ల వయసులో ఆమె ఎదుర్కొన్న శారీరక, మానసిక రుగ్మతలకు సమాధానంగా యోగసాధన ప్రారంభించారు చార్లొట్. అప్పటి నుంచి ఆమె జీవనశైలి పూర్తిగా మారిపోయింది. తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని అంతటితో సంతృప్తి చెందలేదామె. యోగసాధన గురించి ప్రపంచానికి తెలియచేయాలని కంకణం కట్టుకున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి, ఆనందానికి, ఆహ్లాదకరమైన జీవనానికి యోగసాధనను మించినది మరొకటి లేదని వర్క్‌షాప్‌లు పెట్టి అవగాహన కల్పించారు.

ఫ్రాన్స్‌లో పరిమళించిన మన ప్రాచీన విద్య

చార్లొట్ 1982 లో చేర్ పట్టణం నుంచి యోగసాధన పట్ల అవగాహన కార్యక్రమాలు మొదలుపెట్టారు. యోగసాధన వల్ల లభించే ప్రయోజనాలను వివరిస్తూ, యోగసాధన నేర్పిస్తూ ఫ్రాన్స్ మొత్తం పర్యటించారామె. ఫ్రెంచ్ టీవీలో 'ఫ్రాన్స్ గాట్ ఇన్‌క్రెడిబుల్ టాలెంట్' ప్రోగ్రామ్ ద్వారా దేశమంతటా యోగ విద్యను విస్తరింపచేశారు. ఆమె తాను నివసిస్తున్న చేర్ పట్టణంలో స్వయంగా వేలాది మందికి నేర్పించారు. దేశవిదేశాల్లో యోగవిద్య విస్తరించడానికి ఆమె విశేషమైన కృషి చేశారు.

ప్రాచీనమైన యోగవిద్య మనిషికి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించే ఏకైకమార్గమని ప్రపంచానికి చాటారు చార్లొట్. యోగసాధనకు వయసుతో సంబంధం లేదని, అందుకు తానే పెద్ద నిదర్శనమని అనేక సందర్భాల్లో చెప్పారామె. తన ఆరోగ్య రహస్యం యోగసాధన అని 2024, మే, 9వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్న సందర్భంగా కూడా చెప్పారు చార్లొట్ చోపిన్.

సోషల్ టౌన్ / స్వచ్ఛంద సహకారం

కేరళకు చెందిన నీనూ రతిన్‌కు సామాజిక సేవా రంగం అంటే ఇష్టం. సోషల్ యాక్టివిస్టులతో కలిసి పనిచేయడం అంటే ఇష్టం. ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రహించి నిధుల సేకరణలో వారికి సహకరించడానికి ఒక సంస్థను ఏర్పాటు చేసింది. తక్కువ కాలంలోనే 'సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్'గా పెద్ద పేరు తెచ్చుకుంది. సోషల్ వర్కర్ కావాలనుకునే వారికి సంస్థ సహకారం అందిస్తుంది. స్వచ్ఛంద సంస్థలు వివిధ విషయాలలో పరస్పరం సహకరించుకునే వాతావరణాన్ని కల్పించింది.



కేరళలోని త్రిసూర్‌లో పుట్టి పెరిగిన నీనూ రతిన్ చదువులో 'తెలివైన అమ్మాయి' అనిపించుకుంది. క్లాసులో టీచర్‌లు చెప్పే సామాజిక సేవకు సంబంధించి విషయాలను శ్రద్ధగా వినేది. అలా... తనకు చిన్నప్పుడే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరిగింది. చదువుకు ఎంత ప్రాముఖ్యత ఇచ్చేదో సామాజిక సేవా కార్యక్రమాలకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేది.

ఇంజినీరింగ్ చేస్తున్నప్పటికీ ఆమె మనసు మాత్రం సామాజిక విషయాలపై కేంద్రీకృతమై ఉండేది.

ఆమె ఫ్రెండ్స్‌కు మాత్రం ఇంజినీరింగ్ అంటే చాలా ఇష్టం. ఒకానొక దశలో అయితే 'వీరి మధ్య నేను ఉండడం సరియైంది కాదేమో. నా ఆలోచనలు వేరు, వీరి లక్ష్యాలు వేరు' అనుకునేది నీనూ.

ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చిందిగానీ ఏవో కారణాల వల్ల అందులో చేరలేకపోయింది. దీంతో ఒక చిన్న ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసింది.

అయితే కొంత కాలం తరువాత... 'ఈ ఉద్యోగం నాకు కరెక్ట్ కాదేమో' అనుకుంది. అదే సమయంలో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. పెళ్లి తరువాత తనకు ఎప్పటి నుంచో ఆసక్తి ఉన్న సామాజిక సేవారంగంలోకి అడుగు పెట్టింది.

'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. ఇది తన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

'ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో ఆధ్యాత్మిక. సామాజిక కార్యక్రమాలు ఉండేవి. నాకు రెండోదానిపై ఆసక్తి' అంటుంది నీనూ. ఫౌండేషన్‌కు సంబంధించి ఎన్నో రకాల సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంది. ఈ కార్యక్రమాలు భవిష్యత్‌లో తాను చేయబోయే పనులకు పునాదిగా నిలిచాయి.

తొలి అడుగుగా ఫౌండేషన్ తరపున ఎన్నో స్కూల్స్‌కు వెళ్లి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు చెప్పేది. మొక్కలు నాటేది. పది స్కూల్స్‌తో మొదలైన మొక్కలు నాటే కార్యక్రమం ఆ తరువాత 30కు చేరుకుంది. ఒకవైపు ఇంటిపనులు చూసుకుంటూనే పర్యావరణ విషయాలపై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొనేది నీనూ.

సామాజిక సేవా రంగంలో పనిచేయడం వల్ల తనలాగే ఆలోచించే ఎంతోమంది పరిచయం అయ్యారు. ఎన్నో స్వచ్ఛందసంస్థలతో కలిసి రకరకాల కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది.



ఆ బలమే వేరు

ఒకే రకమైన ఆలోచన విధానం ఉన్న వారు ఒకే దగ్గర ఉంటే ఆ బలమే వేరు. ఇంకా ఎన్నో మంచి పనులు చేయవచ్చు. చాలా మందికి సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వారికి దారి తెలియదు. అలాంటి వారికి ఒక కొత్త దారిని చూపే బాధ్యతను మా స్వచ్ఛంద సంస్థ తీసుకుంది. స్వచ్ఛంద సేవకురాలిగా ప్రభావశీలమైన ఎన్నో ప్రాజెక్ట్‌లలో పాల్గొన్నాను. వాటి గురించి గుర్తు తెచ్చుకున్నప్పుడల్లా ఉత్సాహం వస్తుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలనిపిస్తుంది.

– నీనూ రతిన్

కొంతకాలం తరువాత భర్త, పిల్లలతో కొచ్చికి వెళ్లింది నీనూ. అక్కడికి వెళ్లిన తరువాత కూడా స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయడం మొదలుపెట్టింది. మహిళా సమస్యలపై పనిచేయడం నుంచి రక్తదాన కార్యక్రమాల వరకు ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంది.

తాను కొచ్చిలో ఉన్న సమయంలో కేరళకు భయానకమైన వరదలు వచ్చాయి. వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. సోషల్ మీడియా వేదికగా బాధితులకు ఎన్నో రకాలుగా అండగా నిలబడింది. అట్టాపాడి, నీలంబూర్, వయనాడ్‌లోని గిరిజన జనావాసాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'బాధితులకు సహాయపడే కార్యక్రమాల్లో పాల్గొనడం అనేది సమిష్టి కార్యాచరణ శక్తిని అర్థం చేసుకునేలా చేసింది. గతంలో మా కుటుంబ సభ్యులు ఎవరూ సామాజిక సేవా రంగంలో లేరు. నాకు కూడా కొత్త. ఎన్ని రకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొంటే నాకు అంత ఉత్సాహం వచ్చేది' అంటుంది నీనూ రతిన్.

ఆ ఉత్సాహ బలమే ఆమెను 'సోషల్ టౌన్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించేలా చేసింది.

మొదట్లో ఇంటరాక్షన్స్ కోసం వాట్సాప్ గ్రూప్‌లు, ఈ మెయిల్స్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 'సోషల్ టౌన్ పరిధి విస్తరించి క్షేత్రస్థాయిలో సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి.

'సమాజంలో ఏదో ఒక మార్పు తీసుకురావాలని కలలు కనే ఒకేరకమైన ఆలోచనా విధానం కలిగిన వ్యక్తులుండే సంఘంలాంటిది మా సంస్థ' అంటుంది నీనూ రతిన్.

సాక్షి
స్పోర్ట్స్
గురువారం
27-6-2024



14 ఏళ్లకే ఒలింపిక్స్ బరిలోకి...

వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ తరఫున బరిలోకి దిగనున్న అతి పిన్న వయస్కురాలిగా కర్ణాటకకు చెందిన 14 ఏళ్ల స్విమ్మర్ ధినిధి దేసింగు గుర్తింపు పొందనుంది. ధినిధి మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో పోటీపడుతుంది. భారత్ నుంచి ఎవరూ పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని అందుకోలేకపోయారు. దాంతో చివరి అవకాశంగా అందుబాటులో ఉన్న రెండు 'యూనివర్సాలిటీ' బెర్త్‌లను భారత స్విమ్మింగ్ సమాఖ్య ఉపయోగించుకుంది. ధినిధి కాకుండా పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ భారత్ తరఫున 'పారిస్'లో పోటీపడతాడు.

జింబాబ్వే పర్యటనకు నితీశ్ కుమార్ రెడ్డి దూరం



భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి మరికొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. వచ్చే నెలలో జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత టి20 జట్టులో నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. అయితే దురదృష్టవశాత్తు బుధవారం నితీశ్ గాయపడి జింబాబ్వే పర్యటనకు దూరమయ్యాడు. ఫలితంగా నితీశ్ స్థానంలో ముంబైకి చెందిన ఆల్‌రౌండర్ శివమ్ దూబేను బీసీసీఐ ఎంపిక చేసింది.



'ఫైనల్' అడుగు ఎవరిదో!

నేడు ఇంగ్లండ్‌తో భారత్ సెమీఫైనల్ ● జోరు మీదున్న రోహిత్ బృందం
నిలకడలేమితో బట్లర్ జట్టు ● రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టీమిండియా ఏడు నెలల్లో మరో ప్రపంచకప్ ఫైనల్‌పై గురి పెట్టింది. 2022 టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో తమను ఓడించి తుది పోరుకు అర్హత పొందిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ పై బదులు తీర్చుకునేందుకు భారత జట్టు అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. 'ఒకే దెబ్బకు రెండు పిట్టలు' అన్నట్లు ఈ ఒక్క నాకౌట్ విజయంతో ఇంగ్లండ్ ను కసిదీరా ఇంటికి పంపొచ్చు... మనమేమో 10 ఏళ్ల తర్వాత ఈ మెగా టోర్నీలో మరోసారి ఫైనల్ చేరవచ్చు. బ్యాటింగ్ ఫామ్, బౌలింగ్ నిలకడ భారత్‌ను ఓ మెట్టుపైనే నిలబెడుతోంది.

జార్జ్‌టౌన్: భారత్ ఇక అసలైన పోరుకు సిద్ధమైంది. గడిచిన 26 రోజులుగా ఆడిన మ్యాచ్‌లు వేరు, నేటి సెమీఫైనల్ పోరాటం వేరు. లీగ్, సూపర్–8 దశలు కావడంతో ఇన్నాళ్లూ కచ్చితంగా గెలవకపోయినా... ముందుకెళ్లే అవకాశమైతే ఉండింది. కానీ ఇది నాకౌట్ పోరు. అన్నీ గెలిచామన్న ధీమా కుదరదు. అలాగే ఇదీ గెలుస్తామన్న గ్యారంటీ లేదు. ఇంకా చెప్పాలంటే కప్ గెలవాలన్నా... ఆఖరి మెట్టుపై నిలవాలన్నా... ఈ రెండో మెట్టే గట్టిగా వేయాలి. లేదంటే అమీతుమీకి ముందే మన జైత్రయాత్రకు చెక్ పడుతుంది. పైగా ఇది టి20 ఫార్మాట్. ఈ మెరుపుల ఫార్మాట్‌ను బ్యాటర్లు, బౌలర్లు, ఆల్‌రౌండర్లే కాదు... వరుణ దేవుడు కూడా శాసిస్తోంది. ఇది ఒక్కోసారి పెద్ద జట్లకు శాపంగా... ఉన్నపళంగా జఠిలంగా కూడా మారుతోంది.

ఏడు జట్లను ఓడించాం కానీ...

ఒక వార్మప్ మినహాయిస్తే... నాలుగు లీగ్ దశ పోటీలు, మూడు సూపర్–8 మ్యాచ్‌ల్లో ఏడు వేర్వేరు జట్లనైతే ఓడించాం. కానీ గట్టిగా జయించింది ఇద్దరినే! లీగ్ దశలో పాకిస్తాన్, 'సూపర్–8'లో ఆస్ట్రేలియా ఈ రెండు మేటి జట్లపై గెలుపే ప్రపంచకప్ స్థాయి గెలుపని చెప్పొచ్చు. ఐర్లాండ్, అమెరికా, కెనడా, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లను ఓడించడం టీమిండియా స్థాయికి ఏమాత్రం విషయం కానేకాదు. ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టుపై కెప్టెన్ రోహిత్ శర్మ విధ్వంసం భారత బ్యాటింగ్‌ను మరోస్థాయిలో నిలబెడుతోంది. కానీ విరాట్ కోహ్లి వైఫల్యమే జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. బహుశా ఈ సెమీస్‌లో ఆ కరువు తీర్చుకుంటే అభిమానులకు 'ఫైనల్ పండగే' మిగులుతుంది. సూర్యకుమార్, దూబే, హార్దిక్ పాండ్యాలు దంచేయడం, బౌలింగ్‌లో బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ నిప్పులు చెరుగుతుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. స్పిన్నర్లు కుల్దీప్, జడేజా, అక్షర్ పటేల్‌లు కూడా జట్టు విజయాల్లో భాగమవుతున్నారు.

తడబడుతూ ఇంగ్లండ్

డిఫెండింగ్ చాంపియన్ హోదాతో మెగా ఈవెంట్‌ను మొదలుపెట్టిన ఇంగ్లండ్ జట్టు ఇక్కడిదాకా వచ్చేందుకు తడబడింది. ఇంకా చెప్పాలంటే కొన్ని సందర్భాల్లో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడింది కూడా! కానీ ఏ జట్టుపై, ఏ వేదికపై సాధికారికంగా ఆడిన దాఖలాలైతే లేవు. అయితే అసలైన ఈ నాకౌట్ సమరంలో కెప్టెన్ జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, మొయిన్ అలీ, హ్యారీ బ్రూక్‌లు బ్యాట్ ఝుళిపిస్తే మాత్రం భారత్‌కు కష్టాలు తప్పవేమో! బౌలింగ్‌లో స్పిన్నర్ ఆదిల్ రషీద్ అద్భుతంగా రాణిస్తుండటం ప్రత్యర్థి బౌలింగ్ దళానికి బలంగా మారింది.

23 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటివరకు 23 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. 12 మ్యాచ్‌ల్లో భారత్, 11 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి. ప్రపంచకప్‌లో నాలుగుసార్లు తలపడగా... చెరో రెండు విజయాలతో సమంగా ఉన్నాయి.

వర్షార్పణమైతే..
గయానాలో బుధవారం వాన కురిసింది. మ్యాచ్‌కు వరుణ గండమైతే ఉంది. తొలి సెమీఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది. భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. ఈ మ్యాచ్ ఉదయం జరగనుండటంతో నిర్ణీత సమయం కటాఫ్ లేకుండా పొడిగింపు మాత్రం ఉంటుంది. భారీ వర్షంతో సెమీఫైనల్స్ రద్దయితే లీగ్, సూపర్–8 దశల్లో టాపర్‌గా నిలిచిన భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఫైనల్ చేరుతాయి.

జట్లు (అంచనా)
భారత్: రోహిత్ (కెప్టెన్), కోహ్లి, సూర్యకుమార్, రిషభ్ పంత్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, అర్ష్‌దీప్, బుమ్రా. ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), సాల్ట్, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, హ్యారీ బ్రూక్, మొయిన్ అలీ, స్యామ్ కరన్, జోర్డాన్, ఆర్చర్, ఆదిల్ రషీద్, టాప్లీ.

పిచ్, వాతావరణం
గయానా పిచ్ బౌలర్లకు స్వర్గధామం. ఈ వేదికపై తొలుత బ్యాటింగ్ చేసిన జట్ల సగటు స్కోరు 127. అయితే లక్ష్యఛేదన మరీ దారుణం. సగటు స్కోరు 95 పరుగులే! కాబట్టి మెరుపుల్ని ఆశించడం అత్యాశే! మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది.

కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత పురుషుల హాకీ జట్టును ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన టీమిండియాకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్... వైస్ కెప్టెన్‌గా హార్దిక్ సింగ్ వ్యవహరిస్తారు. గత టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకం సాధించింది. గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లతో భారత్ ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా జట్లున్నాయి. గోల్‌కీపర్ శ్రీజేశ్, మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ వరుసగా నాలుగో ఒలింపిక్స్ ఆడనున్నారు. **భారత హాకీ జట్టు:** హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), హార్దిక్ సింగ్ (వైస్ కెప్టెన్), శ్రీజేశ్ (గోల్ కీపర్), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, సుమిత్, సంజయ్, రాజ్‌కుమార్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ ప్రసాద్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్, మన్‌దీప్ సింగ్, గుర్జంత్ సింగ్, క్రెయిగ్ ఫుల్టన్ (హెడ్ కోచ్).

చరిత్రకు చేరువలో..

తరూబా (ట్రినిడాడ్): ఓ ఆసక్తికర సెమీస్ సమరం, ఓ కొత్త ఫైనలిస్టుకు వేదికైన ఈ ప్రపంచకప్‌లో అటు దక్షిణాఫ్రికా, ఇటు అఫ్గానిస్తాన్ ఎవరు ఫైనల్ చేరతారో గురువారం మధ్యాహ్నంలోపు తెలిసిపోతుంది. మెగా ఈవెంట్‌లోనే మేటి జట్లను తోసిరాజని బాగా ఆకట్టుకున్న ఏకైక జట్టు అఫ్గానిస్తాన్. తమ ఆట ఆషామాషీగా లేదని, సంచలన విజయాలు గాలివాటం కానేకాదని రషీద్ ఖాన్ బృందం నిరూపిస్తోంది. ఆతిథ్య విండీస్, పటిష్ట న్యూజిలాండ్ ఉన్న గ్రూప్ 'సి'లో లీగ్ దశనే అఫ్గానిస్తాన్ దాటడం గొప్పనుకుంటే... 'సూపర్–8'లో ఏకంగా 2021 చాంపియన్ ఆస్ట్రేలియానే కంగుతినిపించడం, బంగ్లాదేశ్‌పై తీవ్ర ఒత్తిడి ఉన్న ఆఖరి మ్యాచ్‌లో పోరాడి గెలవడం క్రికెట్ చరిత్రలోనే నిలిచేలా చేసింది. అఫ్గాన్ సెమీస్ చేరడంతోనే రికార్డుల్లోకెక్కింది. ఇప్పుడు ఫైనల్ చేరి చరిత్ర పుటల్లోకెక్కాలని గట్టి పట్టుదలతో ఉంది. ఇటు బ్యాటర్లు, అటు బౌలర్లు సమష్టిగా రాణిస్తుండటం అఫ్గాన్ పెను సంచలనాలకు కారణం కాగా... మరోవైపు గట్టి జట్టయిన దక్షిణాఫ్రికా మాత్రం ప్రతి మ్యాచ్‌ను కష్టపడుతూనే గెలుపొందడం విడ్డూరం. నెదర్లాండ్స్‌పై 103 పరుగుల లక్ష్యాన్ని 19వ ఓవర్లో ఛేదించడం, బంగ్లాదేశ్‌పై 4 పరుగులు, నేపాల్‌తో ఒక పరుగు తేడాతో గట్టెక్కడం సఫారీ స్థాయిని తక్కువ చేస్తోంది. తొలిసారి ప్రపంచకప్‌లో ఆడిన అమెరికాపై 194/4లాంటి భారీస్కోరు చేసినా కేవలం 18 పరుగులతోనే గెలుపొందడం... ఇలా ప్రతీ మ్యాచ్‌లోనూ దక్షిణాఫ్రికా పెద్ద పెద్ద పోరాటాలే చేసింది. ఇలాంటి జట్టుపై జోరుమీదున్న అఫ్గాన్ గెలిస్తే సంచలనమైతే అవుతుందేమో కానీ ఇందులో పెద్ద విశేషమైతే ఉండదు. మొత్తం మీద తొలి ఫైనల్ అవకాశాన్ని ఎవరు దక్కించుకుంటారనేదే ఆసక్తికరంగా మారింది.





దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ మధ్య తొలి సెమీఫైనల్ నేడు

- ఎవరు గెలిచినా తొలిసారి వరల్డ్‌కప్ 'ఫైనల్'కు
- ఉదయం గం. 6 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

జట్లు (అంచనా)
దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెండ్రిక్స్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, రబాడ, నోర్జే, షమ్సీ. **అఫ్గానిస్తాన్:** రషీద్ ఖాన్ (కెప్టెన్), గుర్బాజ్, ఇబ్రహీమ్, అజ్మతుల్లా, గుల్బదిన్, నబీ, కరీమ్, నంగేయలియా, నూర్ అహ్మద్, నవీనుల్ హక్, ఫరూఖీ.

2 దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఇప్పటి వరకు రెండు టి20 మ్యాచ్‌లు జరగ్గా... రెండింటిలోనూ దక్షిణాఫ్రికానే గెలిచింది. 2010 ప్రపంచకప్‌లో 59 పరుగులతో, 2016 ప్రపంచకప్‌లో 37 పరుగులతో దక్షిణాఫ్రికా నెగ్గింది.

టాప్ ర్యాంక్ కోల్పోయిన సూర్యకుమార్ యాదవ్

కొత్త నంబర్‌వన్‌గా హెడ్





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. గత ఏడు నెలలుగా నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. ఐదో ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రవిస్ హెడ్ నాలుగు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుత టి20 ప్రపంచకప్‌లో హెడ్ మొత్తం 255 పరుగులు సాధించాడు. దాంతో అతను 844 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. 842 రేటింగ్ పాయింట్లతో సూర్య రెండో స్థానంలో ఉన్నాడు. ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), బాబర్ ఆజమ్, రిజ్వాన్ (పాకిస్తాన్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు.

సినిమా

కౌంట్‌డౌన్ స్టార్ట్


● రామ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరిద్దరి కలయికలో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. ఆగస్టు 15న సినిమాని విడుదల చేయనున్నాం. సినిమా రిలీజ్‌కి సరిగ్గా 50 రోజులు ఉంది. అందుకే 50 రోజుల కౌంట్‌డౌన్‌ను మార్క్ చేస్తూ రామ్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశాం. మణిశర్మ సంగీతం అందించిన ఈ మూవీ టైటిల్ సాంగ్ షూట్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ పాటకి జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

రాజా సాబ్ సరిగమలు


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'రాజా సాబ్'. మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో ఈ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఆల్రెడీ మొదలై, సగానికి పైగా పూర్తయింది. తాజాగా 'రాజా సాబ్' సినిమాకు చెందిన మ్యూజిక్ సిట్టింగ్ వర్క్స్‌తో బిజీగా ఉన్నారు ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ తమన్. చెన్నైలోని మెరీనా బీచ్‌లో 'రాజా సాబ్' పాటల గురించి చర్చించుకుంటున్నారు మారుతి, తమన్. ఈ సినిమాలో ఐదు పాటలు ఉంటాయని, ఆల్రెడీ మూడు పాటలకు సంబంధించిన ట్యూన్స్‌ను తమన్ పూర్తి చేశారని, మిగిలిన రెండు పాటలకు చెందిన చర్చలు ఇప్పుడు జరుగుతున్నాయని టాక్. ఇక ఇన్ని రోజులు 'కల్కి 2898 ఏడీ' సినిమా ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు ప్రభాస్. దీంతో కొన్ని రోజులు విశ్రాంతి కోసం ఫారిన్ వెళ్తారట. తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్' చిత్రీకరణలో పాల్గొంటారు. అలాగే దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్', దర్శకుడు హను రాఘవపూడితో ఓ లవ్‌స్టోరీ సినిమా ప్రభాస్ కమిటైన సంగతి తెలిసిందే.

కూలీ ఆగలేదు


● లోకేశ్, రజనీకాంత్

రజనీకాంత్ 'కూలీ' ఆగలేదు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. కాగా ఇటీవల ఓ సందర్భంలో 'కూలీ' చిత్రీకరణ జూన్ 10న ప్రారంభం కానున్నట్లు రజనీకాంత్ వెల్లడించారు. కానీ ఈ తేదీకి 'కూలీ' సెట్స్‌పైకి వెళ్లలేదు. ఆ తర్వాత దర్శకుడు లోకేశ్ కనగరాజ్ 'ఎక్స్' బయోలో 'కూలీ' సినిమా పేరు కనిపించలేదు. దీంతో ఈ సినిమా ఆగిపోయిందనే పుకార్లు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై తాజాగా లోకేశ్ కనగరాజ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'కూలీ' చిత్రానికి సంబంధించిన లుక్ టెస్ట్ జరుగుతోందని, జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని లుక్ టెస్ట్ సెషన్‌లోని ఫొటోను షేర్ చేశారు లోకేశ్.

అడవిలో స్వయంభూ


● నిఖిల్

మారేడుమిల్లిలోని దట్టమైన అడవులకు వెళ్లారు నిఖిల్. ఎందుకంటే 'స్వయంభూ' సినిమా కోసం. నిఖిల్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ పాన్ ఇండియన్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో నభా నటేశ్, సంయుక్తా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ మారేడుమిల్లి ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో జరుగుతోంది. అక్కడి లొకేషన్స్‌లో ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''స్వయంభూ'లో నిఖిల్ వారియర్ పాత్రలో కనిపిస్తారు. ఇందుకోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఆస్కార్ నుంచి ఆహ్వానం


● షబానా ఆజ్మీ ● రమ ● రాజమౌళి ● ప్రేమ్ రక్షిత్

ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, ఆయన భార్య, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, బాలీవుడ్ ప్రముఖ నటి షబానా ఆజ్మీ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దర్శకుల కేటగిరిలో రాజమౌళి, కాస్ట్యూమ్ డిజైనర్ జాబితాలో రమ, ఆర్టిస్ట్ విభాగంలో షబానా ఆజ్మీ ఆస్కార్ అకాడమీలో సభ్యులుగా చేరేందుకు ఆహ్వానం అందుకున్నారు. 'బాహుబలి' చిత్రంతో తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' మూవీతో ప్రపంచపటంలో నిలిపారు. ఆ చిత్రంలోని 'నాటు నాటు...' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు.. 'ఆర్ఆర్ఆర్' హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు కీరవాణి, పాటల రచయిత చంద్రబోస్, కెమెరామేన్ కేకే సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్ గతేడాది 'అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఏమ్‌పీఏఎస్) లో సభ్యత్వం పొందారు. తాజాగా ఆ జాబితాలో రాజమౌళి, రమలతో పాటు 'నాటు నాటు...' కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ చేరారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి 487 మంది సభ్యులకు ఆస్కార్ అకాడమీ ఆహ్వానం పంపింది. వారిలో భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి రాజమౌళి, రమ, ప్రేమ్ రక్షిత్, షబానా ఆజ్మీ, కెమెరామేన్ రవి వర్మన్, దర్శక–నిర్మాత రీమా దాస్, నిర్మాత రితేశ్ సిధ్వానీ ఉన్నారు. ఈ సభ్యులంతా తమ ఓట్లు వేసి ఆస్కార్ విజేతలను ఎంపిక చేస్తారు. ''అకాడమీ ఓటర్స్‌గా ఆహ్వానం అందింది. పెద్దన్న (కీరవాణి), తారక్ (ఎన్టీఆర్), చరణ్ (రామ్‌చరణ్), సాబు సార్, సెంథిల్, చంద్రబోస్... ఇప్పుడు ప్రేమ్, రమ, నేను... ఒక సినిమా ('ఆర్ఆర్ఆర్') తొమ్మిది మందికి ఈ గౌరవం దక్కేలా చేసింది. అకాడమీకి, 'ఆర్ఆర్ఆర్' సినిమాకి ధన్యవాదాలు'' అని 'ఎక్స్' వేదికగా రాజమౌళి పేర్కొన్నారు.

స్పై మిషన్‌లో...

'సర్దార్' స్పై మిషన్‌లో భాగం కానున్నారట హీరోయిన్ ఆషికా రంగనాథ్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'సర్దార్' (2022) ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'సర్దార్'కు సీక్వెల్‌గా 'సర్దార్ 2' చేయాలనుకుంటున్నారు హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్. ఇందుకు సంబంధించిన సన్నాహాలు మొదలయ్యాయని టాక్. ప్రస్తుతం నటీనటుల ఎంపికపై మిత్రన్ కసరత్తులు చేస్తున్నారట. ఈ క్రమంలోనే 'సర్దార్ 2'లోని ఓ కీలక పాత్ర కోసం ఆషికాను సంప్రదించారని, ఆమె కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ భోగట్టా. కాగా 'సర్దార్' సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించారు. మరి... సీక్వెల్‌లో ఆషికా పాత్ర హీరోయిన్‌గా ఉంటుందా? లేక ఏదైనా స్పై మిషన్‌లో కీలకంగా ఉంటుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు ఆషిక. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా జనవరి 10న విడుదల కానుంది.


● ఆషికా రంగనాథ్

హైదరాబాద్‌లో వైజాగ్!


● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మట్కా'. ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. వైర ఎంటర్‌టైన్మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం మూడో షెడ్యూల్ ప్రస్తుతం భాగ్యనగరంలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''దేశాన్ని కదిలించిన వాస్తవ ఘటనల ఆధారంగా కరుణ కుమార్ 'మట్కా' స్క్రిప్ట్ తయారు చేశారు. 35 రోజుల లాంగ్ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో రూ. 15 కోట్లతో వింటేజ్ వైజాగ్ సెట్‌లు వేశాం. వైజాగ్‌లోని ఎసెన్స్‌ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ సెట్‌లు సినిమా హైలైట్స్‌లో ఒకటిగా నిలుస్తాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

క్రిస్మస్‌కు బేబీ జాన్


● వరుణ్ ధావన్

థియేటర్స్‌లోకి 'బేబీ జాన్' రాక మరింత ఆలస్యం అవుతోంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు కాలీస్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'బేబీ జాన్'. హీరోయిన్‌గా కీర్తీ సురేష్ బాలీవుడ్‌కు పరిచయం అవుతున్న ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో మురాద్ ఖేతని, జ్యోతిదేశ్ పాండే, ప్రియా అట్లీ నిర్మించిన ఈ సినిమాను మే 31న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆ తేదీకి విడుదల కాలేదు. తాజాగా 'బేబీ జాన్' సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల చేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

గుడుగుడు గుంజం...


● రేణు ప్రియ, రమేశ్ బాబు

చిమటా రమేశ్ బాబు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నేను–కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లుగా నటించారు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం అతి త్వరలో విడుదల కానుంది. ఎంఎల్ రాజా సంగీతం అందించిన ఈ మూవీలోని 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం..' అంటూ సాగే ఐటమ్ సాంగ్‌ను నటుడు, నిర్మాత మురళీ మోహన్ విడుదల చేశారు. చిమటా రమేశ్, రేణు ప్రియపై ఈ పాట చిత్రీకరించారు. ''వైవిధ్యమైన కథతో రూపొందించిన చిత్రమిది. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు ఫైట్స్ ఈ మూవీకి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి'' అన్నారు చిమటా రమేశ్.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	621	78,674
నిఫ్టీ ▲	169	23,890

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,753	▲	33
డోజోన్స్	39,143	▲	31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,210	▼	38
డాక్స్	18,063	▼	115
షాంఘై	2,973	▲	23
నికాయ్	39,667	▲	494

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,267
బంగారం (99.5 స్వచ్ఛత)	70,982
వెండి (కిలో)	86,994

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఒకటి	83.05	84.07
£	బ్రిటన్‌ పౌండ్	ఒకటి	104.75	107.30
€	యూరో	ఒకటి	88.34	90.68
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	51.72	53.85
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.82	56.76
S$	సింగపూర్‌ డాలర్	ఛాయమేరకు	59.18	63.87
SAR	సౌదీ రియాల్	ఛాయమేరకు	21.39	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయమేరకు	21.87	23.65
¥	చైనా యువాన్	ఛాయమేరకు	10.38	12.45

అణు విద్యుత్‌ రంగంలోకి మేఘా

- రూ.12,800 కోట్ల ప్రాజెక్టు కైవసం
- కర్ణాటకలో అణు విద్యుత్‌ ప్లాంటు నిర్మాణం


హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ (ఎంఈఐఎల్‌) అణు విద్యుత్‌ రంగంలోకి ఎంట్రీ ఇస్తోంది. రూ.12,800 కోట్ల విలువైన అణు విద్యుత్‌ కేంద్ర నిర్మాణ కాంట్రాక్టుకు సంబంధించి న్యూక్లియర్‌ పవర్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా నిర్వహించిన టెండర్లలో అత్యల్ప బిడ్డర్‌గా నిలిచి ప్రాజెక్టును చేజిక్కించుకున్నట్టు ఎంఈఐఎల్‌ బుధవారం తెలిపింది. కాంట్రాక్టులో భాగంగా కర్ణాటకలోని కైగా వద్ద 700 మెగావాట్‌ ఎలక్ట్రికల్‌ సామర్థ్యంగల రెండు రియాక్టర్ల నిర్మాణాన్ని ఈపీసీ పద్ధతిలో చేపడతామని సంస్థ డైరెక్టర్‌ సి.హెచ్‌.సుబ్బయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అణు ఇంధన శాఖ పరిధిలోని ఎన్‌పీసీఐఎల్‌ ఈ రియాక్టర్ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్లు పిలిచింది. 2023 అక్టోబర్‌ 4న టెండర్ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. అక్టోబర్‌ 5న సాంకేతిక బిడ్లను, ఈ ఏడాది జూన్‌ 26న ప్రైస్‌ బిడ్లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువగా రూ.12,799.92 కోట్లను కోట్‌ చేసి తొలి స్థానంలో నిలిచినట్టు ఎంఈఐఎల్‌ వెల్లడించింది. ఎల్‌అండ్‌టీ, బీహెచ్‌ఈఎల్‌ సైతం ఈ ప్రాజెక్టు కోసం పోటీపడ్డాయి. ఎన్‌పీసీఐఎల్‌ పిలిచిన టెండర్లలో ఇదే పెద్దది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

27-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్‌ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్‌ ధర	5.75

ముగిసిన స్పెక్ట్రం వేలం కేంద్రానికి 11,341 కోట్లు

- 141.4 మెగాహెర్ట్జ్‌ విక్రయం
- అత్యధికంగా కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: ఈసారి టెలికం స్పెక్ట్రం వేలం ప్రక్రియ రెండు రోజుల్లోనే ముగిసింది. మొత్తం రూ. 96,238 కోట్ల బేస్‌ ధరతో 800 మెగాహెర్ట్జ్‌ నుంచి 26 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌విడ్త్‌లో 10 గిగాహెర్ట్జ్‌ స్పెక్ట్రంను వేలానికి ఉంచగా.. ఏడు రౌండ్లలో 141.4 మెగాహెర్ట్జ్‌ మాత్రమే అమ్ముడైంది. టెల్కోలు సుమారు రూ. 11,340.78 కోట్ల విలువ చేసే బిడ్లు దాఖలు చేశాయి.

ప్రధానంగా గడువు తీరిపోతున్న స్పెక్ట్రంను రెన్యువల్‌ చేసుకోవడం, కవరేజీని పెంచుకునేందుకు నిర్దిష్ట ఫ్రీక్వెన్సీల్లోనే కొనుగోలు చేసేందుకు టెల్కోలు ప్రాధాన్యమివ్వడం ఇందుకు కారణం. భారతీ ఎయిర్‌టెల్‌ అత్యధికంగా స్పెక్ట్రం కొనుగోలు చేసింది. తొలిరోజైన జూన్‌ 25న (మంగళవారం) అయిదు రౌండ్లు జరగ్గా, రెండో రోజున పెద్దగా స్పందన లేకపోవడంతో వేలం ముగిసినట్లు బుధవారం అధికారులు ప్రకటించారు. టెల్కోలు తమ సర్వీసులను కొనసాగించడంతో పాటు కార్యకలాపాలను విస్తరించేందుకు కూడా స్పెక్ట్రంను కొనుగోలు చేసినట్లు కమ్యూనికేషన్స్‌ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈసారి విక్రయానికి ఉంచిన స్పెక్ట్రంలో 12 శాతానికి మాత్రమే బిడ్లు వచ్చాయి. గత వేలంలోనే టెల్కోలు గణనీయంగా స్పెక్ట్రం తీసుకోవడంతో నిర్దిష్ట బ్యాండ్లకు ఈసారి పెద్దగా డిమాండ్‌ కనిపించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 900, 1800 మెగాహెర్ట్జ్‌ బ్యాండ్‌లపై ఎక్కువగా ఆసక్తి నెలకొంది. 2022లో జరిగిన స్పెక్ట్రం వేలం బ్లాక్‌బస్టర్‌గా నిల్చింది. అప్పట్లో ఏడు రోజులు సాగిన వేలంలో రూ. 1.5 లక్షల కోట్ల విలువ చేసే స్పెక్ట్రంను టెల్కోలు కొనుగోలు చేశాయి. జియో అత్యధికంగా రూ. 88,078 కోట్లతో దాదాపు సగం స్పెక్ట్రంను దక్కించుకుంది.

ఎయిర్‌టెల్‌ రూ. 6,857 కోట్ల బిడ్‌..

భారతీఎయిర్‌టెల్‌ అత్యధికంగా రూ.6,856.76 కోట్లు, వొడాఫోన్‌ ఐడియా (వీఐఎల్‌) రూ. 3,510 కోట్లు, రిలయన్స్‌ జియో ఇన్ఫోకామ్‌ రూ. 973.6 కోట్ల విలువ చేసే స్పెక్ట్రంను కొనుగోలు చేశాయి. ఎయిర్‌టెల్‌ 97 మెగాహెర్ట్జ్, వీఐఎల్‌ 30 మెగాహెర్ట్జ్, జియో ఇన్ఫోకామ్‌ 14.4 మెగాహెర్ట్జ్‌ దక్కించుకున్నాయి. కస్టమర్లకు మెరుగైన సర్వీసులు అందించేందుకు ఎప్పటికప్పుడు అవసరమైనంత స్పెక్ట్రంను సమకూర్చుకుంటామని భారతీ ఎయిర్‌టెల్‌ ఎండీ గోపాల్‌ విఠల్‌ తెలిపారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌ సర్కిళ్లలో 1,800 మెగాహెర్ట్జ్‌ స్పెక్ట్రంను కొనుగోలు చేయడం ద్వారా తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నట్లు రిలయన్స్‌ జియో ఇన్ఫోకామ్‌ చైర్మన్‌ ఆకాశ్‌ అంబానీ చెప్పారు. నిర్దిష్ట మార్కెట్లలో స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా స్పెక్ట్రంను కొనుగోలు చేసినట్లు వీఐఎల్‌ సీఈవో అక్షయ ముంద్రా తెలిపారు.

సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్‌ వాటా విక్రయం



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్, రవి సంఘీ 3.52% వాటాకు సమానమైన 90,92,000 షేర్లను ఒక్కొక్కటి రూ.90 చొప్పున విక్రయించనున్నారు. ఇందులో అంబుజా సిమెంట్స్‌ 60,92,000 షేర్ల (2.36% వాటా) అమ్మకం చేపట్టనుంది. ఆఫర్‌ ఫర్‌ సేల్‌ నాన్‌ రిటైల్‌ ఇన్వెస్టర్లకు బుధవారం ప్రారంభం అయింది. రిటైల్‌ ఇన్వెస్టర్లకు గురువారం (నేడు) మొదలు కానుందని సంఘీ ఇండస్ట్రీస్‌ ప్రకటించింది. 2024 మార్చి 31 నాటికి సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్‌కు 60.44 శాతం వాటా ఉంది.

రెండో రోజూ రికార్డుల ర్యాలీ

- రిలయన్స్‌ దూకుడు
- బ్యాంకింగ్, ఇంధన షేర్లకు డిమాండ్



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ (4%), ఐసీఐసీఐ బ్యాంక్‌ (2%), ఎయిర్‌టెల్‌ (3%) షేర్లు రాణించడంతో సూచీల రికార్డుల ర్యాలీ రెండో రోజూ కొనసాగింది. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్‌ 706 పాయింట్లు ఎగసి 78,759 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 621 పాయింట్ల లాభంతో 78,674 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169 పాయింట్లు బలపడి 23,890 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 148 పాయింట్లు బలపడి 23,869 వద్ద నిలిచింది. క్రూడ్‌ ధరలు పెరగడం, డాలర్‌ బలపడటంతో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి 83.57 స్థాయి వద్ద స్థిరపడింది.

- సెన్సెక్స్‌ సూచీ మూడు రోజుల ర్యాలీతో బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.2.53 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది.
- రిలయన్స్‌ షేరు 4 శాతం పెరిగి రూ.3,027 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.50% ఎగసి రూ.3,037 జీవితకాల గరిష్టాన్ని తాకింది. మార్కెట్‌ విలువ రూ.80,359 కోట్లు పెరిగి రూ.20.48 లక్షల కోట్లకు చేరింది.
- డీఈఈ డెవలప్‌మెంట్‌ ఇంజనీర్స్‌ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.203)తో 60% ప్రీమియంతో రూ.325 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 80% ఎగసి రూ.366 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 65% లాభంతో రూ.335 వద్ద స్థిరపడింది.
- ఆక్మే ఫిన్‌ట్రేడ్‌ షేరు ఇష్యూ ధర(రూ.120)తో పోలిస్తే బీఎస్‌ఈలో 5% పెరిగి ప్రీమియంతో రూ.126 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌ ఆద్యంతం కొనుగోళ్ల మద్దతు లభించడంతో 10% ఎగసి ఇంట్రాడే గరిష్టం రూ.132 వద్ద స్థిరపడింది.

డాక్టర్‌ రెడ్డీస్‌ చేతికి నికోటినెల్‌ బ్రాండ్



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్‌ రెడ్డీస్‌ ల్యాబొరేటరీస్‌ తాజాగా నికోటిన్‌ రిప్లేస్‌మెంట్‌ థెరపీ (ఎన్‌ఆర్‌టీ)లో ఉపయోగించే బ్రాండ్‌ల కొనుగోలుకు బ్రిటన్‌కు చెందిన కన్జూమర్‌ హెల్త్‌కేర్‌ సంస్థ హెలియోన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌ ప్రకారం హెలియోన్‌ గ్రూప్‌ కంపెనీ నార్త్‌స్టార్‌ స్విట్జర్లాండ్‌ ఎస్‌ఏఆర్‌ఎల్‌ షేర్లను కొనుగోలు చేయనుంది. డీల్‌ విలువ 500 మిలియన్‌ పౌండ్లుగా ఉంటుందని, ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో డీల్‌ పూర్తి కాగలదని డాక్టర్‌ రెడ్డీస్‌ తెలిపింది. అమెరికా వెలుపలి మార్కెట్లలో నికోటినెల్, నికాబేట్, హాబిట్రాల్, థ్రైవ్‌ తదితర బ్రాండ్లను విక్రయించేందుకు ఇది తోడ్పడనుంది.

రూ.10 లక్షల కోట్లు!

- స్వదేశానికి మనోళ్లు పంపిన నిధులివి..
- రెమిటెన్సుల్లో ప్రపంచంలోనే టాప్
- ప్రపంచబ్యాంక్‌ నివేదిక



వాషింగ్టన్: ప్రవాస భారతీయులు స్వదేశం పట్ల అపారమైన అభిమానం చాటుతున్నారు. కష్టార్జితాన్ని తాముంటున్న చోటే దాచుకోకుండా, స్వదేశానికి పెద్ద ఎత్తున పంపిస్తున్నారు. స్వదేశంలో ఇన్వెస్ట్‌ చేస్తున్నారు. మాతృభూమికి నిధులు పంపించడంలో (రెమిటెన్స్‌లు) ప్రపంచదేశాల్లోనే ప్రథమ స్థానంలో నిలుస్తున్నారు. 2023లో 120 బిలియన్‌ డాలర్ల (రూ.10లక్షల కోట్లు సుమారు) రెమిటెన్స్‌లను భారత్‌ అందుకున్నట్టు ప్రపంచబ్యాంక్‌ తాజాగా ప్రకటించింది. అదే ఏడాది మెక్సికోకు వెళ్లిన 66 బిలియన్‌ డాలర్ల రెమిటెన్స్‌లతో పోలిస్తే భారత్‌కు రెట్టింపు వచ్చినట్టు తెలిపింది. ఆ తర్వాత చైనాకు 50 బిలియన్‌ డాలర్లు, ఫిలిప్పీన్స్‌కు 39 బిలియన్‌ డాలర్లు, పాకిస్తాన్‌కు 27 బిలియన్‌ డాలర్ల రెమెటెన్స్‌లు వెళ్లాయి. భారత్‌కు 2023లో అత్యధికంగా అమెరికా, యూఏఈ నుంచే రెమిటెన్స్‌లు వచ్చాయి. సీమాంతర చెల్లింపులకు దీర్హామ్‌-రూపీలను అనుమతించడంతో అధికారిక ఛానళ్ల ద్వారా వచ్చే రెమిటెన్స్‌లు పెరిగినట్టు ప్రపంచబ్యాంక్‌ తెలిపింది. ఇక 2024 సంవత్సరంలో భారత్‌కు 3.7 శాతం అధికంగా 124 బిలియన్‌ డాలర్ల రెమిటెన్స్‌లు రావచ్చని ప్రపంచబ్యాంక్‌ అంచనా వేసింది. 2025లో మరో 4 శాతం పెరిగి 129 బిలియన్‌ డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. భారత్‌ తన యూపీఐని యూఏఈ, సింగపూర్‌తో అనుసంధానించేందుకు చేపడుతున్న చర్యలు వ్యయాలను తగ్గిస్తుందని, ఇది రెమిటెన్స్‌లను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపింది. వలస పోవడం, వారి ద్వారా స్వదేశానికి నిధుల తరలింపు అన్నది ఆర్థిక, మానవాభివృద్ధికి అత్యవసరమని ప్రపంచబ్యాంక్‌లో సామాజిక పరిరక్షణ విభాగం గ్లోబల్‌ డైరెక్టర్‌ ఇఫత్‌ షరీఫ్‌ పేర్కొన్నారు.

వేదాంతా ప్రమోటర్‌కు రూ. 4,184 కోట్లు

2.6 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్‌ రంగ దిగ్గజం వేదాంతా రిసోర్సెస్‌ తాజాగా దేశీ మైనింగ్‌ కంపెనీ వేదాంతా లిమిటెడ్‌లో 2.63% వాటాను విక్రయించింది. షేరుకి రూ. 427.21 సగటు ధరలో 9,79,45,940 షేర్లను అమ్మడం ద్వారా రూ. 4,184 కోట్లు సమీకరించింది. బల్క్‌ డీల్‌ ద్వారా అనుబంధ సంస్థ ఫిన్‌సైడర్‌ ఇంటర్నేషనల్‌ ఈ లావాదేవీని చేపట్టింది. దీంతో వేదాంతాలో ప్రమోటర్, ప్రమోటర్‌ గ్రూప్‌ సంయుక్త వాటా 61.95 శాతం నుంచి 59.32 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో వేదాంతా షేరు దాదాపు 3 శాతం క్షీణించి రూ. 442 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐపీఈ, విశాఖపట్నంలో బీటెక్‌ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రోలియం అండ్‌ ఎనర్జీ (ఐఐపీఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీటెక్‌ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 165.
» సీట్ల వివరాలు: పెట్రోలియం ఇంజనీరింగ్‌-62, కెమికల్‌ ఇంజనీరింగ్‌-63, మెకానికల్‌ ఇంజనీరింగ్‌-40.
» అర్హత: కనీసం 75 శాతం మార్కులతో 12వ తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్‌) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2024లో అర్హత సాధించి ఉండాలి.
» ఎంపిక విధానం: జేఈఈ-అడ్వాన్స్‌డ్‌ 2024 స్కోరు, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
» ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేది:05.07.2024
» వెబ్‌సైట్: https://iipe.ac.in

ఐఐపీఈ, విశాఖపట్నంలో ఎంటెక్‌ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రోలియం అండ్‌ ఎనర్జీ (ఐఐపీఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంటెక్‌ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సుల వివరాలు: వెబ్‌ బేస్డ్‌ ఎంటెక్‌(డేటా సైన్స్‌ అండ్‌ మెషిన్‌ లెర్నింగ్‌) ప్రోగ్రామ్.
» మొత్తం సీట్ల సంఖ్య: 30 సీట్లు.
» అర్హత:కనీసం 55శాతం మార్కులతో బ్యాచిలర్స్‌ డిగ్రీ లేదా మాస్టర్స్‌ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
» ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది: 18.07.2024
» రాతపరీక్ష/ఇంటర్వ్యూ తేదీలు: 22.07.2024, 23.07.2024.
» తరగతుల ప్రారంభం: 12.08.2024.
» వెబ్‌సైట్: https://iipe.ac.in

ఆర్‌ఎంఎల్‌హెచ్, న్యూఢిల్లీలో 140 సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టులు

న్యూఢిల్లీలోని అటల్‌ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (ఆర్‌ఎంఎల్‌హెచ్‌), డాక్టర్‌ రామ్‌ మనోహర్‌ లోహియా హాస్పిటల్‌.. రెగ్యులర్‌ ప్రాతిపదికన సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 140.
» విభాగాలు: ట్రాన్స్‌ఫ్యూజన్‌ మెడిసిన్, కార్డియాక్‌ అనెస్తీషియా, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్‌ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఓ-జీ, మెడిసిన్, మైక్రోబయాలజీ, నియోనాటాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, పీఎంఆర్, రేడియాలజీ, సర్జరీ, అనెస్తీషియా, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫార్మకాలజీ.
» వేతనం: నెలకు రూ.67,700 నుంచి 2,08,700.
» వయసు: 45 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: స్క్రీనింగ్‌ టెస్ట్‌/రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెంట్రల్‌ డైరీ అండ్‌ డిస్పాచ్‌ సెక్షన్,గేట్‌ నెం.3,ఏబీవీఐఎంఎస్‌ అండ్‌ డాక్టర్‌ రామ్‌ మనోహర్‌ లోహియా హాస్పిటల్,న్యూఢిల్లీ-110001చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 29.06.2024.
» రాతపరీక్ష తేది: 28.07.2024.
» వెబ్‌సైట్: https://rmlh.nic.in

ఎస్‌ఎస్‌సీ-సీజీఎల్‌ పరీక్ష-2024

స్టాఫ్‌ సెలక్షన్‌ కమిషన్(ఎస్‌ఎస్‌సీ).. కంబైన్డ్‌ గ్రాడ్యుయేట్‌ లెవల్(సీజీఎల్‌) పరీక్ష-2024కు సంబంధించి వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని గ్రూప్‌-బి, గ్రూప్‌-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17,727.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్‌ సెక్షన్‌ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ ఇన్‌కమ్‌ ట్యాక్స్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫీసర్, సబ్‌ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్‌ అసిస్టెంట్, రీసెర్చ్‌ అసిస్టెంట్, జూనియర్‌ స్టాటిస్టికల్‌ ఆఫీసర్, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ /జూనియర్‌ ఇంటెలిజెన్స్‌ ఆఫీసర్, ఆడిటర్, అకౌంటెంట్, అకౌంటెంట్‌/జూనియర్‌ అకౌంటెంట్, పోస్టల్‌ అసిస్టెంట్‌/సార్టింగ్‌ అసిస్టెంట్, సీనియర్‌ సెక్రటేరియట్‌ అసిస్టెంట్‌/అప్పర్‌ డివిజన్‌ క్లర్క్, సీనియర్‌ అడ్మినిస్ట్రేటివ్‌ అసిస్టెంట్, టాక్స్‌ అసిస్టెంట్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: టైర్‌-1, టైర్‌-2 తదితర పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
» ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది: 24.06.2024.
» ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది: 24.07.2024
» వెబ్‌సైట్: https://ssc.gov.in

కోర్సు, కాలేజీ.. ఎంపిక ఎలా!

బీటెక్.. ఇంజనీరింగ్‌ కోర్సుతో ఉజ్వల కెరీర్‌ అందుకోవచ్చనే అభిలాష! మెడిసిన్.. ఎంబీబీఎస్, బీడీఎస్‌లతో వైద్య రంగంలో స్థిరపడొచ్చనే ఆశయం! ఇందుకోసం సంబంధిత ఎంట్రన్స్‌లకు లక్షల మంది విద్యార్థులు హాజరై.. ఉత్తీర్ణత సాధించిన పరిస్థితి! అదే సమయంలో తాము సాధించిన ర్యాంకుకు.. నచ్చిన కోర్సులో, కాలేజీలో సీటు వస్తుందో లేదో అనే సందేహం! ముఖ్యంగా ఇంజనీరింగ్‌లో ఎన్నో బ్రాంచ్‌లు, వందల సంఖ్యలో కాలేజీలు!! ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల్లో చేరే విద్యార్థులు కోర్సు, కాలేజ్‌ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

» ఇంజనీరింగ్, మెడికల్‌ కోర్సుల్లో ప్రవేశాల సమయం
» కోర్సు, కాలేజ్‌లలో దేనికి ప్రాధాన్యం అనే సందిగ్ధత
» ఆసక్తికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలంటున్న నిపుణులు



కోర్సు, కాలేజ్‌ ఎంపికలో ముందుగా కోర్సు/బ్రాంచ్‌కే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బ్రాంచ్‌ ఎంపికలో విద్యార్థులు తమ ఆసక్తిని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. కేవలం క్రేజ్‌ కోణంలోనే బ్రాంచ్‌లను ఎంపిక చేసుకుంటే.. అకడమిక్‌గా రాణించలేకపోవచ్చు. ఇది భవిష్యత్తు గమ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారముంది. కాబట్టి బ్రాంచ్‌ ఎంపికలో అందుబాటులో ఉన్న బ్రాంచ్‌ల సిలబస్,కరిక్యులం స్వరూపాన్ని పరిశీలించి తమ సహజ ఆసక్తికి అనుగుణంగా ఉండే బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి.

ఇన్‌స్టిట్యూట్‌ కీలకమే

ఇంజనీరింగ్, మెడిసిన్‌ వంటి ప్రొఫెషనల్‌ కోర్సులకు ఇన్‌స్టిట్యూట్‌ ఎంపిక కూడా ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ఈఏపీసెట్‌ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఇంజనీరింగ్‌ కోర్సుల్లో దాదాపు అందరికీ సీట్లు లభిస్తాయి. కానీ.. పేరున్న కాలేజీలో చేరితే నాణ్యమైన బోధనతోపాటు మెరుగైన ప్లేస్‌మెంట్స్‌ అవకాశాలు అందుకునే వీలుంటుంది.

నిబంధనలు పాటిస్తున్నాయా

ఇన్‌స్టిట్యూట్‌ ఎంపికలో విద్యార్థులు.. సదరు ఇన్‌స్టిట్యూట్స్‌ ఏఐసీటీఈ నిబంధనలను పాటిస్తున్నాయా.. లేదా.. అనే విషయాన్ని పరిశీలించాలి. కరిక్యులం, ఫ్యాకల్టీ, ల్యాబ్‌ సౌకర్యం వంటి కీలక అంశాలు మొదలు.. ఎక్స్‌ట్రా కరిక్యులర్‌ యాక్టివిటీస్‌ వరకూ.. అన్నీ నిబంధనల మేరకు ఉన్నాయా లేదో గమనించాలి. ఈ సమాచారం ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. ఒకవేళ అందులో సమాచారం లేకపోతే ప్రత్యక్షంగా కళాశాలలను పరిశీలించి సదరు సమాచారం తెలుసుకోవాలి.

ఎన్‌బీఏ గుర్తింపు

ఆసక్తి ఉన్న బ్రాంచ్‌ విషయంలో సదరు ఇన్‌స్టిట్యూట్‌కు ఎన్‌బీఏ గుర్తింపు ఉందా? లేదా? అనే విషయం కూడా పరిగణించాలి. కారణం.. ఎన్‌బీఏ గుర్తింపు బ్రాంచ్‌ వారీగా ఉంటుంది. కొన్ని కళాశాలలు మొత్తం బ్రాంచ్‌లలో ఒకట్రెండు బ్రాంచ్‌లకే ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నా.. ఎన్‌బీఏ అక్రెడిటెడ్‌ అని వెబ్‌సైట్లలో ఆకర్షణీయంగా ప్రకటనలిస్తున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కాలేజ్.. ఇమేజ్

విద్యార్థులు కాలేజ్‌ ఎంపికలో పరిగణించాల్సిన మరో విషయం.. కాలేజ్‌కు ఉన్న గుర్తింపు. ఇండస్ట్రీ వర్గాల్లో ఇన్‌స్టిట్యూట్‌కు ఎలాంటి గుర్తింపు ఉందో తెలుసుకోవడం మేలు చేస్తుంది. ఇందుకోసం విద్యార్థులకు ఉపకరించే సాధనం గత ఏడాది సదరు కాలేజ్‌లో సీట్ల భర్తీలో ఓపెనింగ్‌-క్లోజింగ్‌ ర్యాంకుల వివరాలు. ఉదాహరణకు ఓయూసీఈ, ఏయూసీఈ వంటి యూనివర్సిటీ క్యాంపస్‌ కళాశాలలు, అదే విధంగా కొన్ని ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో ఈసీఈ, సీఎస్‌ఈ, ట్రిపుల్‌ఈ వంటి బ్రాంచ్‌లలో లాస్ట్‌ ర్యాంకు 1500 నుంచి 2000 లోపే ఉంటోంది. అంటే.. ఆ కళాశాలలు అనుసరిస్తున్న ప్రమాణాలు, ఇండస్ట్రీలో ఉన్న పేరు, ప్లేస్‌మెంట్స్‌ ఆధారంగా టాప్‌ ర్యాంకర్ల ఆదరణ పొందుతున్నాయని చెప్పొచ్చు.

బోధన విధానాలు

విద్యార్థులు కాలేజ్‌ ఎంపికలో బోధన పద్ధతుల విషయంలోనూ దృష్టి పెట్టాలి. ఒక కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ.. టీచింగ్‌ విధానంలో లోపాలు ఉండొచ్చు. ఈ విషయాన్ని కూడా ప్రత్యక్షంగా పరిశీలించాలి. టీచింగ్‌ పరంగా అనుసరిస్తున్న విధానం,ప్రాక్టికల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, అందులో విద్యార్థులను మమేకం చేస్తున్న తీరుతెన్నులపై సునిశిత పరిశీలన చేయాలి. కొన్ని కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనల మేరకు తమ కళాశాలలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ ఉన్నారని ప్రకటనలిస్తుంటాయి. ఫ్యాకల్టీ అర్హతలతోపాటు క్లాస్‌ రూంలో స్టూడెంట్స్‌తో ఇంటరాక్షన్, సందేహాల నివృత్తి వంటివి కూడా తెలుసుకోవాలి.

క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్స్

బీటెక్‌ కోర్సులో చేరే లక్ష్యం.. క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌ అనేది నిస్సందేహం. నాలుగేళ్ల బీటెక్‌ కోర్సులో చేరే ప్రతి విద్యార్థి ప్రధాన ఉద్దేశం భవిష్యత్తులో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోవడం. కాబట్టి కళాశాలలను ఎంపిక చేసుకునేటప్పుడు ఆ ఇన్‌స్టిట్యూట్‌లో గత నాలుగేళ్ల ప్లేస్‌మెంట్‌ రికార్డ్స్‌.. ఎలాంటి కంపెనీలు వస్తున్నాయి. వచ్చిన కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలు ఆఫర్‌ చేస్తున్నాయో తెలుసుకోవాలి.

నచ్చిన కాలేజీలో సీటు రాకుంటే

నచ్చిన కాలేజ్‌లో సీటు రాకుంటే ఏం చేయాలి? అనే ప్రశ్న ఎక్కువ మంది విద్యార్థులకు ఎదురవుతుంది. కొన్నిసార్లు కౌన్సెలింగ్‌లో విద్యార్థి ఎంపిక చేసుకున్న కళాశాలలో ప్రవేశం దక్కకపోవచ్చు. అందుకు విద్యార్థులు ముందుగానే మానసికంగా సిద్ధంగా ఉండాలి. మెచ్చిన కాలేజ్‌లో సీటు రాకపోయినా.. అకడమిక్‌గా రాణించేందుకు స్వయం కృషి చేయాలి. ఫ్యాకల్టీ లేరనో లేదా సదుపాయాలు లేవనో అభ్యసనాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. సెల్ఫ్‌ లెర్నింగ్‌ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెట్‌ ఆధారంగా అనంతమైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ-లెర్నింగ్‌ పోర్టల్స్‌ ఆవిష్కృతమవుతున్నాయి. ఆన్‌లైన్‌ లెక్చర్స్, వర్చువల్‌ క్లాస్‌రూమ్స్, వర్చువల్‌ లేబొరేటరీ వంటి సదుపాయాలు సైతం లభిస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని తమను తాము తీర్చిదిద్దుకోవాలి.

మెడిసిన్‌లోనూ.. అప్రమత్తంగా

ఎంబీబీఎస్, బీడీఎస్‌ వంటి మెడిసిన్‌ కోర్సుల అభ్యర్థులు సైతం కాలేజీ, కోర్సు ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రస్తుతం తమకు వచ్చిన ర్యాంకు.. గత ఏడాది అదే ర్యాంకుకు సీట్లు ఖరారైన ఇన్‌స్టిట్యూట్‌లను గుర్తించాలి. అలా గుర్తించిన ఇన్‌స్టిట్యూట్స్‌లో.. పేరున్న ఇన్‌స్టిట్యూట్‌ల జాబితా సిద్ధం చేసుకోవాలి. ఇందుకోసం.. హెల్త్‌ యూనివర్సిటీలు విడుదల చేసే ల్యాస్ట్‌ ర్యాంక్స్‌ గణాంకాలను పరిశీలించాలి. తాము ప్రస్తుతం పొందిన ర్యాంకు.. గత ఏడాది ఆయా ఇన్‌స్టిట్యూట్స్, కోర్సులలో సీట్లు లభించిన లాస్ట్‌ ర్యాంక్‌లను గుర్తించి.. కళాశాలలు, కోర్సుల ఎంపిక కసరత్తు చేయాలి.

ఆల్‌ ఇండియా కోటా

ఎంబీబీఎస్, బీడీఎస్‌ కోర్సుల్లో ప్రవేశాలకు ఆల్‌ ఇండియా కోటా విధానం అమల్లో ఉంది. దీని ద్వారా నీట్‌ ఉత్తీర్ణులు ఇతర రాష్ట్రాల్లోని మెడికల్‌ కళాశాలల్లో 15 శాతం సీట్లకు పోటీ పడే అవకాశం ఉంది. ఈ కోటాలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు.. ఈ ప్రక్రియలో పాల్గొంటున్న ఇన్‌స్టిట్యూట్స్, వాటి ప్రామాణికతను పరిశీలించాలి. దాని ఆధారంగా..ఆన్‌లైన్‌ కౌన్సెలింగ్‌లో ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఒకవేళ తొలి దశలో తమకు నచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు రాకున్నా.. మలి దశ కౌన్సెలింగ్‌లో అవకాశం దక్కించుకునేలా ప్రయత్నించాలి.

ప్రత్యామ్నాయాలకు సిద్ధంగా

బీటెక్, ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్‌ విద్యార్థులు కోరుకున్న కోర్సులో సీటు రాకుంటే.. ప్రత్యామ్నాయ కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉండాలి. ఉదాహరణకు..బీటెక్‌ విద్యార్థుల్లో అధిక శాతం మంది సీఎస్‌ఈకి తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఈ బ్రాంచ్‌లో సీటు రాకపోతే.. ఎలాంటి ఆందోళన చెందక్కర్లేదు. ఎందుకంటే.. ఇప్పుడు పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో సీఎస్‌ఈలోనే ఏఐ-ఎంఎల్‌ బ్రాంచ్‌ను ప్రత్యేకంగా అందిస్తున్నారు. కాబట్టి సీఎస్‌ఈ రాకపోయినా.. ఏఐ-ఎంఎల్‌ కోర్సుల్లో చేరొచ్చు. అదేవిధంగా మెడిసిన్‌కు సంబంధించి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్‌ లభించకుంటే.. బీడీఎస్‌లో చేరొచ్చు. ఒకవేళ ఈ రెండు కోర్సుల్లోనూ సీటు లభించకపోతే.. ప్రత్యామ్నాయంగా ఉన్న ఆయుష్‌ కోర్సులపై దృష్టి సారించొచ్చు. బైపీసీ విద్యార్థులకు అగ్రికల్చర్‌ కోర్సులు కూడా చక్కటి ప్రత్యామ్నాయాలుగా నిలుస్తున్నాయి. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ప్రత్యామ్నాయ కోర్సులను ఎంచుకోవచ్చు.

ఆసక్తికి ప్రాధాన్యం

వందల సంఖ్యలో ఇన్‌స్టిట్యూట్స్, కోర్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ముందుగా తమ ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలనేది నిపుణుల అభిప్రాయం. ఆసక్తికి భిన్నంగా ఇతరుల ఒత్తిడితో ఇష్టంలేని కోర్సులో చేరితే.. అది భవిష్యత్తులో ప్రతికూల ప్రభావం చూపుతుందని అంటున్నారు. ఏఐసీటీఈ నిబంధనల మేరకు.. బోధన పద్ధతులు పాటించే ఇన్‌స్టిట్యూట్‌లో తమకు నచ్చిన బ్రాంచ్‌లో చేరడం మేలంటున్నారు. ఆ తర్వాత స్వీయ అభ్యసనానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా...



కూరగాయల పరిశోధన కేంద్రానికి
జాతీయ అవార్డు

ఏజీవర్సిటీ (రాజేంద్రనగర్): శ్రీ కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కూరగాయల పరిశోధన కేంద్రానికి జాతీయ ఉత్తమ పరిశోధన కేంద్రంగా 2023–2024 ఏడాదికి గాను అవార్డు దక్కింది. ఈ నెల 25 నుంచి 27 వరకు గుజరాత్‌లోని నవసారిలో జరుగుతున్న అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం (దుంప పంటలు)వార్షిక సమావేశాల్లో విశ్వ విద్యాలయం తరపున పాల్గొన్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వీరా సురేశ్ ఈ అవార్డును అందుకున్నారు. తమ పరిశోధన కేంద్రానికి జాతీయస్థాయిలో ఉత్తమ కేంద్రంగా గుర్తింపు రావడంతో ఎంతో సంతోషంగా ఉందని పరిశోధన సంచాలకుడు డాక్టర్ కిరణ్‌కుమార్, దక్షిణ తెలంగాణ వ్యవసాయ వాతావరణ ప్రాంత జోనల్ హెడ్ డాక్టర్ సురేశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూరగాయల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనితా కుమారి, డాక్టర్ వీరా సురేశ్‌తో పాటు కేంద్రంలోని శాస్త్రవేత్తలను అభినందించారు.

చేనేత అవార్డులకు
దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించినట్టు చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు శైలజా రామయ్యర్ తెలిపారు. ఈ మేరకు చేనేత కళాకారులు, డిజైనర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చేనేత కళా కారులకు 2023 నాటికి 30 ఏళ్ల వయసు, పదేళ్ల అనుభవం ఉండాలని, చేనేత డిజైనర్లకు 2023 నాటికి 25 ఏళ్ల వయసు, ఐదేళ్ల అనుభవం ఉండాలని స్పష్టం చేశారు. దరఖా స్తులను జిల్లా చేనేత జౌళి, సహాయ సంచాలకులకు సమర్పించాలని, మరిన్ని వివరాలకు www.tsht.telangana.gov.inలో చూడాలని శైలజా రామయ్యర్ సూచించారు.

రాష్ట్రంలో విదేశీ మీడియా
ప్రతినిధుల పర్యటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు పది దేశాల మీడియా ప్రతినిధులు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో.. 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. వీరిలో జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్క్‌మెనిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, మంగోలియా, కజకిస్తాన్ తదితర దేశాల మీడియా ప్రతినిధులు ఉన్నారు. వీరు బుధవారం గోల్కొండ కోట, శిల్పారామం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, స్కై రూట్ ఎయిరో స్పేస్ సెంటర్, టీ–హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, రామోజీ ఫిల్మ్‌సిటీలను సందర్శించారు.

తేలని 'కన్వీనర్' లెక్కలు..
యాజమాన్య కోటాకు రెక్కలు!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లోని కన్వీనర్ సీట్లపై అయోమయం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లు ఎన్నో ఇంకా లెక్క తేలలేదు. ప్రైవేటు కాలేజీలు మాత్రం యాజమాన్య కోటా సీట్లను ఇప్పటికే దాదాపు అమ్మేసుకున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. అన్నీ తెలిసినా అధికారులు తామేమీ చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే యాజమాన్య కోటా సీట్లు భర్తీ చేయాలి. కానీ అనధికారికంగా కాలేజీలు బేరాలు కుదుర్చుకుని సీట్లు అమ్మేసుకుంటున్నాయి. సీట్లు ఎప్పుడో అయిపోయాయంటూ ప్రధాన ప్రైవేటు కాలేజీలు చెబుతున్నాయి.

- ఇప్పటివరకు కౌన్సెలింగ్ విభాగానికి అందని వివరాలు
- వివరాలు ఆన్‌లైన్‌లో ఫీడ్ చేస్తేనే ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం
- యాజమాన్య కోటా సీట్లు మాత్రం అనధికారికంగా భర్తీ
- అప్పుడే సీట్లు లేవని చెబుతున్న విద్యా సంస్థలు



ఆగిన అనుబంధ గుర్తింపు ప్రక్రియ

ఈ ఏడాది కన్వీనర్ కోటాలో ఎన్ని సీట్లు ఉంటాయనే లెక్క ఇప్పటివరకు తేలలేదు. అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఆగిపోవడంతో ఇప్పటివరకు ఈఏపీసెట్ కౌన్సెలింగ్ విభాగానికి సీట్ల లెక్క రాలేదు. ఏ బ్రాంచిలో ఎన్ని సీట్లున్నాయి? ఏ కాలేజీలో ఎన్ని సెక్షన్లు, ఏయే సీట్లు లెక్క అందాల్సి ఉంది. ఇవన్నీ ఆన్‌లైన్‌లో ఫీడ్ చేయాలి. అప్పుడే విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వడానికి వీలవుతుంది. అఫ్లియేషన్ ఇవ్వని కారణంగా సీట్ల లెక్క తెలియని నేపథ్యంలో ఈఏపీ కౌన్సెలింగ్ ప్రక్రియను జూన్ 27 నుంచి జూలై 7కు వాయిదా వేశారు.

ఆ సీట్లన్నీ ఎప్పుడో సేల్

రాష్ట్రంలో 1.22 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ఇందులో 82 వేల వరకూ కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మిగతా సీట్లలో సగం ఎన్‌ఆర్‌ఐ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలకు ఎక్కువ ఫీజుతో దీన్ని కేటాయిస్తారు. మిగిలిన సగం సీట్లను 'బి'కేటగిరీ కింద భర్తీ చేస్తారు. దీనికీ కొన్ని నిబంధనలున్నాయి. తొలుత జేఈఈ ర్యాంకర్లకు ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాత ఎంసెట్, దీని తర్వాత ఇంటర్ మార్కులను బట్టి సీట్లు ఇవ్వాలి. ఇదంతా ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చాకే జరగాలి. కానీ కాలేజీలు ముందే తల్లిదండ్రులతో బేరాలు కుదుర్చుకుంటున్నాయి. అనధికారి కంగా సీట్లు ఇస్తూ డబ్బులు తీసుకుంటున్నాయి. నోటిఫికేషన్ వచ్చాక అధికారికంగా ప్రకటిస్తామంటున్నాయి. ఈఏపీ సెట్ ఫలి తాలు వెల్లడై మర్నాడు నుంచే బేరసారాలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు కాలేజీలకు వెళ్ళినా సీట్లు లేవని, కంప్యూటర్ సీట్ల గురించి మాట్లాడే పరిస్థితే లేదని చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ రెడీగా ఉన్నా..

యాజమాన్య కోటా సీట్లను ఎంబీబీఎస్ తరహాలో ఆన్‌లైన్ పద్ధతిలో భర్తీ చేయాలని కొన్నేళ్ళుగా డిమాండ్ వస్తోంది. ఈ ఏడాది దీనిపై కసరత్తు చేస్తున్నామని విద్యాశాఖ ముఖ్య అధికారి కూడా ఈఏపీ సెట్ ఫలితాల విడుదల సందర్భంగా తెలిపారు. ఉన్నత విద్యా మండలికి ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ అందించేందుకు కూడా ఓ ప్రముఖ సంస్థ ముందుకొచ్చింది. కానీ దీనివల్ల తమ ఆదాయానికి గండి పడుతుందంటూ ప్రైవేటు కాలేజీలు ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే ఈ ప్రక్రియ ఆగిపోయిందని కౌన్సిల్ వర్గాలు అంటున్నాయి. ప్రైవేటు కాలేజీలన్నీ ప్రముఖ రాజకీయ నేతల చేతుల్లో ఉండటం వల్ల ఆన్‌లైన్ విధానంలో బీ కేటగిరీ సీట్ల కేటాయింపు చేపట్టాలంటే ప్రభుత్వం అనుమతించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సీఎస్‌ఈ బ్రాంచ్ హాట్ కేక్

ప్రధాన కాలేజీల్లో ఈ ఏడాది కంప్యూటర్ సైన్స్ బ్రాంచి సీట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ధనవంతులైన తల్లిదండ్రులు సీట్లను ఎంతంటే అంతకు కొనేశారు. వీళ్ళలో ఎక్కువ మంది ఈఏపీసెట్‌లో కేవలం క్వాలిఫై అయిన, ఇంటర్ మార్కులు అతి తక్కువగా వచ్చిన పిల్లల తల్లిదండ్రులే ఉన్నారు. కంప్యూటర్ సైన్స్‌ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి బ్రాంచీల సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 58 శాతం వరకు సీట్లు ఈ బ్రాంచీల్లోనే ఉన్నాయి. ఈ ఏడాది ఇంకా పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ అంచనాలను బేరీజు వేసుకుని మరీ ప్రైవేటు కాలేజీలు సీట్లు అమ్మేసుకున్నాయి. బీ కేటగిరీ సీట్లకు ఎవరు దరఖాస్తు చేశారనే విషయంలో పారదర్శకత లేకపోవడం, ఆధారాలతో ఫిర్యాదు చేసే వారూ లేకపోవడంతో తామేమీ చేయలేమని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో ఒక్కో సీటుకు రూ.14 లక్షల నుంచి రూ.19 లక్షల వరకు తీసుకున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా తెలుస్తోంది.

ఆహార ఉత్పత్తుల పేరుతో ఔషధ విక్రయం

- డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు
- పలువురిపై కేసులు నమోదు
- మందులు స్వాధీనం... క్లినిక్ సీజ్



సాక్షి, హైదరాబాద్: ఆహార ఉత్పత్తుల పేరుతో తప్పుడు ఔషధ విక్రయాలు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఆహార ఉత్పత్తులు/ న్యూట్రాస్యూటికల్ పేరుతో అనుమతి లేకుండా, అధిక ధరకు మందులు అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు.. డ్రగ్ కంట్రోల్ అధికారులు రెండు రోజులుగా దాడులు నిర్వహించారు. వివరాలివి. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి కాప్రాలో మూపిపాన్ అనే ఆయింట్‌మెంట్, 200 గ్రాముల కామారెడ్డి జాండి క్యాప్సూల్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా అమ్ముతున్నట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న మరికొన్ని మందులను కూడా గుర్తించారు. పిల్లలకు జ్వరం నయం చేస్తుందంటూ సుప్రాల్ అల్లోపతి ఔషధాన్ని అమ్ముతున్నట్టు గుర్తించారు. శ్రీతులసి డ్రాప్స్ జ్వరానికి, తులసి జింజర్ డ్రాప్స్ న్యూమోనియాకు పని చేస్తాయని తప్పుడు ప్రచారం చేస్తూ విక్రయిస్తుండటంపై డ్రగ్ కంట్రోల్ చర్యలు చేపట్టింది. వనపర్తి, గోపాల్‌పేట్ మండలం తాడిపర్తిలో ఒక క్లినిక్‌పై దాడులు నిర్వహించి అమ్మకానికి నిల్వ చేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా 52 రకాల మందులు నిల్వ చేయడంపై కేసు నమోదు చేశారు. లక్షల విలువైన మందులను సీజ్ చేసి క్లినిక్‌ను సీజ్ చేశారు. సిద్దిపేట మండలంలో కాల్‌గ్రిప్ టాబ్లెట్లను ఫుడ్ లైసెన్స్‌తో అమ్ముతున్నట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు అసురా థెరప్యూటిక్ ప్రైవేట్ లిమిటెడ్‌పై దాడి చేశారు. ఈ దాడుల్లో ఖైరతాబాద్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, శేరిలింగంపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శైలజ, షామీర్‌పేట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్, మెహదీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.సంతోష్ ఉన్నారు. తెలంగాణ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధనల మేరకు అమ్మకాలు జరపకుంటే చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ జనరల్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ వి.బి.కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా డ్రగ్స్ నిల్వ చేయడం, అమ్మడం నేరమని పేర్కొన్నారు. ఇలాంటి వారి వివరాలను టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు తెలియజేయాలని సూచించారు.

ప్రధానితో హరియాణా గవర్నర్
బండారు దత్తాత్రేయ భేటీ



ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన కుటుంబ సభ్యుల తో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. బుధవారం పార్లమెంట్ భవనంలో మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్న దత్తాత్రేయ.. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. మూడోసారి దేశానికి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినందుకు నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హరియాణాలో జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై మోదీతో చర్చించారు. ప్రధానిని దత్తాత్రేయ సతీమణి బండారు వసంత, వారి కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు బి.జిగ్నేశ్‌రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధరరెడ్డి, వేదాన్షిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని యశోధర, వేదాన్షిలతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ప్రధాని కోసం వీరిద్దరూ హిందీలో రెండు పాటలు పాడారు.



ఇద్దరు విద్యార్థులు.. ఒక టీచర్

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపేట గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయురాలు బోధిస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్నాయి. సొంత భవనమూ ఉంది. రెండేళ్ల క్రితం సుమారు 60 మంది విద్యార్థులు ఉండేవారు. ఆ తరువాత తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై ఆసక్తి చూపడంతో సంఖ్య రెండుకు పడిపోయింది. ఉన్న ఇద్దరు విద్యార్థులు కూడా 2వ తరగతిలో కొనసాగుతున్నారు. ఇటీవల నిర్వహించిన బడిబాటలోనూ స్కూల్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు.

– కాజీపేట అర్బన్



ప్రభుత్వ కాలేజీ 'ఫ్లెక్సీ'

సిరిసిల్ల/ సిరిసిల్ల కల్చరల్: 'చదువుకునే వారికి చదువు'కొనే' అవసరం లేదంటూ'.. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించిన విజయాలను తెలుపుతూ స్థానిక పాతబస్టాండులోని నేతన్న చౌక్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. నిజానికి ఇలాంటి రద్దీ ప్రదేశాల్లో ప్రైవేటు కళాశాలల ఫ్లెక్సీలు కనిపిస్తుంటాయి. కానీ సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ తమ కాలేజీ విద్యార్థులు సాధించిన విజయాలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. లక్షలు అవసరం లేకుండా లక్షణమైన ఇంజనీరింగ్ విద్య చదివే అవకాశం లభిస్తుందని అందులో పేర్కొన్నారు. ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు వస్తే ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని అందులో వివరించారు. ప్రభుత్వ కాలేజీలో చదివితే కలిగే ప్రయోజనాలు సైతం వివరించారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించిన ఇంజనీరింగ్ సీట్ల వివరాలు, వారు సాధించిన మార్కులు అందరికీ తెలిసేలా ఏర్పాటు చేశారు. ఓ ప్రభుత్వ కళాశాల ప్రైవేటుకు దీటుగా తాము సాధించిన ఫలితాలను తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం గమనార్హం.

ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ

43 ఏళ్ల వయసులో రికార్డ్ సృష్టించిన క్వీని విక్టోరియా





కాచిగూడ: ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్ట్‌గా పిలిచే ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా ఓపెన్ వాటర్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా రికార్డు నెలకొల్పారు. మహబూబ్‌నగర్ జిల్లా అమనగల్‌కు చెందిన విక్టోరియా హైదరాబాద్‌లో స్థిరపడి ఓపెన్ వాటర్ స్విమ్మర్‌గా రాణిస్తున్నారు. 43 ఏళ్ల వయసులో ఇంగ్లిష్ చానల్‌ను ఈది రికార్డ్ నెలకొల్పారు. భారత్ తరపున ఇంగ్లిష్ చానెల్‌ను ఈదడానికి విక్టోరియా 8 మంది బృందంతో కలిసి ఇంగ్లండ్‌కు వెళ్లారు. ఈ నెల 24న బ్రిటిష్ కాలమానం ప్రకారం.. రాత్రి 10.46 గంటలకు ఇంగ్లండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి ఈ నెల 25న సాయంత్రం 4.16 గంటలకు ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచి కోస్ట్‌కు చేరారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఇంగ్లిష్ చానల్‌గా పిలుస్తారు. ఈ రెండు దేశాల మధ్య 36 కి.మీ. దూరం ఉండగా రాత్రి వేళల్లో అలల తాకిడి అధికంగా ఉండడం వల్ల 71 కి.మీ. మేర క్రాస్ స్విమ్మింగ్ చేసి 16.50 గంటల్లో ఇంగ్లిష్ చానల్‌ను ఈదినట్లు విక్టోరియా చెప్పారు. ఇంగ్లిష్ చానల్‌ను ఈదడం సంతోషంగా ఉందని, దీన్ని తెలుగు ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.